


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 163

మంగళవారం 27-2-2024

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




కుర్రాళ్లు కొట్టేశారు...

నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ గెలుపు. సిరీస్ 3–1తో సొంతం. – 10లో



గాజాలో ఆకలి కేకలు

గాజాలోని 23 లక్షల మంది జనాభా ఆహార కొరతతో అల్లాడుతున్నారు. – 6లో



మేమొస్తే 'అగ్నిపథ్' రద్దు: ఖర్గే

యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్న అగ్నిపథ్ పథకాన్ని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అన్నారు.

- వివరాలు 6లో



భారతీయులు వెనక్కి..

ఉక్రెయిన్- రష్యా యుద్ధంలో రష్యా సైన్యానికి సహాయకులుగా ఉన్న భారతీయ యువకుల్లో కొందరిని సురక్షితంగా తిరిగి పంపించారు.


- వివరాలు 6లో



జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్

563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

- వివరాలు 12లో



ఆశలతో ఉచ్చు.. ఎన్నో ఇళ్లలో చిచ్చు

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చేరిన చందాదారుల ఇళ్లలో ఆనందం ఆవిరవుతోందన్నది పచ్చి నిజం.

- వివరాలు 5లో

ఈ నగరానికి ఏమైంది!

డ్రగ్ పార్టీ.. అరెస్ట్



వివేకానంద్


- మంజీరా గ్రూప్ డైరెక్టర్ గజ్జల వివేకానంద్ అరెస్ట్
- కేదార్, నిర్భయ్ అనే మరో ఇద్దరు ప్రముఖులు కూడా..
- వైద్య పరీక్షల్లో ముగ్గురూ కొకైన్ వినియోగించినట్లుగా నిర్ధారణ
- పలువురు వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలపై కేసులు నమోదు
- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడి
- వివేకానంద్‌కు బెయిల్ మంజూరు

గచ్చిబౌలి (హైదరాబాద్): హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో డ్రగ్ వినియోగించిన కేసులో హైదరాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, మంజీరా గ్రూప్ చైర్మన్ గజ్జల యోగానంద్ కుమారుడు, ఆ సంస్థ డైరెక్టర్ గజ్జల వివేకానంద్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాడిసన్ హోటల్ ఈ గ్రూప్‌దే కావడం గమనార్హం . కాగా ఇదే కేసులో నిర్భయ్, శెలగంశెట్టి కేదార్ అనే మరో ఇద్దరు ప్రముఖులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. పలువురు వ్యాపారవేత్తలు, సినీ సెలబ్రిటీలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కేదార్‌కు పలువురు సినీ ప్రముఖులతో సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం గచ్చిబౌలిలోని కార్యాలయంలో సీపీ మహంతి వివరాలు వెల్లడించారు.

సొంత హోటల్‌లో 10 మందితో కలిసి..'

శనివారం రాత్రి రాడిసన్ హోటల్‌లో కొకైన్‌తో పార్టీ నిర్వహించినట్లు సమాచారం అందింది. దీంతో సైబరాబాద్ ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు హోటల్‌లో సోదాలు మిగతా 3వ పేజీలో ▶

ఉడ్తా షెహర్



- హైదరాబాద్‌ను ముంచెత్తుతున్న డ్రగ్స్.. గంజాయి, హెరాయిన్, కొకైన్ ఏది కావాలంటే అది..
- నిఘాకు చిక్కకుండా ఎప్పటికప్పుడు కొత్త పంథాలో దందా
- పబ్‌లు, హోటళ్లు, రిసార్టుల్లో నిరాటంకంగా రేవ్ పార్టీలు
- పట్టుబడుతున్న వారిలో ప్రముఖులు.. సంచలనం సృష్టించిన 'రాడిసన్' కేసు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ డ్రగ్స్ అడ్డాగా మారుతోంది. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేసే మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు నగరంలో జోరుగా సాగుతున్నాయి. గంజాయి ఆకులతో తయారు చేసే హష్ ఆయిల్ మొదలుకుని, కొకైన్, హెరాయిన్, బ్రౌన్‌షుగర్, ఎండీఎంఏ, ఎల్ఎస్డీ బ్లాట్స్ లాంటి ఖరీదైన సింథటిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా లభిస్తున్నాయి. పాఠశాల విద్యార్థుల నుంచి కాలేజీ కుర్రాళ్ల వరకు.. ప్రైవేట్ ఉద్యోగుల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణుల వరకు.. వైద్యులు, వ్యాపారవేత్తలతో పాటు సినీ ప్రముఖులు సైతం వీటి బారిన పడ్డట్టు తెలుస్తోంది. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎంత నిర్బంధం విధిస్తున్నా.. వాళ్ల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ డ్రగ్ పెడ్లర్స్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన పార్టీలో దాని యజమాని కుమారుడు సహా పలువురు ప్రముఖులపై కేసులు నమోదు కావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఇంటర్‌నెట్‌లో డార్క్ వెబ్ ద్వారా కావాల్సిన డ్రగ్‌ను ఎంచుకోవడం.. సోషల్ మీడియా యాప్ ద్వారా సరఫరాదారుడిని సంప్రదించడం.. బిట్ కాయిన్స్ రూపంలో నగదు చెల్లించడం.. డెడ్ డ్రాప్ లేదా కొరియర్ ద్వారా సరుకు తెప్పించుకోవడం..ఇలా పూర్తి వ్యవస్థీకృతంగా మాదకద్రవ్యాల దందా సాగిపోతోంది. వారాంతంలో హోటళ్లు, పబ్‌లు, రిసార్టుల్లో యథేచ్ఛగా మిగతా 3వ పేజీలో ▶



సింగరేణి కార్మికుల ప్రమాద బీమా పథకం ఎంఓయూ పత్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి, వివిధ బ్యాంకుల అధికారులు

సింగరేణి కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల సమక్షంలో బ్యాంకర్లతో సింగరేణి ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మందికిపైగా కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. సోమవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సమక్షంలో జీరో ప్రీమియంతో రూ. కోటి ప్రమాద బీమా కల్పించే ఒప్పందంపై సింగరేణి సీఎండీ ఎన్. బలరాం, వివిధ బ్యాంకుల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ, విద్యుత్ ఉద్యోగులతో పోటీపడి సింగరేణి కార్మికులు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. గత పదేళ్ల మిగతా 2వ పేజీలో ▶

మీ మేనిఫెస్టో, మా 6 గ్యారంటీలపై

చర్చకు సిద్ధమా?

బీఆర్ఎస్, బీజేపీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్

- వివరాలు 2లో

ఎల్ఆర్ఎస్‌కు లైన్ క్లియర్!

- 2020 నాటి అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర సర్కారు నిర్ణయం
- గ్రామ పంచాయతీల్లోని లేఅవుట్లతోపాటు వ్యక్తిగత ప్లాట్లను క్రమబద్ధీకరించే చాన్స్
- ఆదాయ సమీకరణ ప్రయత్నాల నేపథ్యంలో తెరపైకి 'ఎల్ఆర్ఎస్' - 2లో

న్యూస్‌రీల్

గజల్ దిగ్గజం పంకజ్ ఉధాస్ కన్నుమూత



'చిట్టీ ఆయీ హై', 'ఔర్ అహిస్తా కీజియే బాతే' అంటూ సంగీతప్రియులను ఉర్రూతలూగించిన ప్రముఖ గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ (72) గొంతు శాశ్వతంగా మూగబోయింది. దీర్ఘకాలంగా అనారోగ్యంతో సతమతమవుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. 1990 దశకంలో ఆయన ఎన్నో హుషారు పాటలతో పాటు యుగళ, విషాద గీతాలకు తన గాత్రంతో ప్రాణం పోశారు. 'నామ్', 'సాజన్', 'మొహ్రా', 'దయావాన్' వంటి సినిమాల్లో ఆయన పాడిన పాటలు ఎంతో పాపులర్ అయ్యాయి. 2006లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. 'ఆయన ఆలపించిన గజల్స్ ప్రతి మదితో నేరుగా సంభాషిస్తాయి' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

- వివరాలు 6లో

జర్నలిజం ప్రమాణాలు కాపాడతా



జర్నలిజంలో ప్రమాణాలు కాపాడేందుకు కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ నూతన చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 'జర్నలిస్టులకు సంబంధించి ఇళ్ల స్థలాలు, నగదురహిత వైద్యం కీలకమైనవి. ఈ రెండింటికీ పరిష్కారాలు ఉన్నాయని విశ్వసిస్తున్నాను' అని ఆయన 'సాక్షి'తో చెప్పారు.

- వివరాలు 12లో

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు



రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 9,80,978 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. 1,521 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- వివరాలు 12లో

రెండు గ్యారంటీల ప్రారంభం సచివాలయంలోనే!

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ రావడంతో మార్పు

సాయంత్రం చేవెళ్లలో సభ.. హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కారు తలపెట్టిన మరో రెండు గ్యారంటీ హామీల ప్రారంభోత్సవ వేదిక మారింది. ప్రభుత్వం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర సచివాలయంలోనే ప్రారంభించనుంది. నిజానికి మంగళవారం సాయంత్రం చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సభలో ఈ పథకాలను ప్రారంభించాల్సి ఉంది. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సోమవారం సాయంత్రం షెడ్యూల్ విడుదలవడం, వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి మిగతా 2వ పేజీలో ▶



జూన్ నుంచి మూడో టర్మ్..

- మా ఘనవిజయం ఖాయం: మోదీ
- పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన
- టెక్స్‌టైల్ రంగానికి కేంద్రం అండ
- భారత్ టెక్స్–2024ను ప్రారంభించిన ప్రధాని - 6లో

హాకర్లను ఎందుకు తొలగించడం లేదు?

- బీఎంసీని ప్రశ్నించిన బాంబే హైకోర్టు
- బాటసారులు నడిచేందుకు ఇబ్బందిగా ఉంది
- ఎన్నో దశాబ్దాల సమస్యను బీఎంసీ ఎందుకు పరిష్కరించలేకపోతోందంటూ అసహనం - వివరాలు 7లో

మీకు, కేసీఆర్‌కు తేడా ఏముంది?



- 2 నెలల్లో రూ.10 వేల కోట్లు అప్పు చేశారు
- వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తారా?
- దత్తత గ్రామం చినముల్కనూరుకు కేసీఆర్ ఒరగబెట్టిందేమీ లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై నిప్పులు చెరిగిన బండి సంజయ్

- వివరాలు 2లో

కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావు



- ఆ పార్టీని ప్రజలు నమ్మడం లేదు
- బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు గెలవకున్నా ఎలాంటి నష్టం లేదు
- బీజేపీని ఎక్కువ ఎంపీ సీట్లలో గెలిపించి మోదీకి గిఫ్ట్ ఇవ్వాలి
- సనత్‌నగర్ విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- వివరాలు 2లో



'యథారాజా తథా ప్రజ' అని అభ్యర్థులందరూ మీ పనితీరుపై కూడా సర్వే చేయించమంటున్నార్సార్!

ప్రభుత్వ వైఫల్యాలే ప్రచార అస్త్రాలుగా..

- లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధం
- వచ్చే ఆరువారాలూ జనంలోనే ఉండేలా కార్యాచరణ
- కేటీఆర్, హరీశ్ సహా కీలకనేతలకు ప్రచార సమన్వయ బాధ్యతలు
- ప్రచార షెడ్యూల్, ప్రచార అంశాల జాబితాపై ముమ్మర కసరత్తు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కేటీఆర్, ఇతర నేతల భేటీ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన ప్రచారఅస్త్రాలుగా బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. షెడ్యూల్ త్వరలో వెలువడుతుందనే ప్రచారం నేపథ్యంలో కార్యాచరణ వేగవంతం చేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ వెలువడేలోగా ఆరు వారాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దృష్టి సారించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించిన బీఆర్ఎస్, ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక

మార్చి 28న పోలింగ్: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక షెడ్యూల్‌ను కేంద్రఎన్నికల సంఘం విడుదల చేసింది. గతేడాది డిసెంబర్ 8న మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ స్థానానికి కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామా చేసిన తర్వాత ఏర్పడిన ఖాళీకి మార్చి 4న నోటిఫికేషన్ విడుదల కానుంది. 2028 జనవరి 1వ తేదీ వరకు పదవీకాలం ఉన్న ఈ స్థానానికి మార్చి 28 న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, కౌంటింగ్ ఏప్రిల్ 2వ తేదీన జరగనుంది. ఉపఎన్నిక ప్రక్రియ మొత్తం కోవిడ్-19 ప్రొటోకాల్స్ పాటించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

కాంగ్రెస్‌లోకి తీగల, అనితారెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హస్తం గూటికి చేరుకున్నారు. సోమవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో వీరిద్దరూ పార్టీ కండువా కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే తీగల నిన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ వచ్చినా.. పార్టీ కార్యక్రమాల్లో ఆయన అంటీముట్టనట్టుగానే వ్యవహరించారు. మామా కోడళ్లిద్దరూ కారు దిగి, హస్తం గూటికి చేరుకోవడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో చేరడం వల్ల తన కోడలిని మళ్లీ జెడ్పీ చైర్‌పర్సన్ చేయొచ్చనే యోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

'17 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి'



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాం. దీని ప్రధానమంత్రిగా చేయడానికి రాష్ట్రంలోని మొత్తం 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. 'కాంగ్రెస్‌పై అవాకులు, చెవాకులు పేలుతున్న తండ్రి చాటు కొడుకు కేటీఆర్‌కు ఏం తెలుసు'అని ప్రశ్నించారు. బీజేపీది గాడ్ పాలిటిక్స్ అయితే, రాహుల్ ది పబ్లిక్ పాలిటిక్స్ అని అన్నారు. దేవుడి గురించి మాట్లాడే బీజేపీ నేతలు పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యవసరాల ధరల గురించి ఎందుకు నోరుమెదపరని ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మోసపు మాటలను ప్రజలు గమనించాలని కోరారు. నిరుద్యోగులను మోసగించిన బీజేపీ ఓట్ల కోసమే అయోధ్య రామమందిరాన్ని ప్రారంభించిందని, ఆ పార్టీ మీద చీటింగ్ కేసు పెట్టాలని జగ్గారెడ్డి అన్నారు.

షర్మిల మాటలు నమ్మొద్దు

వైఎస్సార్‌టీపీ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు సుధీర్‌బాబు

ఖమ్మం మయూరి సెంటర్: ఇప్పటికే తాము షర్మిల మాటలు నమ్మి మోసపోయామని.. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా నమ్మి రోడ్డున పడొద్దని వైఎస్సార్‌టీపీ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు కోరారు. షర్మిల కారణంగా తనకు జరిగిన మోసంపై విజయవాడలో మీడియా సమావేశం పెట్టేందుకు వెళ్లాలని నిర్ణయించగా, సోమవారం పోలీసులు అడ్డుకుని ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తెచ్చారని తెలిపారు. ఆయనను సోమవారం సాయంత్రం పోలీసులు విడుదల చేయగా అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌టీపీలో మూడేళ్లపాటు పని చేసిన తాను ఖమ్మంలో సంకల్ప సభ నిర్వహించామన్నారు. షర్మిల చేపట్టిన పాదయాత్రకు మద్దతు తెలిపినట్లు చెప్పారు. ఆమె సతీశ్ అనే వ్యక్తిని తన సొంత అన్నయ్య కంటే ఎక్కువ అని పరిచయం చేయగా, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పలువురి నుంచి రూ.కోట్లలో దండుకున్నాడని ఆరోపించారు. తాను కూడా ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపించానన్నారు. షర్మిలకు రాజకీయాలు తెలియదని, ఏపీ ప్రజలు ఆమె మాటలు నమ్మకుండా విజ్ఞతతో ఆలోచించాలని కోరారు.

.. ప్రారంభం సచివాలయంలోనే!

▶ మొదటి పేజీ తరువాయి

రావడంతో.. వేదికను మారుస్తూ రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. మధ్యాహ్నం సచివాలయంలో ఈ రెండు గ్యారంటీ పథకాలను ప్రారంభించిన అనంతరం చేవెళ్లలో యథావిధిగా కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ జరగనుంది. సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ సభలో పాల్గొననున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధి అంతటా కోడ్ అమల్లోకి వచ్చినట్టే. అయితే కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని షాద్‌నగర్, కల్వకుర్తి, కొడంగల్ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలు.. కొత్తగా ఏర్పాటైన రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చాయి. నిబంధనల ప్రకారం.. ఏదైనా జిల్లాలోని కొంత ప్రాంతంలో ఎన్నికలున్నా ఆ జిల్లా అంతటికీ కోడ్ వర్తిస్తుంది. దీంతో రంగారెడ్డి జిల్లా కూడా ఎన్నికల కోడ్ పరిధిలోకి వచ్చింది. ఆ జిల్లాలోని చేవెళ్లలో ప్రభుత్వం తలపెట్టిన గ్యారంటీ పథకాల ప్రారంభోత్సవ వేదికను మార్చుకోవాల్సి వచ్చింది.

2020నాటి ఎల్‌ఆర్‌ఎస్‌కు లైన్ క్లియర్!

మార్చి 31నాటికి అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర సర్కారు నిర్ణయం

- ప్లాట్ క్రమబద్ధీకరణకు రూ.1,000, లేఅవుట్‌కు రూ.10,000 ఫీజుతో 2020లో దరఖాస్తులు స్వీకరించిన సర్కారు
- గ్రామ పంచాయతీల్లోని లేఅవుట్లతోపాటు వ్యక్తిగత ప్లాట్లను క్రమబద్ధీకరించే చాన్స్
- దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు కేసులున్న భూములకు మినహాయింపు
- ఆదాయ సమీకరణ ప్రయత్నాల నేపథ్యంలో తెరపైకి 'ఎల్‌ఆర్‌ఎస్'
- రెగ్యులరైజేషన్ చార్జీ చెల్లింపునకు తక్కువ గడువు ఇవ్వడంపై అభ్యంతరాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2020 సంవత్సరంలో ప్లాట్ ఓనర్లు, లేఅవుట్లు చేసిన రియల్టర్ల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరించేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని రెవెన్యూ విభాగాల నుంచి ఆదాయ సమీకరణపై సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మార్చి 31లోగా మొత్తం రుసుము చెల్లించిన పక్షంలో సదరు ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించనున్నారు. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ, కోర్టు ఆదేశాలున్న భూములు మినహా ఇతర లేఅవుట్లను క్రమబద్ధీకరించనున్నారు. సుమారు 20 లక్షల మంది దరఖాస్తుదారులకు దీనితో ప్రయోజనం చేకూరుతుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.



ఆదాయ సమీకరణ దిశగా..

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో అనుమతుల్లేని లేఅవుట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో కేసీఆర్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తెచ్చింది. ఆ ఏడాది అక్టోబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. ప్లాట్లకు సంబంధించి రూ.1000 చొప్పున, లేఅవుట్లకు రూ.10,000 చొప్పున దరఖాస్తు ఫీజు తీసుకుంది. ఈ పథకం కింద 100 గజాల్లోపు ప్లాటు రెగ్యులరైజేషన్ కోసం గజానికి రూ.200 చొప్పున చార్జీ చెల్లించాలి. 100 నుంచి 300 గజాల వరకు ఉన్న స్థలాలకు గజానికి రూ.400.. 300 గజాలకుపైన ఉంటే గజానికి రూ.600 చొప్పున చార్జీ చెల్లించాలని పేర్కొంది. అయితే.. లేఅవుట్ల క్రమబద్ధీకరణ అంశంపై న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలవడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. పెండింగ్ దరఖాస్తుల సంగతి ఏమిటన్నది అయోమయంగా మారింది. తాజాగా ఆదాయ సమీకరణపై సీఎం సమీక్ష సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలనే నిర్ణయం తీసుకున్నారు. తద్వారా సర్కారుకు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. దీనిపై అధికారికంగా విధి విధానాలు విడుదల కావాల్సి ఉంది. అయితే ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల చెల్లింపు కోసం తక్కువ గడువు పెట్టడం ఏమిటన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

సర్కారుకు రూ. 50 వేల కోట్ల ఆదాయం వచ్చే చాన్స్

2020 నాటి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయం. వేలాది మంది రియల్టర్లు, లక్షల మంది కొనుగోలుదారులకు గ్రామ పంచాయతీ లేఅవుట్లలోని ప్లాట్లకు అనుమతి లభిస్తుంది. అయితే మార్చి 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ చార్జీల మొత్తాన్ని చెల్లించాలనే నిబంధనను సడలించాలి. కేవలం నెల రోజుల్లో లక్షల రూపాయలు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకునే స్తోమత ప్లాట్ల యజమానులు, రియల్టర్లకు ఉండదు. ఈ విషయంలో పునరాలోచించాలి. ప్రస్తుతం సుమారు 25 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ క్లియర్ అయితే ప్రభుత్వానికి రూ. 50 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

- నారగోని ప్రవీణ్‌కుమార్, ప్రెసిడెంట్, తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్

పూర్తి పారదర్శకంగా ధాన్యం టెండర్ల ప్రక్రియ

పౌరసరఫరాల శాఖ కమిషనర్ వివరణ

- హైపవర్ కమిటీ నేతృత్వంలోనే బిడ్డింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లర్ల వద్ద నిల్వ ఉన్న 2022–23 రబీ సీజన్ ధాన్యం నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నులను వేలం వేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా సాగిందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఐదుగురు సభ్యుల హైపవర్ కమిటీ నేతృత్వంలోనే బిడ్డింగ్ ప్రక్రియ సాగిందని చెప్పారు. రాష్ట్రంలోని రైస్‌మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం వేలం ప్రక్రియ తీరుతెన్నులపై 'ధాన్యం దోపిడీ'శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. గతంలో రద్దయిన టెండర్లలో వచ్చిన ధర కన్నా అధిక మొత్తానికి ధాన్యం లాట్లను బిడ్డర్లకు కేటాయించినట్లు చెప్పారు. అప్పట్లో క్వింటాల్ ధాన్యానికి గన్నీ బ్యాగులతో కలిపి సగటున రూ.1,684.6 చొప్పున బిడ్లు దాఖలు కాగా, ఈసారి రూ. 2,003.7 వచ్చిందని తెలిపారు. అంటే ఒక టన్నుకు రూ.3,191.03 చొప్పున అధికంగా బిడ్లు స్వీకరించినట్లు వివరించారు. ధాన్యం లాట్లలో నాణ్యతను బట్టి క్వింటాల్‌కు కనీస ధర రూ.1852 కాగా గరిష్టంగా (మంచి నాణ్యతతో కూడిన లాట్) రూ.2,259.9 కి బిడ్ దాఖలైనట్లు చెప్పారు. గతంలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని25 లాట్లుగా విభజించి బిడ్లు ఆహ్వానించగా సరైన ధర రానందున రద్దు చేసినట్లు వివరించారు. తాజాగా పౌరసరఫరాల సంస్థ అప్పుల భారం రూ.58,623 కోట్ల నుంచి రూ.55,408 కోట్లకు తగ్గినట్లు చౌహాన్ తెలిపారు.

మీకు, కేసీఆర్‌కు తేడా ఏముంది?



2 నెలల్లో రూ.10 వేల కోట్లు అప్పు చేశారు

- ఇచ్చిన మాటకు కట్టుబడి 100 రోజుల్లోనే హామీలన్నీ అమలు చేసే దమ్ముందా?
- కేసీఆర్ దత్తత గ్రామం చినముల్కనూరుకు ఒరగబెట్టిందేమీ లేదు
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన సంజయ్

కోహెడ (హుస్నాబాద్)/ కరీంనగర్ టౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను బీఆర్‌ఎస్ మోసం చేస్తే, వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై విరుచుకుపడ్డారు. తెలంగాణకు కేంద్రం నయా పైసా సాయం చేయలేదంటూ సీఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. మలిదశ ప్రజాహిత యాత్రలో భాగంగా సోమవారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి కేంద్రంలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నరేంద్ర మోదీ పాలనలో తెలంగాణకు రూ.10 లక్షల కోట్లకుపైగా నిధులిచ్చిందని, అసలు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పాలన సాగుతోందంటే మోదీ ఇస్తున్న నిధుల పుణ్యమేనని అన్నారు. కాంగ్రెస్‌కి దమ్ముంటే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బండి సవాల్ విసిరారు. 'కాంగ్రెస్‌కు, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తేడా ఏముంది? 10 ఏళ్లలో బీఆర్‌ఎస్ రూ.5 లక్షల కోట్ల అప్పు తెస్తేం మీరు 2 నెలల్లోనే రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చారు'అని కాంగ్రెస్‌ను విమర్శించారు. 'వంద రోజుల్లోనే 6 గ్యారంటీలన్నీ అమలు చేస్తానన్నారు, 75 రోజులు దాటిపోయాయి. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బంధు ఎకరాకు రూ.15 వేలు, మహిళలకు నెలనెలా రూ.2,500, ఆసరా పెన్షన్ రూ.4 వేలు ఇస్తానన్న హామీ ఎందుకు అమలు చేయడం లేదు'అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణలో 2 లక్షల 40 వేల ఇళ్లు మంజూరుచేస్తే ఒక్క ఇల్లు కూడా కట్టివ్వకుండా మోసం చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని అన్నారు.

రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలను గెలుస్తాం

సీబీఐ, ఈడీని శాసించే అధికారం బీజేపీకి లేదని, ఢిల్లీ లిక్కర్ కేసులో సాక్ష్యాలు, ఆధారాలతోనే కవితకు నోటీసులిచ్చారని, ఆధారాలుంటే ఎంత పెద్ద వారైనా ఉపేక్షించకూడదన్నదే బీజేపీ విధానమని బండి అన్నారు. రెండోవిడత ప్రజాహిత యాత్ర ప్రారంభం సందర్భంగా కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను బీజేపీ క్లీన్ స్వీప్ చేయబోతోందని అన్నారు. విజయ సంకల్పయాత్రకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. బీజేపీ ఐదారు రోజుల్లో ఎంపీ అభ్యర్థులను ప్రకటించబోతోందని, బీఆర్‌ఎస్‌తో పొత్తు అంటే చెప్పుతో కొట్టాలని తానే చెబుతున్నానని స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి బోయినపల్లి వినోద్ కుమార్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. మోదీని మరోసారి ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రజాహిత యాత్ర కొనసాగిస్తున్నామని తెలిపారు.

..రూ. కోటి ప్రమాద బీమా

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి అడుగడుగునా నిర్లక్ష్యానికి గురైందని, ఖనిజ నిక్షేపాలను కేంద్రం అమ్ముకోవాలని చూసినా వారితో కుమ్మక్కై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలువరించలేకపోయిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు బీఆర్‌ఎస్ సహకరిస్తే తాము సింగరేణి కార్మికులను కుటుంబ సభ్యులుగా భావించి బీమా సదుపాయాన్ని తీసుకువచ్చామని చెప్పారు.

ఇది చరిత్రాత్మక రోజు: డిప్యూటీ సీఎం భట్టి

సింగరేణి కార్మికులకు బీమా సౌకర్యం కల్పించిన రోజు కార్మిక లోకానికి, సంక్షేమ రాజ్యానికి చరిత్రాత్మక రోజుగా మిగిలిపోతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులను కాపాడుకోవడం తమ బాధ్యతగా భావించి ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. సాధారణ కార్మికులతోపాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా రూ. 40–50 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించడం దేశ చరిత్రలోనే లేదన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, రాజ్‌ఠాకూర్, గండ్ర సత్యనారాయణ, కూనంనేని సాంబశివరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాగరాజు, రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డితోపాటు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి ఉన్నతాధికారులు, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ తదితర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మోదీ, షా, నడ్డా

సాక్షి, హైదరాబాద్

ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోగానే అగ్రనేతల విస్తృత ప్రచారం

- ఆదిలాబాద్, సంగారెడ్డి సభలకు పీఎం మోదీ
- ఆ తర్వాత అమిత్ షా, జేపీ నడ్డా ప్రచారం
- 4న హైదరాబాద్‌లో అమిత్ షా సభ!
- 29న బీజేపీ తొలి జాబితా?
- 12 సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు



తెలంగాణలో బీజేపీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వరుస ఎన్నికల పర్యటనలతో హోరెత్తించనున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కనీసంగా పది ఎంపీ సీట్లు గెలుపొందాలన్న లక్ష్యం నేపథ్యంలో.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ప్రచారాన్ని ప్రారంభించక ముందే బీజేపీ ఉధృత ప్రచారం చేపట్టాలని భావిస్తోంది. ఆ మేరకు ఆ పార్టీల అభ్యర్థుల ప్రకటనకు ముందే ఈ నెలాఖరులోగా బీజేపీ అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించి ఎన్నికల ప్రచారపర్వంలోకి దూకాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

షెడ్యూల్ ఇచ్చేలోగానే మోదీ 2 సభలు...

ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగానే ఆదిలాబాద్, సంగారెడ్డిల్లో ఏర్పాటు చేసిన సభలకు ప్రధాని మోదీ విచ్చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారని తెలుస్తోంది. ఆయా సభలకు ముందు రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను మోదీ చేతుల మీదుగా చేపట్టాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. గత పదేళ్ల పాలనలో కేంద్రంలో తమ ప్రభుత్వం సాధించిన ప్రగతితో పాటు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో కాంగ్రెస్ పార్టీ తీరును, రాష్ట్రంలో గత తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కారు అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై మోదీ సునిశిత విమర్శలు చేస్తారని రాష్ట్ర పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

4న అమిత్ షా రాకుంటే మోదీ?

వచ్చే నెల 4న హైదరాబాద్‌లో సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా పాల్గొంటారని తెలుస్తోంది. ముందుగా రాష్ట్ర పర్యటన ఖరారైతే అదే రోజున అమిత్ షా బదులు మోదీ సభ ఉండొచ్చునని సమాచారం. ఈ సభ కోసం గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలు కవర్ చేసేలా (ఐదు వేర్వేరు ప్రాంతాల్లో) చేపట్టిన విజయసంకల్పయాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో మార్చి 2న అమిత్‌షా సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని తొలుత భావించారు. ఐతే 2వ తేదీకి బదులు 4న రాష్ట్రానికి వచ్చేందుకు అమిత్‌షా సమయం కేటాయించడంతో అదేరోజున సభను నిర్వహించాలని నిర్ణయించినట్టు పార్టీవర్గాల సమాచారం.

29న బీజేపీ తొలి జాబితా...?

ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో రాష్ట్రంలోని 17 సీట్లలో మెజారిటీ (అంటే 12 స్థానాలకు) అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ 29న ఇద్దరు లేదా ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు, ఐదారుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరి చేరికను బట్టి ఎవరు గట్టి అభ్యర్థులు అవుతారో వారి బలాబలాల ప్రాతిపదికన పేర్లను ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరింత మెరుగైన అభ్యర్థుల కోసం అన్వేషణలో భాగంగా... జహీరాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, వరంగల్, ఖమ్మం సీట్లకు క్యాండిడేట్ల ఎంపికను పెండింగ్‌లో పెట్టినట్టుగా పార్టీ నాయకులు చెబుతున్నారు.

మీ మేనిఫెస్టోలు, మా ఆరు గ్యారంటీలపై చర్చకు సిద్ధమా?

బీఆర్‌ఎస్, బీజేపీలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

రాష్ట్రం ఏర్పడ్డ రోజు ఏడాదికి రూ.6 వేల కోట్లు అప్పు కట్టేవారు.. ఇప్పుడు 70 వేల కోట్లు
రైతుబంధు 15 రోజుల్లో వేయగలం కానీ, ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు నిధులివ్వలేం
బీఆర్‌ఎస్, బీజేపీల భాష, భావం ఒక్కటే.. కాంగ్రెస్‌పై అక్కసు వెళ్లగక్కడమే వారి పని



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: 2014, 2018 ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోలు, 2014, 2019 ఎన్నికల సందర్భంగా బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోలు, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చిద్దామని, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు సిద్ధమా? అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, గత పదేళ్లలో జరిగిన తప్పిదాలను పరిష్కరించేలా ముందుకెళ్తున్నామని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీల భాష, భావం, ఆలోచనా విధానం ఒక్కటేనని, రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నాయని విమర్శించారు. సోమవారం సచివాలయంలో సింగరేణి ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించే పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి రేవంత్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డ రోజున అప్పుల కింద ఏడాదికి రూ. 6 వేల కోట్లు కట్టేవారమని, ఇప్పుడు పదేళ్ల తర్వాత ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పుల కింద కట్టాల్సి వస్తోందని చెప్పారు. మిగులు బడ్జెట్ స్థితిలో రాష్ట్రాన్ని కేసీఆర్ చేతిలో పెడితే రాష్ట్రాన్ని దివాలా స్థితికి తీసుకెళ్లారని ఆరోపించారు. ఇంత త్వరగా రాష్ట్రాన్ని విధ్వంసం చేయగల శక్తి కేసీఆర్‌కు తప్ప ఎవరికైనా ఉందా అని ఎద్దేవా చేశారు.

మార్చి 31 కల్లా రైతుబంధు

రైతుబంధును మార్చి 31 కల్లా రైతులకు ఇస్తామని అసెంబ్లీలోనే చెప్పానని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. రైతుబంధును 15 రోజుల్లోనే ఇవ్వొచ్చని, అయితే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలకు నిధులివ్వలేమని వెల్లడించారు. ఉద్యోగాలను వారు వదిలేస్తే న్యాయ పరిష్కారం చూపెట్టి 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలిచ్చామని చెప్పారు. తాము ఇచ్చిన ఉద్యోగాలకు తెడ్డు తిప్పుతున్నారని హరీశ్‌రావు అంటున్నారని, మరి తెడ్డు తిప్పలేని సన్నాసి మంత్రి ఎలా అయ్యారని ఎద్దేవా చేశారు. మార్చి 2న మరో ఆరువేల ఉద్యోగాలిస్తామని, 70 రోజుల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. దూలం లెక్క పెరిగిన హరీశ్‌కు దూడకున్న బుద్ధి కూడా లేదని విమర్శించారు. రేవంత్‌ను సీఎంగా ప్రకటించి ఎన్నికలకు వెళ్లి ఉంటే కాంగ్రెస్‌కు 30 సీట్లు కూడా వచ్చేవి కాదన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన్ను పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. గత ఎన్నికల్లో తాను కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కేసీఆర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా, కిషన్‌రెడ్డి బీజేపీ అధ్యక్షుడిగా తలపడ్డామని, తమ పార్టీ నేతలతో కలిసి 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలకు వెళ్లానని, పార్టీ అధ్యక్షుడంటే ఇంటి పెద్దే కదా అని అన్నారు.

కిషన్‌రెడ్డి ఏనాడైనా కలిశారా?

అధికారం చేపట్టిన తర్వాత రాజకీయాలకతీతంగా తాము నిధుల కోసం, సమస్యల పరిష్కారం కోసం కేంద్రం వద్దకు వెళ్లామని, కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఏ రోజైనా ప్రజా సమస్యల కోసం తనను కలిశారా అని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలన్న ఆలోచన బీజేపీకి లేదని విమర్శించారు. మూడోసారి ప్రధానిగా మోదీకి ఎందుకు అవకాశం ఇవ్వాలని, రైతులను కాల్చిచంపడానికా అని అన్నారు.

నిరుద్యోగులకు ఆన్‌లైన్ క్లాసులు

పేద, గ్రామీణ నిరుద్యోగుల కోసం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ల పేరిట అత్యవసరంగా ఆడిటోరియాలు కట్టి, అక్కడ ఆన్‌లైన్ క్లాసులతో శిక్షణనిస్తామని రేవంత్ చెప్పారు. సంక్షేమ పథకాల అమలుకు తెల్ల రేషన్‌కార్డును కొలబద్దగా తీసుకున్నామని చెప్పారు. రైతుబంధు పథకం ద్వారా అనర్హులకు రూ.22వేల కోట్లు పంచిపెట్టారన్న అంచనా ఉందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాల కోసం ఆధార్‌కార్డు చూపిస్తే నమోదు చేసుకునేలా మండల కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉజ్వల్ పథకం కింద కేంద్రం ఇస్తున్న మొత్తం పోను మిగిలింది సిలిండర్ లబ్ధిదారులకు ఇస్తామని చెప్పారు.

లక్ష్యం సాధించాల్సిందే..

పన్ను వసూళ్లపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అడ్డుకోండి
- ఆయా శాఖల పన్ను వసూళ్లపై ముఖ్యమంత్రి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదాయాన్ని ఆర్జించే శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖల పన్ను వసూళ్లపై సోమవారం సచివాలయంలో రేవంత్‌రెడ్డి సమీక్షించారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకు పైగా చెల్లించేదని, దాని గడువు ముగియడంతో ఆ నిధులు ఆగడంతో వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు వివరించారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రతి డిస్టిలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఆదాయం తెచ్చే శాఖలకు సొంత భవనాలు

రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. దీనికి స్పందించిన రేవంత్ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆదాయం తెచ్చే శాఖలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలను పంపాలని ఆదేశించారు. అక్రమాలకు చెక్‌పెట్టేలా ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలన్నారు.

వే బిల్లులు.. వాహనాల ట్రాకింగ్

ఇసుక సరఫరా వాహనాలకు వే బిల్లులతోపాటు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వొద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గతంలో నిబంధనలు ఉల్లంఘించిన పలు గనులపై జరిమానాలు విధించారని, ఆ జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. టీఎస్ఎండీసీతోపాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, కొందరిపై ఆరోపణలున్నాయని, వారిని వెంటనే బదిలీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావు

సనత్‌నగర్ విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- ఆ పార్టీని ప్రజలు నమ్మడం లేదు
- మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందింది



సనత్‌నగర్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తం మీద కాంగ్రెస్ పార్టీకి 40 సీట్లు కూడా రావని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్‌ను ఎక్కడా ప్రజలు నమ్మడం లేదనీ, రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని ఆ పార్టీ నేతలే నమ్మడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లిపోతారన్నారు. కిషన్‌రెడ్డి చేపట్టిన విజయ సంకల్ప యాత్ర సోమవారం సనత్‌నగర్ నియోజకవర్గంలో కొనసాగింది. పద్మారావునగర్ స్వరాజ్య ప్రెస్ సర్కిల్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం యాత్ర ప్రారంభించారు. అక్కడి నుంచి మొదలైన యాత్ర ముషీరాబాద్ చౌరస్తా, బైబిల్ హౌస్, హిల్ స్ట్రీట్, షోలాపూర్ స్వీట్‌హౌస్, మహంకాళి స్ట్రీట్, బేగంపేట రైల్వేస్టేషన్, అమీర్‌పేట గురుద్వారా, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం మీదుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా అమీర్‌పేటలో జరిగిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇక తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని జోస్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటు గెలవకున్నా నష్టమేమీ ఉండదన్నారు.

మళ్లీ మోదీనే పీఎం కావడం ఖాయం

రానున్న ఎన్నికల్లో మళ్లీ మోదీ ప్రధాని కావడం ఖాయమనీ, మూడోసారి ఆయన ప్రధాని కావాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారని కిషన్‌రెడ్డి చెప్పారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందనీ, దేశ ప్రతిష్టను ఆయన పెంచారని అన్నారు. గత పదేళ్ల కాలంలో దేశం ప్రశాంతంగా ఉందంటే అది మోదీ వల్లేనని పేర్కొన్నారు. ఇప్పుడు దేశంలో ఎక్కడా ఐఎస్ఐఎస్ కార్యకలాపాలు లేవని, జమ్మూ కశ్మీర్‌లో నేడు శాంతియుత వాతావరణం ఉందన్నారు. మోదీ నాయకత్వం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని, అలాంటి మోదీకి రాష్ట్రం నుంచి ఎక్కువ లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి బహుమతిగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ యాత్రలో కిషన్‌రెడ్డి వెంట ఎంపీ లక్ష్మణ్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు సరళ, సుచిత్ర, దీపిక, నాయకులు వెల్లాల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కనీస వేతనాల జీవోలను సవరించి అమలు చేయాలి

నేడు కలెక్టర్లకు బీఎంఎస్ వినతిపత్రాలు

సాక్షి, హైదరాబాద్: దాదాపు పన్నెండేళ్లుగా సవరణకు నోచుకోని కనీస వేతనాల జీవోలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సవరించి అమలు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) డిమాండ్ చేసింది. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డుల ఏర్పాటు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఆయుష్మాన్ భారత్‌ను వర్తింపచేయాలని కోరింది. డిమాండ్ల సాధనకు మంగళవారం కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, స్ట్రీట్ వెండర్స్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. విద్యుత్ శాఖలోని ఆర్టిజన్లను పర్మనెంట్ చేయాలని కోరింది. టీఎస్ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని కోరింది. ఈపీఎఫ్ పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని, అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేసింది.

సేంద్రీయ ఉత్పత్తులను ఆదరించాలి

'వైల్డ్ ఫ్లేవర్స్' ఆవిష్కరణలో మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ములుగు అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ (ఎఫ్‌సీఆర్ఐ) ఆధ్వర్యంలో శాస్త్రీయంగా పెంచుతున్న తేనెటీగల కేంద్రంలో తయారు చేసిన సేంద్రీయ తేనె (ఆర్గానిక్)ను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. సోమవారం అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, సేంద్రీయ ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులకు తేనెటీగల పెంపకం, ఆదాయ అభివృద్ధిపై శిక్షణనిచ్చేందుకు హైదరాబాద్ శివారు ములుగులో ఉన్న ఫారెస్ట్ కాలేజీలో ప్రత్యేక తేనెటీగల పెంపకం, ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. రైతులతో పాటు ఔత్సాహిక వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, మహిళలకు తేనెటీగల పెంపకంపై వారం రోజుల శిక్షణా కార్యక్రమాలను ఫారెస్ట్ కాలేజీ అందిస్తోంది. ఈ కేంద్రం ఆధ్వర్యంలో పూర్తి సేంద్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేసిన తేనెను 'వైల్డ్ ఫ్లేవర్స్' బ్రాండ్ పేరుతో ఫారెస్ట్ కాలేజీ అందుబాటులోకి తీసుకొస్తోంది. ములుగు ఫారెస్ట్ కాలేజ్‌లో త్వరలో ఒక తేనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల చేరిక



ఆర్మూర్ (నిజామాబాద్): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపాలిటీలోని 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సోమవారం మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బల్దియాలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా..ఇందులో 15 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. చైర్‌పర్సన్ వినీత వెంట ఉన్న 12 మందిలో పలువురు కూడా త్వరలోనే పార్టీ మారనున్నట్లు తె లుస్తోంది. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను తదితరులు ఉన్నారు.

అనుమానమున్న ఖాతాలపై నిఘా

- రైతుబంధు, రైతుబీమాపై రాష్ట్రవ్యాప్త విచారణ
- కొందుర్గు ఏఈఓ అక్రమాలు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం
- రంగంలోకి దిగిన వ్యవసాయశాఖ



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు, రైతు బీమా చెల్లింపుల్లో రంగారెడ్డి జిల్లా కొందుర్గు ఏఈఓ అక్రమాలు వెలుగు చూసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేపట్టాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. అనుమానాలున్న ఖాతాలన్నింటిపైనా నిఘా పెట్టింది. 2020 నుంచి ఇప్పటివరకు రైతుబీమాకు సంబంధించి క్లెయిమ్ చేసే సమయంలో నామినీ వివరాలు, తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి సదరు ఏఈఓ తన ఖాతా, కుటుంబసభ్యుల ఖాతా, బంధువులు, స్నేహితుల ఖాతా నంబర్లు పెట్టి బీమా కంపెనీకి పంపించారు. తర్వాత ఒకే ఖాతాకు వరుసగా డబ్బు జమ అవుతున్నాయని అనుమానం వచ్చి విచారణ చేయడంతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విచిత్రమేంటంటే బతికున్న భార్యాభర్తల విషయంలో ఒకసారి భర్త చనిపోయాడని ధ్రువీకరణ పత్రం సృష్టించి నామినీ అయిన భార్యకు డబ్బులు ఇచ్చేలా రూ.5లక్షలు కాజేశాడు. ఆ తర్వాత ఆరు నెలలకు భార్య చనిపోయినట్టు ధ్రువీకరణ పత్రం సృష్టించి భర్త పేరుతో నామినీ ఖాతాకు డబ్బులు జమ చేయించుకున్నాడు. అంటే ఇద్దరినీ ఆరు నెలల్లో కాగితాల్లో చంపేసి నామినీలుగా చేసి డబ్బులు కాజేశాడు. రైతుబంధులో నలుగైదుగురి డబ్బులు ఒకే బ్యాంకు ఖాతాకు వచ్చేలా ఏర్పాట్లు చేశాడు. కొన్నేళ్లుగా ఈ దందా కొనసాగిస్తుండటంతో తనను ఎవరూ పట్టుకోరన్న భావనతో రెచ్చిపోయి మరిన్ని అక్రమాలకు పాల్పడ్డాడని వ్యవసాయశాఖ గుర్తించింది.

ఏఈఓలే కీలకం

వ్యవసాయశాఖలో కొన్నేళ్లుగా వేల కోట్ల రూపాయల రైతుబంధు, రైతుబీమా నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. రైతుల వివరాలు నమోదు చేయడంలో ఏఈఓల పాత్రే కీలకం. పైగా ఏఈఓల లాగిన్ ద్వారానే ఇవన్నీ జరుగుతున్నాయి. ఇక ఎల్ఐసీ కూడా పూర్తిగా ఏఈఓలపైనే ఆధారపడి ఉంది. ఏఈఓలే అన్నీ చేయాల్సి రావడం, ఎల్ఐసీ పైపైనే చూస్తుండిపోవడంతో అక్రమాలకు తెర లేచిందన్న వాదనలు ఉన్నాయి. రైతుబీమా కింద రైతులను నమోదు చేసే విషయంలో పూర్తి స్వేచ్ఛ ఏఈఓలకే ఇచ్చారు. ఈ రోజుల్లో ప్రతీ దానికీ ఆధార్ లింక్ పెడుతున్న తరుణంలో రైతుబంధు, రైతుబీమా విషయంలో ఆధార్ లింక్ ఎందుకు పెట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు రైతుబంధు, రైతుబీమా నిధుల విడుదల సందర్భంగా ఏమైనా అక్రమాలు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు పెద్ద అక్రమం బయటకు రావడంతో ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయన్న దానిపై వ్యవసాయశాఖ దృష్టిసారించింది. మొత్తం డేటాను వెరిఫై చేస్తున్నారు. నాలుగేళ్ల డేటాను పరిశీలిస్తున్నారు.

మాది ఫ్రెండ్లీ సర్కారు

- సమస్యలు ఉంటే ఉద్యోగులు ఓపెన్‌గా చెప్పాలి
- అటవీ శాఖ సమీక్షలో మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటుంది..అధికారులు, సిబ్బంది తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకోవచ్చని'రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. క్షేత్రస్థాయి అధికారులు చెప్పిన విషయాలను విన్న మంత్రి.. తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా రోడ్లు, భవనాలశాఖలో పని చేశారని, ఉద్యోగుల కష్టసుఖాలు తనకు తెలుసని చెప్పారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో పులుల మరణం తనను కలిచివేసిందని, రానున్న రోజుల్లో అలాంటి సంఘటనలు జరగకూడదన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, సోమవారం తొలిసారి అరణ్యభవన్‌కు వచ్చిన సురేఖకు పీసీసీఎఫ్ ఆర్ ఎం డోబ్రియాల్, ఇతర ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అటవీశాఖ పనితీరుపై మంత్రి సమీక్షించారు. కొత్తగా అటవీస్టేషన్ల ఏర్పాటు, సిబ్బందికి ఆయుధాల విషయం ప్రభుత్వ పరిధిలో ఉందని, చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. అడవులకు సంబంధించిన కోర్టు వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కూడా సత్వర చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్మగ్లర్లపై కఠిన చర్యలకు పీడీ యాక్ట్ పెట్టేందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు.బాగా పని చేసి అధికారులు, సిబ్బందిని మరింతగా ప్రోత్సహించి అవార్డులు ఇవ్వాలని ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్‌ను మంత్రి ఆదేశించారు. వేసవిలో అటవీ అగ్ని ప్రమాదాల నివారణ, జంతువులకు నీటివసతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కంపా నిధుల వినియోగం, అడవుల పునరుద్ధరణ, హరితనిధి, పోడు భూములకు పట్టాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల పురోగతి, ఫారెస్ట్ కాలేజీ, ప్రత్యామ్నాయ అటవీకరణకు కేటాయించిన భూముల నోటిఫికేషన్లు తదితర అంశాలపై చర్చించారు. 'గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తాం..అదే సమయంలో చట్టవ్యతిరేకంగా అడవుల ఆక్రమణ చేపడితే కఠిన చర్యలు ఉంటాయని'మంత్రి హెచ్చరించారు. అడవుల ఆక్రమణను సహించబోమని, గుత్తికోయ ప్రభావిత ప్రాంతాల్లో తదుపరి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పీసీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎంసీ.పర్గెయిన్, విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరు, జిల్లాల కన్జర్వేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలే ప్రచార అస్త్రాలుగా..

▶ మొదటి పేజీ తరువాయి



నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో సోమవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్ప జ్వరంతో ఈ భేటీకి హాజరుకాకున్నా, ఆయనతో కేసీఆర్, కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడినట్టు సమాచారం.

ముఖ్య నేతలకు ప్రచార సమన్వయ బాధ్యతలు

లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా పార్టీ నేతల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల వ్యూహం అమలు చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ బాధ్యతను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కడియం శ్రీహరి, మధుసూధనాచారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్ నేతలకు అప్ప గించనున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై కూడికలు, తీసివేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా కుస్తీ పడుతున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎమ్మెల్సీ కవితకు సీబీఐ నోటీసులు జారీ అంశంపై ఎలా స్పందించాలనే కోణంలోనూ సోమవారం జరిగిన భేటీలో కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలతో పాటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నిక కూడా జరుగుతుందని బీఆర్ఎస్ భావిస్తోంది. పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో జరిగే ఈ ఎన్నికకు సంబంధించి దివంగత ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో కేసీఆర్ త్వరలో భేటీ అవుతారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్ అంటూ...

తెలంగాణ ప్రయోజనాలు కాపాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేననే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా రూపొందించిన కార్యాచరణను తనతో భేటీ అయిన ముఖ్యనేతలకు కేసీఆర్ వివరించినట్టు సమాచారం. బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పథకాలతో పాటు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, మూడు నెలల్లోనే వాటి అమలులో విఫలమైన తీరును వివరించేలా కరపత్రాలు, బుక్‌లెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆరు గ్యారంటీల పేరిట ఇచ్చిన 13 హామీలు కలుపుకొని మొత్తంగా ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు అసాధ్యమనే విషయాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఎన్నికల కార్యాచరణలో భాగంగా అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి మండలస్థాయిలో పార్టీ కేడర్‌తో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు సమావేశాలు ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయిలో పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడంతోపాటు బీఆర్ఎస్ పాలనలో వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితోనూ భేటీ అయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా షెడ్యూల్ సిద్ధం చేసి ముఖ్యనేతలకు సమన్వయ బాధ్యతలు అప్పగిస్తారు.

అదుపుతప్పి.. డివైడర్ దాటి..

- కారును ఢీకొట్టిన మరో కారు
- ఇద్దరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- సిద్దిపేట జిల్లా కొండపాకలో ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): అదుపుతప్పిన కారు రాజీవ్ రహదారిపై డివైడర్‌ను ఢీకొని, ఎగిరి అవతలి వైపు రోడ్డు పక్క నుంచి వెళ్తున్న మరో కారుని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా మల్కాపూర్‌కు చెందిన డ్రైవర్ గంభీరావుపేట శోభన్ కరీంనగర్ వెళ్లి తిరిగి హైదరాబాద్ వస్తున్నాడు. ఇదే సమయంలో కరీంనగర్ పాల డైరీ అడ్వైజరీగా పని చేస్తున్న హన్మంతరెడ్డితో పాటు ప్రశాంత్, శోభన్ హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వస్తున్నారు. తిమ్మారెడ్డి పల్లి గ్రామ శివారులో బతుకమ్మ చెరువు మలుపు వద్ద రాజీవ్ రహదారిపై బీటీ దెబ్బతిని ఉండడంతో వేగంగా వెళ్తున్న డ్రైవర్ శోభన్ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి రోడ్డుకు అవతలి వైపు వెళుతున్న హన్మంతరెడ్డి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శోభన్, హన్మంతరెడ్డికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు ప్రశాంత్, శోభన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో డ్రైవర్ శోభన్‌ను హైదరాబాద్‌కు, హన్మంతరెడ్డిని కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, మల్కాపూర్‌కు చెందిన గంభీరావుపేట శోభన్ హైదరాబాద్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

డ్రగ్ పార్టీ.. అరెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. అయితే డ్రగ్ పార్టీలో పాల్గొన్నవారు అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గజ్జల వివేకానంద్‌తో పాటు మరో 9 మంది డ్రగ్ పార్టీలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో జూబ్లీహిల్స్‌లోని నివాసంలో వివేకానంద్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వివేకానంద్, నిర్భయ్, కేదార్.. ము గ్గురికీ మెడికల్ ఎగ్జామినేషన్‌లో భాగంగా మూత్ర పరీక్షలు చేయగా డ్రగ్ పాజిటివ్ వచ్చింది. హోటల్ లో కొకైన్ కోసం ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్లు 3, డ్రగ్ వినియోగానికి ఉపయోగించిన వైట్ పేపర్లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంజీరా గ్రూప్‌లో పనిచేసిన సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీ డ్రగ్ సరఫరా చేసినట్లుగా పోలీసులు గుర్తించారు..'అని మహంతి తెలిపారు. హోటల్‌పై కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు. మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్, అదనపు డీసీపీ జయరాం, గచ్చిబౌలి సీఐ జేమ్స్‌బాబు సోదాల్లో పాల్గొన్నారు.

వీఐపీలపై కేసు నమోదు

రాడిసన్ హోటల్‌లోని 1200, 1204 గదుల్లో డ్రగ్ పార్టీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్నవారిలో బడా బాబులు, వ్యాపారవేత్తల పిల్లలు, సెలబ్రిటీలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా రఘుచరణ్, సందీప్, క్రిష్, శ్వేత, లిషీ అనే వారిపై కూడా కేసు నమోదు అయ్యింది. కేదార్ ఏవియేషన్ కంపెనీ నిర్వాహకుడిగా, జూబ్లీహిల్స్‌లోని హైలైఫ్, బఫెల్లో వింగ్స్ పబ్‌లకు డైరెక్టర్‌గా ఉన్నట్లు సమాచారం.

డ్రగ్స్ పార్టీలకు అడ్డాగా రాడిసన్!

గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ డ్రగ్స్ పార్టీలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ హోటల్‌లో కొంతకాలంగా డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్నట్లుగా పోలీసులు కూడా గుర్తించినట్లు తెలిసింది. కొద్ది నెలల క్రితం రాడిసన్ హోటల్‌లో మేనేజర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి డ్రగ్స్ కేసులో పట్టుబడిన విషయం తెలిసిందే. స్టార్ హోటళ్లు, పబ్‌లు, ప్రైవేట్ పార్టీలలో డ్రగ్స్ వినియోగించవద్దని సైబరాబాద్ పోలీసులు ఇటీవల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సూచనలను పట్టించుకోకుండా రాడిసన్ హోటల్ యథేచ్ఛగా డ్రగ్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వివేకానంద్ రిమాండ్ తిరస్కరణ, బెయిల్ మంజూరు

డ్రగ్ వినియోగం కేసులో గజ్జల వివేకానంద్‌కు కూకట్‌పల్లి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వివేకానంద్‌ను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8సీ ఆర్/డబ్ల్యూ 21బీ, 29, 25, 27ఏ కింద ఆరోపణలు చేశారు. సోమవారం సాయంత్రం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. అయితే నిందితుడిని రిమాండ్‌కు పంపేందుకు తగిన కారణాలు లేవని పేర్కొన్న న్యాయమూర్తి.. వివేకానంద్ రిమాండ్‌కు తిరస్కరిస్తూ వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. కాగా మరో ఇద్దరు నిందితులైన నిర్భయ్, కేదార్‌లకు పోలీసులు 41 సెక్షన్ కింద నోటీసులు జారీ చేశారు.

బీఆర్ఎస్‌కు ఇంకా బుద్ధి రాలేదు

- ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా మారలేదు
- కాంగ్రెస్‌ను, సీఎం రేవంత్‌ను విమర్శిస్తే తాటతీస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్, రామచంద్ర నాయక్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రాలేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. అధికార కాంగ్రెస్‌పై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, మీ తీరు మార్చుకోకపోతే ప్రజలు తరిమి కొడతారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, రామచంద్రనాయక్ సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. నాగర్ కర్నూల్‌లో సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఇంకోసారి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడితే తాట తీస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయాన్ని సరి చేసేందుకు రేవంత్‌రెడ్డి అహర్నిశలు కష్ట పడుతున్నారని, ఉనికి కాపాడుకోవడానికి సీఎంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు.

ఎన్నికల కోసమే బీజేపీ రాజకీయాలు

పదేళ్లు అధికారంలో ఉన్నా విభజన హామీలు నెరవేర్చలేదు: క్రిషాంక్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల కోసమే బీజేపీ రాజకీయాలు చేస్తోందని, కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్నా విభజన చట్టంలోని హామీలను ఆ పార్టీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ నాయకులు మన్నె క్రిషాంక్ విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించిన హక్కులు, విభజన చట్టంలోని హామీలపై కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని ఆయన అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో క్రిషాంక్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ వెలువడే సమయంలో ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటనలతో హడావుడి చేయడం మినహా చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిష్టాత్మక సంస్థలను ఏర్పాటు చేసిన కేంద్రం తెలంగాణ వైపు చూడటం లేదని విమర్శించారు. తెలంగాణ పట్ల చిన్న చూపుతో ఉన్న మోదీ కేవలం ఓట్ల కోసమే రాష్ట్రానికి వస్తున్నారన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీలను గెలిపించాలని కోరుతున్న రేవంత్‌రెడ్డి కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాదనే విషయాన్ని అంగీకరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని క్రిషాంక్ స్పష్టం చేశారు.

బీజేపీ రూ.500కే సిలిండర్ ఇవ్వగలదా?: పొన్నం



హుస్నాబాద్: గ్యాస్ సిలిండర్ రూ.400 ఉంటే రూ.1,200లకు పెంచిన బీజేపీ ప్రభుత్వం రూ.500కు సిలిండర్ ఇవ్వగలదా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రజాహిత పేరుతో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్ దీనికి ఏం సమాధానం చెబుతారని అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం మహిళలతో కలిసి సిలిండర్‌కు పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ నేతలు రాజకీయంగా విమర్శలు, ప్రతి విమర్శలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేసుకోవాలని పొన్నం సూచించారు.

రైతు బీమా, రైతు బంధు పేరిట మోసం

- రూ. 2 కోట్లు స్వాహా
- అగ్రికల్చర్ ఏఈఓతో పాటు మరొకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్: రైతు బీమా, రైతు బంధు పేరిట ఓ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఏఈఓ) ఘరానా మోసానికి పాల్పడి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.2 కోట్లు స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం గచ్చిబౌలిలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా, కొందుర్గు మండలానికి చెందిన అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గోరెటి శ్రీశైలం మండల పరిధిలోని గ్రామాల్లో రైతుల పంటల వివరాలను సేకరించేవారు. సీసీఎల్ఏ రైతు బీమా పోర్టల్ నుంచి వివరాలు సేకరించి 60 ఏళ్లు దాటిన, అప్పటికే మరణించిన వారి పేరిట నకిలీ డాక్యుమెంట్లతో రైతు బీమాకు దరఖాస్తు చేసేవాడన్నారు. ఇదే తరహాలో 20 మంది రైతుల పేరుతో నకిలీ డెత్ సర్టిఫికెట్ల ద్వారా బీమాకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆయా రైతుల పేర్లతో మంజూరైన రూ. కోటి నిధులను 7 అకౌంట్లలోకి మళ్లించినట్లు తెలిపారు. అంతేగాక పట్టాదార్ పాస్ బుక్ నెంబర్లను ఉపయోగించి రైతులకు మంజూరైన రైతు బంధు నిధులను సైతం స్వాహా చేసినట్లు తెలిపారు. పంటల వివరాలను సేకరిస్తూ రైతులను నమ్మించి పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డుల ద్వారా తన సహాయకుడు ఓదేల వీరస్వామితో కలిసి 130 మంది రైతులకు మంజూరైన రైతు బంధు నిధులను 50 ఖాతాల్లోకి మళ్లించినట్లు తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో రంగారెడ్డి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, పలు బ్యాంకులకు చెందిన 7 డెబిట్ కార్డులు, ఫోర్జరీ చేసిన డెత్ సర్టిఫికెట్లు, ఎల్ఐసీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కాజేసిన సొమ్ముతో కొందుర్గులో 2.35 ఎకరాలు, తుమ్మలపల్లిలో 8.20 ఎకరాల వ్యవసాయ భూమి, కడ్తాల్ గ్రామంలో 183 చదరపు గజాల ప్లాట్‌ను కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. ఏఈఓ శ్రీశైలం భార్య మహేశ్వరికి సైతం ఈ కేసులో ప్రమేయం ఉందని సీపీ వివరించారు. కొందుర్గు పీఎస్ నుంచి కేసును ఈఓడబ్ల్యూకు బదిలీ చేశామన్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ఆందోళనలపై అణచివేత తగదు

కేంద్రంపై మండిపడ్డ సీపీఐ నేత నారాయణ



నిరసన తెలుపుతున్న నారాయణ, చాడా వెంకట్‌రెడ్డి

హైదరాబాద్: పంటకు కనీసం మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పశ్య పద్మ, కె.శంకర్, ఎస్.బాల మల్లేశ్, ఈటీ నర్సింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. రైతుల ఆందోళనలు అణచి వేసేందుకు మోదీ ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తోందన్నారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులను తీవ్రంగా నష్టపరిచే వ్యవసాయ చట్టాలను తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జి.వెంకటేశం, సీపీఐ రాష్ట్ర నాయకులు స్టాలిన్, కె.యాదగిరి, శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా నేతలు జె.లక్ష్మ, ఉమామహేశ్ పాల్గొన్నారు.

ఉడ్తా షెహర్!

▶ మొదటి పేజీ తరువాయి

డ్రగ్ పార్టీలు జరిగిపోతున్నాయి.

దుమ్ము రేపుతున్న రేవ్ పార్టీలు

ఒక్క రాడిసన్ హోటలే కాదు.. రాత్రి అయిందంటే చాలు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, గచ్చిబౌలి, మాదాపూర్ తదితర ప్రాంతాల్లోని పలు హోటళ్లు, రిసార్టులు, పబ్‌లు రేవ్ పార్టీలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఇందుకోసం కొందరు నిర్వాహకులు ప్రత్యేకంగా యాప్‌లు నిర్వహిస్తున్నారు. పార్టీలకు హాజరు కావాలని భావించే వారంతా వాటిని డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలి. పార్టీ జరిగే ప్రాంతంలోకి ప్రవేశించే సమయంలో దానికి సంబంధించిన ఓటీపీని అక్కడి వారికి చెప్పాల్సి ఉంటుంది.

పచ్చబొట్లలో డ్రగ్ గుట్టు

కొందరు సొంతంగా యాప్స్, వాట్సాప్, టెలిగ్రాం గ్రూపులు నిర్వహిస్తూ మూడో కంటికి తెలియకుండా కస్టమర్లకు రేవ్ పార్టీలపై సమాచారం అందిస్తున్నారు. పార్టీకి హాజరయ్యే కస్టమర్ చేతులపై తాత్కాలిక పచ్చబొట్లు ముద్రిస్తున్నారు. ఈ టాటూ ఆధారంగానే ఏ డ్రగ్ సరఫరా చేయాలన్నది సప్లై చేసే వారికి తెలుస్తుంది. కుడి చేయి మణికట్టు మీద టాటూ వేస్తే అతడికి గంజాయి, హష్ ఆయిల్ సరఫరా చేయాలని అర్థం. ఎడమ చేతిపై టాటూ ఉంటే కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ వంటి మాదకద్రవ్యాలు సరఫరా అవుతాయి. కొన్ని పబ్‌ల నిర్వాహకులు 'స్పెషల్', 'ఆఫర్', 'స్కీమ్', 'లిమిటెడ్'పేరుతో ప్రత్యేక కోడ్ భాషను పార్టీల సందర్భంగా వాడుతున్నట్లు సమాచారం.

రేవ్ తీరే వేరు

అర్ధరాత్రి ప్రారంభమయ్యే రేవ్ పార్టీలు తెల్లవారేవరకు జరుగుతుంటాయి. వీటి నిర్వహణకు మద్యం, మాదకద్రవ్యాలు, మ్యూజిక్ సిస్టమ్‌తో పాటు ల్యాప్‌టాప్ లేదా స్క్రీన్ తప్పనిసరి. అడ్డూ అదుపులేకుండా సాగే ఈ పార్టీల్లో హోరెత్తే మ్యూజిక్‌లో మత్తెక్కించే మద్యం, డ్రగ్స్‌తో రెచ్చిపోయి నాట్యం చేసే యువత.. ల్యాప్‌టాప్ లేదా స్క్రీన్‌పై 'ఫైట్రాన్స్'ఇమేజెస్‌గా పిలిచే ఓ రకమైన ఫొటోల్ని చూస్తుంటారు. అక్కడ సైకెడెలిక్‌గా పిలిచే ప్రత్యేక మ్యూజిక్ కూడా నడుస్తుంటుంది. ఇవి వారికి మరింత ఉత్తేజాన్ని ఇస్తుంటాయి. ఈ రేవ్ పార్టీ తీరుతెన్నులు, అక్కడకు వచ్చే వారి వస్త్రధారణ ఫలితంగా టీనేజ్‌లోనే పెళ్లి కాకుండా 'లివ్ ఇన్ రిలేషన్‌షిప్'లు పెరిగిపోతుండటం ఆందోళనకర అంశమని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక వ్యవస్థీకృతంగా కాకుండా కొద్దిమంది స్నేహితులు కలిసి చేసుకునే రేవ్ పార్టీలకు హోటళ్లు అడ్డాలుగా మారుతున్నాయి. దీనికోసం కనెక్టింగ్ రూమ్స్ వినియోగిస్తున్నారు.

కొత్త ట్రెండ్.. డ్రగ్ టూర్స్

రాజధానిలో ఇటీవల కాలంలో డ్రగ్ టూర్స్ పెరిగినట్లు పోలీసులు చెప్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ, హెచ్-న్యూ, టీఎస్-నాబ్ వంటి ప్రత్యేక వింగ్స్ రాజధానిలో జరుగుతున్న డ్రగ్స్ దందాపై నిఘా పెంచాయి. ఇది ఇక్కడ పెడ్లర్స్ కదలికలకు, మాదకద్రవ్యాల అందుబాటుకు కొంత సమస్యగా మారింది. మరోవైపు వీటి ఖరీదు కూడా అమాంతం పెరిగిపోయింది. దీంతో డ్రగ్స్ వినియోగదారులు ప్రత్యేక టూర్స్ ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. వీకెండ్స్‌లో సిటీకి చెందిన అనేక మంది హైక్లాస్ యూత్ గోవాతో పాటు హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పిల్లలపైనా గంజాయి పంజా

నగరంలో లభిస్తున్న మాదకద్రవ్యాల్లో గంజాయిది ప్రథమ స్థానం. ఒకప్పుడు కేవలం గంజాయి మొక్క ఆకుల్ని మాత్రమే ప్యాక్ చేసి సరఫరా చేసే వాళ్లు. అయితే భారీ స్థాయిలో దీన్ని సేకరించి, ప్యాక్ చేసి, వాహనాల్లో తరలించి విక్రయించడంలో రిస్క్ ఎక్కువ. దీంతో ఇటీవల కాలంలో గంజాయికి బదులుగా హష్ ఆయిల్ అక్రమ రవాణా పెరిగింది. గంజాయి ఆకుల్ని ప్రాసెస్ చేయడం ద్వారా దీన్ని తయారు చేస్తున్నారు. కొన్నిసార్లు క్రీమ్ మాదిరిగా ఉండే చరస్‌ను సరఫరా చేస్తున్నారు. లీటర్ ఖరీదు అత్యంత లాభదాయకంగా రూ.లక్షల్లో ఉండటంతో పాటు రవాణా, విక్రయం, వినియోగం తేలిక కావడంతో స్మగ్లర్లు వీటి వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ హష్ ఆయిల్‌తో తయారవుతున్న చాక్లెట్లు కూడా విచ్చలవిడిగా లభిస్తున్నాయి. పాఠశాల విద్యార్థులకు సైతం ఇవి అందుబాటులోకి వస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

హైదరాబాద్‌లో మూడేళ్లలో దొరికిన మాదకద్రవ్యాలు

	2021	2022	2023
గంజాయి (కేజీలు)	2,084	830.12	1874.79
చరస్ (గ్రాములు)	200	355.7	20.00
కొకైన్ (గ్రాములు)	34	126.64	14.28
హెరాయిన్ (గ్రాములు)	120	295	8.56
ఓపియం (గ్రాములు)	0.25	0	1400
ఎండీఎంఏ (గ్రాములు)	41	231.02	1125.03
కేటమైన్ (గ్రాములు)	0	0	48.84
ఎల్ఎస్‌డీ (బ్లాట్స్)	10	262	6.00
ఇతర డ్రగ్స్ (గ్రాములు)	48	3190.5	19924
హష్ ఆయిల్ (ఎంఎల్)	5,348	13843.26	4135
మొత్తం కేసులు	274	306	243
అరెస్టు అయిన వాళ్లు	723	1205	740
వీరిలో భారతీయులు	718	1192	727
విదేశీయులు	5	13	13

సింథటిక్ డ్రగ్స్ కేరాఫ్ విదేశాలు

సింథటిక్ డ్రగ్స్ సౌతాఫ్రికా, నైజీరియా లాంటి దేశాల నుంచి వస్తున్నాయి. సముద్ర, విమాన మార్గాల్లో వచ్చి తొలుత ముంబై, గోవాలకు చేరుకుంటున్నాయి. అక్కడ ఉంటున్న డిస్ట్రిబ్యూటర్లు వీటిని దేశ వ్యాప్తంగా ఉంటున్న పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నారు. వీరి నుంచి ఈ డ్రగ్స్ వినియోగదారులకు చేరుతున్నాయి. ఈ దందా కోసం పెడ్లర్స్ వివిధ రకాలైన సోషల్ మీడియా యాప్స్ వాడుతున్నారు. తమ ఐడీలను డార్క్‌వెబ్‌లోని డ్రగ్స్ ఫోరమ్స్‌లో తమ వద్ద లభించే డ్రగ్స్ వివరాలు, వాటి రేట్లను ఉంచుతున్నారు. రేటు ఖరారైన తర్వాత బైనాన్స్ లేదా వజీరెక్స్ వంటి వాటి ద్వారా క్రిప్టో కరెన్సీగా మారిన నగదును స్వీకరిస్తూ కొరియర్ ద్వారా లేదా డెడ్ డ్రాప్ విధానంలో సరకు పంపిస్తున్నారు. కొరియర్‌లో అయితే తమ అసలు చిరునామా రాయకుండా వస్తువులు, వస్త్రాల మాదిరిగా ప్యాక్ చేసి లేదా కాగితాల మధ్యలో ఉంచి పంపిస్తున్నారు. ఎక్కువ సందర్భాల్లో ఎంపిక చేసిన ఓ ప్రాంతంలో డ్రగ్ పార్శిల్ ఉంచి ఆ వివరాలను మెసెంజర్ ద్వారా అందిస్తున్నారు. దీన్నే డెడ్ డ్రాప్ విధానం అంటారు.



ఒకవేళ అది సరైనది కాకపోతే దాన్ని చేయకు;
ఒకవేళ అది నిజం కాకపోతే దాన్ని చెప్పకు.
- మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 27 ఫిబ్రవరి 2024

సిగ్గు... సిగ్గు...

వ్యవసాయభూముల కాపాడేందుకు ఉద్యమాలు చేసి, అప్పటి ప్రభుత్వాన్ని గద్దె దింపి అధికారంలోకి వచ్చిన పార్టీ చివరకు అందులోనే విఫలమైతే? సదరు పార్టీ వ్యక్తులే సారవంతమైన భూముల్ని కబ్జా చేసి, స్థానికులను జీతం బత్తెం లేని బానిస కూలీలుగా మార్చి, స్త్రీలపై యథేచ్ఛగా లైంగిక అత్యాచారాలు సాగిస్తుంటే? పశ్చిమ బెంగాల్‌లో 34 ఏళ్ళ దీర్ఘకాల వామపక్ష సర్కార్‌పై అలుపెరుగని పోరాటాలు చేసి, 2011లో అధికారంలోకి వచ్చిన తృణమూల్ కాంగ్రెస్, ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై ఇప్పుడు సందేశ్‌ఖలీ వ్యవహారంలో వస్తున్న విమర్శలు ఇవే. కోల్‌కతాకు 70 కి.మీ.ల దూరంలో, ఉత్తర 24 పరగణాల జిల్లాలో సారవంతమైన భూములతో కూడిన ఈ కుగ్రామం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పటికి 53 రోజులైనా, అక్కడి అకృత్యాలకు మూలమని ఆరోపణలను ఎదుర్కొంటున్న అధికార పార్టీ నేత షేక్ షాజహాన్‌ను అరెస్ట్ చేయకపోవడంపై కలకత్తా హైకోర్ట్ సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేయాల్సి రావడం పరాకాష్ఠ.

సందేశ్‌ఖలీలో చాలాకాలంగా అకృత్యాలు సాగుతున్నా, అది ఇప్పుడు చర్చకు వచ్చింది. రేషన్ కుంభకోణంలో నిందితుడైన స్థానిక రాజకీయ బాహుబలి షేక్ షాజహాన్‌ను అరెస్ట్ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 5న వెళ్ళింది. వారిపై దాదాపు 2 వేల మంది దాకా షాజహాన్ అనుచరులు తీవ్రమైన దాడికి తెగబడ్డారు. అప్పటి నుంచి ఆయన పరారీలో ఉండగా, పెద్దయెత్తున స్థానిక మహిళలు బయటకొచ్చి, ధైర్యం కూడగట్టుకొన్నారు. అనేక సంవత్సరాలుగా అక్కడ షాజహాన్, ఆయన అనుచరులు సాగిస్తున్న భూకబ్జాలనూ, లైంగిక అత్యాచారాలనూ బయటపెట్టారు. ఈ ఆరోపణలతో గ్రామంలో నిరసనలు తలెత్తాయి. గ్రామస్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొని, షాజహాన్ ప్రధాన అనుచరులైన ఉత్తమ్ సర్దార్, శివప్రసాద్ హజ్రాల ఆస్తులపై దాడికి దిగేలా చేసింది. షాజహాన్‌నూ, అతని అనుచరులనూ అరెస్టు చేయాలని కోరుతూ ఆడవాళ్ళు పెద్ద సంఖ్యలో వీధులకెక్కారు. అధికార తృణమూల్ అసలు నిందితుడి విషయంలో మీనమేషాలు లెక్కిస్తుంటే, ఈ వ్యవహారాన్ని ఎన్నికల ప్రయోజనాలకు ఎలా వాడుకోవాలా అని బీజేపీ చూస్తోంది.

అధికార పార్టీ సైతం ఆచితూచి వ్యవహరిస్తున్న నిందితుడు షేక్ షాజహాన్‌ది పెద్ద కథ. 'సుందర్‌బన్స్ అసలు పులి' అంటూ స్థానిక గ్రామీణులు పిలుచుకొనే అతను 2013 నుంచి తృణమూల్‌కూ, అంతకు ముందు సీపీఐ (ఎం)కూ ఓటింగ్ మిషన్. అతను ఎవరికి మద్దతిస్తే వారిదే గెలుపు. 2023 జూలై పంచాయతీ ఎన్నికల్లో సందేశ్‌ఖాలీలోని రెండు బ్లాకుల్లో 333 సీట్లుంటే, 310 సీట్లు పోటీ లేకుండా తృణమూల్ ఖాతాలో పడ్డాయి. మిగతా 23 సీట్లలోనూ చివరకు తృణమూల్ జెండాయే ఎగిరింది. అలాంటి బలవంతుణ్ణి వదులుకోవడం ఎంత మమతకైనా కష్టమే. అందులోనూ మైనార్టీ అయిన షాజహాన్‌ను పరారీలో ఉన్నాడంటూ వదిలేసి, అతని హిందూ సహచరులిద్దరిని పోలీసులు అరెస్ట్ చేయడంతో బీజేపీ - ఆరెస్సెస్‌లకు అస్త్రం అందివచ్చినట్టయింది. మమత మైనార్టీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని నిందిస్తూ ఎస్సీ, ఎస్టీలను తమ వైపు తిప్పుకోవాలని కమలదళం యత్నిస్తోంది. నాలుగేళ్ళ క్రితమే పోలీసులకు ఫిర్యాదులందినా, 42 కేసులు దాఖలైనా షాజహాన్‌ను కదిలించినవారు లేదు. అతణ్ణి అరెస్ట్ చేస్తే మైనార్టీలు దూరమవుతారనేది మమత భయం. ఏమైనా, మోదీ పర్యటనకు వచ్చే లోపల మమత ఆ పని చేయక తప్పకపోవచ్చు.

గతంలో వామపక్ష ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా మమత ఎలాంటి ధర్నాలు చేసిందీ తెలుసు. 2007లో నందిగ్రామ్‌లో ప్రత్యేక ఆర్థిక జోన్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యమించి అక్కడకు చేరడానికి ఆమె స్కూటర్ వెనుక కూర్చొని ప్రయాణించడం, సింగూర్‌లో టాటా నానో కర్మాగారం ఎదుట ధర్నాలు చేయడం అందరికీ గుర్తే. తీరా మమత పాలనలో ప్రతిపక్షాలు ఆ తరహా పోరాటాలు సాగించలేకపోతున్నాయి. బీజేపీలో సైతం నేతల మధ్య సమన్వయం కొరవడింది. దాంతో, ప్రధానమంత్రే రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు మరికొద్ది రోజులే ఉన్నందున అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొనేందుకు మార్చి తొలివారంలో ఒకటికి మూడుసార్లు బెంగాల్‌లో పర్యటించనున్నారు. రాజకీయాలు, హింసాకాండ జంటపదాలైన బెంగాల్ దేశంలోని అతి సున్నితమైన ప్రాంతాల్లో ఒకటని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చివరకు కాశ్మీర్ కన్నా ఎక్కువగా 920 కంపెనీల కేంద్ర బలగాలను బెంగాల్‌లో దింపనున్నట్టు ప్రకటించింది.

సభ్యసమాజం సిగ్గుపడేలా సాగుతున్న లైంగిక అత్యాచారాలపై పార్టీలకు అతీతంగా నేతలందరూ గళం విప్పాల్సింది. తృణమూల్ మొదట అసలు అలాంటిదేమీ లేనే లేదని కొట్టిపారేసింది. ఆనక ఇదంతా తమను అప్రతిష్ఠ పాల్జేసేందుకు కాషాయదళ స్కెచ్ అనీ, ఇప్పుడేమో నిందితుల్ని శిక్షిస్తామనీ పిల్లిమొగ్గలు వేసింది. ప్రతిపక్షాలేమో స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు ఈ వివాదాన్ని ఎలా వాడుకోగలమనే ప్రయత్నంలోనే ఉన్నాయి. ఇంత సాగుతున్నా, సందేశ్‌ఖలీ ఘటనల్ని సీఎం మమత గట్టిగా ఖండించిన పాపాన పోలేదు. కనీసం పోలీసులు అసలు నిందితుణ్ణి అరెస్ట్ చేసిందీ లేదు. ఇది శోచనీయం. ఓ మహిళ పాలిస్తున్న రాష్ట్రంలో, శాంతిభద్రతల పరిరక్షించాల్సిన హోమ్ శాఖ ఆమె చేతిలో ఉండగా ఇదీ స్త్రీల పరిస్థితి కావడం మరింత సిగ్గుచేటు. రాజకీయాలు పక్కనపెట్టి ప్రభుత్వం తక్షణం దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బలవంతుడిదే రాజ్యంగా మారిన పరిస్థితుల్ని మార్చి, కబ్జాకు గురైన భూముల్ని అసలు యజమానులకు అప్పగించాలి. అప్పుడే న్యాయం గెలుస్తుంది. ప్రభుత్వంపై, ప్రజాస్వామ్యంపై జనంలో నమ్మకం నిలుస్తుంది.

పంటలన్నిటికీ ఒకే విధానం సాధ్యమా?

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించాలని చేస్తున్న రైతుల ఉద్యమం ఇప్పటికీ ఆగడం లేదు. కేంద్ర ప్రభుత్వంతో వారి చర్చలు సఫలం కాలేదు. వారి డిమాండ్లు నెరవేరుతాయా? అన్ని పంటలకూ ఒకే విధానం అమలుచేయడం సాధ్యమేనా అన్నవి తలెత్తే ప్రశ్నలు. ప్రకటించిన 23 పంటలకు కనీస మద్దతు ధరను అమలు చేసినట్టయితే దాని ప్రభావం ఇతర అంశాలపైన, ముఖ్యంగా ఆర్థిక రంగంపైన ఉంటుందన్నది ఒక వాదన. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం కంటే మెరుగ్గా ఉండే విధంగా 'ప్రైస్ స్టెబిలైజేషన్ ఫండ్' (ధరల స్థిరీకరణ నిధి) ఏర్పాటు చేయాలని కొందరు సూచిస్తున్నారు. దీనివల్ల రైతాంగానికి మంచి మద్దతు అందుతుంది.

2024 రైతు ఉద్యమంలో ఉధృతి తక్కువే. కానీ ప్రశ్నలు ఎక్కువ. మూడు రైతు సంస్కరణ చట్టాలను కేంద్రం ఉపసంహరించుకున్నప్పటికీ రైతుల పేరిట జరుగుతున్న ఉద్యమం ఆగడం లేదు. కేవలం రెండు రాష్ట్రాల (పంజాబ్, హరియాణా) రైతులే ఇందులో ఎందుకు పాల్గొంటున్నారు? కేంద్రం చర్చలకు పిలిచిన ప్రతిసారీ డిమాండ్లు ఎందుకు మారుతున్నాయి? అసలు చర్చలు సఫలమయ్యే దిశగా డిమాండ్లు ఉన్నాయా? ఎన్నికల ముందు మొదలైన చలో ఢిల్లీ రైతు ఉద్యమం బీజేపీ విజయావకాశాలను దెబ్బ తీసేందుకేనన్న విమర్శ మాటేమిటి? ఈ మేరకు ఒక రైతు నేత మాటలతో బయటపడిన వీడియో (మోదీ ప్రతిష్ఠను దించడమే ధ్యేయం అంటూ) మాటేమిటి? నిజానికి రెండేళ్ల నాటి రైతు ఉద్యమమమే చాలా అనుమానాలనే మిగిల్చింది. ఆఖరికి 'టూల్-కిట్' సాలెగూడులో కూడా రైతు ఉద్యమం చిక్కుకుంది. రైతు ఉద్యమ మంటే రైతుకు సాయపడాలి. రాజకీయాలకు కాదు. జాతి వ్యతిరేక శక్తులకు అసలే కాదు. ఐదు పంటలకు మద్దతు ధరను ఐదేళ్ల పాటు అమలు చేస్తామని కేంద్ర బృందం హామీ ఇచ్చింది. మొదట ఒప్పుకున్నట్టే ఒప్పుకున్న రైతు సంఘాలు, పంటల సంఖ్యను పెంచాయి.

కనీస మద్దతు ధర (మినిమమ్ సపోర్ట్ ప్రైస్- ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించాలనే ప్రధాన డిమాండ్ తోపాటు ఇతర అంశాలపైన ప్రభుత్వం తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ (కొన్ని ప్రాంతాలు)కు చెందిన రైతులు దాదాపు 200 యూనియన్లతో ఢిల్లీపైన దండయాత్రకు సిద్ధమయిన నేపథ్యంలో, కేంద్రం చర్చలకు సిద్ధమైంది. చండీఘడ్‌లో నాలుగు దఫాలుగా సాగిన చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు.

ఎంఎస్‌పీ ప్రభుత్వాల వ్యవసాయ ధరల నిర్ణయం విధానంలో భాగం. ఇది పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయటానికి నిర్దేశించే ధర. స్వామినాథన్ కమిషన్ కనీస మద్దతు ధరకు సిఫార్సు చేసింది. మొత్తం పంతొమ్మిది వందల పేజీలతో ఐదు నివేదికలు సమర్పించింది. కానీ రైతు నేతలు చెబుతున్నట్టు ఎంఎస్‌పీకి చట్టబద్ధత, లేదా దాని లెక్కింపు సూత్రాల గురించి ప్రతిపాదించలేదు. ఎంఎస్‌పీ పంట వ్యయానికి 50 శాతం అధికంగా ఉండాలని సూచించింది.

రైతు సంఘాలు కోరే 23 పంటలకు ఎంఎస్‌పీ అమలు కష్టమని నిపుణులు, విశ్లేషకులు మొదటినుంచీ చెబుతున్నారు. ఆ నిర్ణయం ఆర్థిక రంగంపైన చూపించే ప్రభావం నేపథ్యంలో అన్ని పంటలకు ఒకే విధానం సరికాదన్నది బలంగా వినిపిస్తున్న వాదన. ఎంఎస్‌పీ భద్రత చట్టాన్ని అమలు చేయాలంటే, ప్రభుత్వం ఏటా రూ. 12 లక్షల కోట్లు అదనపు వ్యయాన్ని భరించాలి. అది సాధ్యం కాదని కేంద్రం కూడా చెబుతోంది. ప్రభుత్వం గనక ఎంఎస్‌పీ ప్రకటించిన 23 పంటలను



కొనుగోలు చేసినట్టయితే అనేక అంశాలపైన దాని ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ఎదుటికి కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలు కూడా వచ్చాయి. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కంటే మెరుగ్గా ఉండే విధంగా 'ప్రైస్ స్టెబిలైజేషన్ ఫండ్'(ధరల స్థిరీకరణ నిధి) ఏర్పాటు చేయాలని కొందరు సూచిస్తున్నారు. ఎంఎస్‌పీ కంటే ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉత్పత్తిలో కొంత భాగాన్ని ప్రొక్యూర్ చేసి రైతులకు న్యాయబద్ధమైన ధరను అందిస్తుంది. దీనివల్ల రైతాంగానికి మంచి మద్దతు అందుతుంది.

2024 రైతు ఉద్యమం 2020 నాటి ఆందోళనకు కొనసాగింపుగా కాకుండా, ఒక వివాదం పొడిగింపుగానే కనిపిస్తోంది. 2020 నాటి ఆందోళన కేంద్రం తెచ్చిన మూడు రైతు చట్టాలకు వ్యతిరేకం. వాటిని కేంద్రం 2021లో రద్దు చేసింది. అప్పట్లో ప్రభుత్వం రైతుల డిమాండ్ల మేరకు ఆందోళన చేసిన రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయటానికి అంగీకరించింది. కానీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధతకు సంబంధించి ఎలాంటి హామీ ఇవ్వలేదు. కానీ నేటి ఢిల్లీ చలో ఉద్దేశం వేరు. ఆందోళనకు ముందే ఈ అంశం మీద చర్చించటానికి కేంద్రం సిద్ధమైంది. అన్ని పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలనీ, రైతులకు రుణహామీ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలనీ, స్వామినాథన్ కమిషన్ ఫార్ములాను అమలు చేయాలనీ రైతు సంఘాలు కోరుతున్నాయి. లఖింపూర్ హింసలో బాధితులకు న్యాయం చేయాలనీ, 2013 భూస్వాధీన చట్టాన్ని తిరిగి ప్రవేశపెట్టాలనీ, 2020-21 ఆందోళనల్లో చనిపోయిన రైతులకు పరిహారం అందించాలనీ కూడా కోరుతున్నారు.

2020లో ఈ నిరసనకు భారతీయ కిసాన్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం వహించాయి. ఇప్పుడు వివిధ యూనియన్లు నడిపిస్తున్నాయి. 2020 మాదిరిగా కేంద్రం రైతు సంఘాలను ఢిల్లీలోకి అడుగు పెట్టనీయలేదు. ఢిల్లీకి 200 కిలోమీటర్ల దూరంలోనే ఆపేసింది. ఆందోళన నాలుగో రోజున, 63 ఏళ్ల జియాన్ సింగ్ మరణించారు. రైతుల ఆందోళన సాగుతున్నతీరు, దానికి ఖర్చవుతున్న తీరు, ట్రాక్టర్ల స్థానంలో కోట్లాది రూపాయల విలువైన వాహనాలు అక్కడకు రావటం వంటివి చూస్తుంటే, ఈ ఆందోళనకు ఎవరు నాయకత్వం వహిస్తున్నారో సులువుగా అర్థం చేసుకోవచ్చునన్న విమర్శలు ఉన్నాయి. రైతుల ఆందోళన ముసుగులో కొందరు యువకులు ముసుగులు ధరించి భద్రతా సిబ్బంది పైన రాళ్లు విసురుతున్నట్టు తేలింది. హరియాణా పోలీసులు ఆందోళనకారులపైన టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించి 'బలవంతపు చర్యలకు' పాల్పడటంతో అనేక మంది గాయపడ్డారని రైతు నేతలు ఆరోపించారు. రైతుల, యూట్యూబర్ల సోషల్ మీడియా ఎకౌంట్లను రద్దు చేయటం ద్వారా ప్రభుత్వం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని రైతు నేత సరవన్ సింగ్ పాంధర్ ఆరోపించారు.

కేంద్రం మీద నిందంతా మోపుతున్నవారు గమనించవలసిన అంశాలు కూడా ఉన్నాయి. పంజాబ్- హరియాణా సరిహద్దుల్లో రైతులకు, భద్రతా సిబ్బందికి మధ్య ప్రతిష్టంభన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా చర్చలు నిర్వహించింది. రైతు నేతలు కేంద్రమంత్రుల మధ్య (ఫిబ్రవరి 8, 12, 15, 18) చర్చలు జరిగాయి. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్, హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ పాల్గొన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, వ్యవసాయశాఖ మంత్రి గుర్మీత్ సింగ్ కూడా పాల్గొన్నారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. ట్రాలీలతో కూడిన ట్రాక్టర్లు జాతీయ రహదారుల మీద కనిపించకూడదు. దానిని రైతులు ఉల్లంఘించారు. ఇంకా చాలా విషయాలలో చట్టాన్ని చేతుల్లోకి తీసు కుంటున్నారు.

కాగా 23 పంటలకు ఒకే విధమైన విధానం సాధ్యం కాదని ఎవరైనా అంగీకరించాలి. కొత్తగా మళ్లీ, పాడి రైతుల సమస్యలను ఈ ఆందోళన ఎందుకు పట్టించుకోదన్న ప్రశ్న మొదలయింది. ఇంకా చేపల చెరువుల రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శ కూడా ఉంది. ఇప్పుడు కనీస మద్దతు ధర శాశ్వతంగా ఇవ్వాలని రైతులు చెబుతున్న 23 పంటలు మొత్తం వ్యవసాయంలో 30 శాతం లోపే. మరి మిగిలిన వ్యవసాయోత్పత్తుల మాటేమిటి? ఈ ప్రశ్నకు రైతు నేతల నుంచి సమాధానం రావాలి. ఏమైనా రైతుల సమస్యల పేరుతో రాజకీయ లబ్ధిని పొందాలని కొన్ని బీజేపీయేతర పక్షాలు కోరుకుంటున్నాయి. అందుకు అవి ఎంచుకున్న మార్గం రోడ్ల మీద తేల్చుకోవడం. రైతు సమస్యల పరిష్కారం అంటే రైతులకు చెడ్డపేరు తేవడం కాదు. వారి మీద దారుణ ముద్ర పడేలా చేయడం కాదు.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ | pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎన్నో విధాల బంధం



జోడాసాంకో (కోల్‌కతా)లో ఉన్న నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్ర నాథ్ టాగూర్ ఇంటిని దర్శించడం గుర్తుండిపోయే జ్ఞాపకం. ఫ్రాన్స్‌తో టాగూర్‌కు ఎన్నో విధాల అనుబంధం ఉంది. సహచర నోబెల్ గ్రహీత రోమా రోలా (ఫ్రెంచ్ రచయిత)తో ఆయన స్నేహం అందులో గమనించదగ్గది.

- థియెరీ మథోవ్, ఇండియాలో ఫ్రాన్స్ రాయబారి

బూటకపు ఎన్నికలు



బెలారస్‌లో జరిగిన బూటకపు పార్లమెంట్ ఎన్నికలను మేము ఖండిస్తున్నాం. 1,400కు పైగా రాజకీయ ఖైదీలు ఉన్న భయపూరిత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం అసాధ్యం. బెలరూసియన్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు మేము మద్దతునిస్తాం.

- మాథ్యూ మిల్లర్, యూఎస్ విదేశాంగ ప్రతినిధి

ఎక్కడెక్కడో...



ఇవ్వాళే నాకు తెలిసింది, దాగెస్తాన్ రిపబ్లిక్ (రష్యా)లోని దెర్బెంద్ నగరంలో 'పార్సీ'లు నివసిస్తారని. వాళ్ళు పర్షియా భాష తాలూకు ఒక మాండలికం మాట్లాడుతారు. కాకసస్ ప్రాంతంలో వాళ్లు 1800 ఏళ్లుగా నివసిస్తున్నారు. అన్నట్టు మధ్య తజికిస్తాన్‌లో కూడా 'దర్బంద్' అనే గ్రామం ఉంది.

- నిగోరా ఫజ్లిద్దీన్, తజికిస్తాన్ ఫిలింమేకర్

మరవలేని గొంతు



ఓం శాంతి... పంకజ్ ఉధాస్‌జీ! మీరు పాడిన అన్ని అమూల్యమైన, ప్రియమైన గజళ్లు, పాటలకు ధన్యవాదాలు. మీ గొంతు ఎప్పటికీ మరిచిపోలేనిది.

- ఊర్మి, వాయిస్ యాక్టర్

అనవసరం కదా!



అధికారికంగా కృత్రిమ మేధ హాలీవుడ్‌కు నష్టం కలిగించింది. ఓపెన్ ఏఐ కంపెనీ 'సోరా' కారణంగా తన 80 కోట్ల డాలర్ల స్టూడియో విస్తరణ పనులను టైలర్ పెర్రీ (నటుడు, ఫిలింమేకర్) నిలిపేశారు.

- రోవన్ చియూంగ్, ఏఐ విశ్లేషకుడు

పులసలు అంత అలుసై పోయాయా?

అభిప్రాయం



పి. విజయబాబు

సరిగ్గా చెప్పిన టైమ్‌కి వెళ్లి కాలింగ్ బెల్ కొట్టాడు కళ్యాణం. కొంచెం సేపటికి తలుపు తెరచుకుంది. బద్ధకంగా ఆవులిస్తూ, ఒళ్ళు విరుచుకుంటూ ఎదురుపడ్డాడు కైలాసం. 'ఓ నువ్వా, ఏంటి?' అన్నాడు. 'ఏం లేదు నాన్నగోరు పిలిచారు వచ్చాను. ఆయన కూడా నిద్రపోతున్నారా?' అన్నాడు. 'లేదు. ఆయన ఏడ నిద్రపోతాడు? ఆయన నిద్రపోడు. మమ్మల్ని నిద్ర పోనివ్వడు. కానీ నేను లెక్క చేయను. నాకు నిద్ర అంటే చాలా ఇష్టం. ఆయనకు మాత్రం నిద్ర రాదు. సరే మీరు మాట్లాడుకోండి. నాకు నిద్ర వస్తుంది అంటూ లోపలికి వెళ్ళిపోయాడు కైలాసం. ఇంతలో చంద్రయ్య బయటకు వచ్చాడు. ఆ రావయ్యా రా! భోజనం చేద్దూ!'

''వద్దులేండి బాబూ! మీ 'పప్పు' భోజనం నేను తినలేను సామీ. మీ అబ్బాయికి ఇష్టమని మీరు పప్పు భోజనానికి అలవాటు పడిపోయారు. నావల్ల కాదు లేండి!' 'ఓహో! పులస లేనిదే ఫుడ్ తినవన్న మాట!' ''ఏటండి బాబూ? పులసల్ని అంత తేలిగ్గా తీసేయకండి. 'పుస్తెలు అమ్మైనా పులసలు తినాలి' అంటారు.'' 'అమ్మతావయ్యా నీ దగ్గర ఎప్పుడు కావాలంటే అప్పుడు రెడీగా పుస్తెలు ఉంటాయ్ జేబులో' అన్నాడు చంద్రయ్య. ఆ మాటలకు ఉలిక్కి పడ్డాడు కళ్యాణం. 'ఏటండోయ్! మీ దగ్గర నుంచి కూడా డబల్ మీనింగ్ డైలాగ్లు వొత్తన్నయ్!' వేళ్ళతో జుట్టు ఎగరేస్తూ అన్నాడు. 'ఓరి ఓరి ఓరి నేను ఆ ఉద్దేశంతో అనలేదయ్యా! చేపలు తినటానికి పుస్తెలు అమ్ముకోవడం ఏంటని అన్నాను అంతే!

సరే సరే! ఆ సంగతి వదిలేసి పాయింట్‌కి రా! ఇంతకీ నేను చెప్పింది ఏం తేల్చావ్?' 'అంత తక్కువ మందితో వర్క్ అవుట్ అవ్వదండీ'. 'ఊరుకోవయ్యా మాట మాట్లాడితే వర్కాట్ వర్కాట్ అంటుంటావ్! మనుషులు తగ్గారని నీ ప్యాకేజీ నేనేం తగ్గించట్లేదుగా? ఎంతమంది అయితే నీకెందుకు, నీకు ఇస్తానన్నది నీకు ఇచ్చేస్తా. మనోహరానికి ముందే చెప్పాగా నీకు చెప్పలేదా?' 'నిజమే అనుకోండి! కానీ ప్యాకేజీ మాత్రమే కాదుగా? ప్రిస్టేజీ కూడా కాస్త చూసుకోవద్దూ. అంతమందికి ఆశలు పెట్టి మీరు ఇప్పుడు అంతమంది వద్దూ అంటే వాళ్ళు ఊరుకుంటారా? నేనేం సమాధానం చెప్పాలి?

'కళ్యాణం జోకులేయొద్దు. ప్రిస్టేజీ ఏంటయ్యా ప్రిస్టేజీ? మీటింగ్ పెట్టి, చేతిలో దీపం లేదని, చుట్టూ చీకటని, సముద్రం తలవంచదు లాంటి అర్థం కానివి ఏవో చెప్తావుగా? అలాంటివే చెప్పు. ఎప్పటిలాగే హైదరాబాద్ వెళ్లి కొన్ని రోజులు బ్రేక్ ఇచ్చేయ్! మళ్ళీ ఫ్రెష్‌గా రీఎంట్రీ ఇవ్వు. నీకు అలవాటేగా? మాకంటే ఇది నిత్య పోరాటం. నీకు ఇది ఓ బెనిఫిట్ షో లాంటిది. తేడా లేదూ! వినటానికి కాస్త కటువుగా ఉంటుంది కానీ నేను నీకు ఒక నిజం చెప్పనా? సంవత్సరానికి ఒకసారి వచ్చి ఓ హడావుడి చేసి మళ్ళీ మాయమైపోయే పులసల్లాగా మీ వాళ్ళు కూడా అంతేనయ్యా! నాలుగు రోజులు హడావుడి అయిపోయిన తర్వాత మళ్లీ వాళ్ల పనులు, వాళ్ళ వ్యవహారాల్లో మునిగిపోతారు. మేము అలా కాదు. మా వృత్తి, ప్రవృత్తి, ఆశ, శ్వాస, ధ్యాస అంతా ఇదే. నిద్రలేచిన దగ్గర్నుంచి పడుకునే వరకు మాకు ఇదే యావ' అన్నాడు చంద్రయ్య. 'సార్ ఏదో బేరం కుదుర్చుకున్నా కదా అని మీరు మరీ చులకన చేసి మాట్లాడుతున్నారు.' 'చులకన కాదయ్యా. 45 ఏళ్ల ఇండస్ట్రీ అనుభవంతో చెబుతున్నా. ఆ మాటకొస్తే నువ్వు కూడా అప్పుడప్పుడు కనిపించి మాయమయ్యే పులస లాంటోడివి. కాకపోతే నీకు నాతో డీల్ కుదిరింది కాబట్టి ఈ పార్ట్ టైమ్ వ్యవహారం మంచి లాభదాయకంగా ఉంది. వాళ్ళు నిన్ను నమ్ముకుని నువ్వేదో ఉద్ధరిస్తావ్ అనుకున్నారు. అదే వాళ్ళ అమాయకత్వం' అంటూ లో లోపల గొణుక్కున్నాడు చంద్రయ్య . 'ఏంటి సార్! లో లోపల ఏదో అనుకుంటున్నారు?' చంద్రయ్య హావభావాల్ని గమనించి అడిగాడు కళ్యాణం. 'నీ గురించే నయ్యా. పాపం నిన్ను నీ వాళ్ళు నమ్ముకున్నారు అటు ఢిల్లీ వాళ్లూ ఆశలు పెట్టుకున్నారు. కానీ నువ్వు మాత్రం నా ప్యాకేజీకే కమిట్ అయ్యావ్! మరి నెక్స్ట్ నీ ఫ్యూచర్ ఏంటి అని ఆలోచిస్తున్నాను.' 'అదేంటి మన బంధం పదేళ్ల వరకు ఉంటుందనుకున్నాంగా?'



''పాపం 'నాది యూజ్ అండ్ త్రో' పాలసీ అని తెలిసి కూడా నిజంగా అంత నమ్మకం పెట్టుకున్నాడా?'' మనసులో ప్రశ్నించుకున్నాడు చంద్రయ్య. అతడి మనోభావాల్ని చదివినట్టు కళ్యాణం ఒక అరనవ్వు నవ్వి, 'నిజంగా తన మాటల్ని నమ్మాను అనుకుంటున్నాడు. పదేళ్ల పార్ట్ టైమ్ వ్యవహారాలతో నన్ను నమ్మిన వాళ్ల నా వెనుకున్నారు అని తెలియదా తనకి? ఇదే నమ్మకాన్ని మరో పదేళ్లు క్యాష్ చేసుకుంటా. తను కాకపోతే ఇంకొకళ్ళు. ఆ టైమ్‌కు ఎవరో వస్తారు ఏంటంట? పులసల మీద ఎదవ జోకులు ఏస్తున్నాడు. పులసలంటే అంత అలుసై పోయాయా?' అనుకొని గొంతు సవరించుకుంటూ, ''సరే సార్ నా గురించి మీరు ఆలోచించకండి. ముందు మీరు మీ బలగంతో ఎంతవరకు సక్సెస్ అవుతారో ఆలోచించుకోండి! ఈ నాలుగు రోజులు హడావుడి అయిపోతే నా దారి నేను పోతా! మీరు మాత్రం ఎప్పటిలాగే, మీ పరిభాషలో చెప్పాలంటే 'ఆ విధంగా ముందుకు పోవాలి'. మీరు చెప్పినట్టే నా మనుషులను తగ్గించుకుంటా. ప్యాకేజీ ఏమీ మారదు అన్నారు కాబట్టి నాకేం ఇబ్బంది లేదు. మిగతా నా గొడవ ఏదో నేను మేనేజ్ చేసుకుంటా'' అన్నాడు.

కళ్యాణం మాటల్లో అంతరార్థం గ్రహించడానికి చంద్రయ్య ఆలోచనలో పడ్డాడు!

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

మన సంగీత వాద్యాలే సిసలైనవని...

సందర్భం




ప్రొ॥ పి.ఎస్. అవధాని

మనం ఎప్పుడైనా ఆలోచించామా, ఆకాశం నీలంగానే ఎందుకుంటుందని? సముద్రం కూడా ఎందుకు నీలంగా ఉంటుందని? ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనే క్రమంలో 'రామన్ ఎఫెక్ట్'ను కనిపెట్టి చంద్రశేఖర్ వెంకటరామన్ (సీవీ రామన్) నోబెల్ బహుమతి పొందారు. అలాగే మన శాస్త్రీయ సంగీత వాద్యాల గొప్పదనాన్నీ ఆయన తదుపరి పరిశోధనలు నిరూపించాయి.

రామన్ 1888 నవంబర్ 7వ తేదీన తమిళనాడులోని తిరుచిరాపల్లి దగ్గరలో ఉన్న ఒక ఊరిలో జన్మించారు. ఎంఏ పూర్తి చేసిన తర్వాత, కలకత్తాలో ఫైనాన్స్ మంత్రిత్వ శాఖలో ఉద్యోగం సంపాదించారు. ఇంతలో ఇండియన్ ఎసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ (ఐఏసీఎస్)తో పరిచయం ఏర్పడింది. భారతీయులెవరైనా సరే అక్కడ ఉచితంగా తమ పరిశోధనలు సాగించవచ్చు. రోజూ సాయంత్రం ఆఫీసు అయిపోయిన తర్వాత రాత్రి చాలా సమయం ఇక్కడే రామన్ పరిశోధనలు సాగించేవారు. ఆయన అభిమాన సబ్జెక్టు ఆప్టిక్స్.

ఇంతలో కలకత్తా విశ్వవిద్యాలయం ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చిందాయనకు. ప్రొఫెసర్‌గా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక శాస్త్ర సదస్సుకి హాజరై లండన్ నుండి ఓడలో భారతదేశానికి వస్తూ ఆకాశం వైపూ, సముద్రపు నీళ్ళ వైపూ చూశారు. అవి నీలంగా ఎందుకున్నాయి అని ఆలోచించారు. 'ఆకాశం' అంటే శూన్యం అని అర్థం. ఆకాశానికి మరి రంగేమిటి? ఆకాశం నీలంగా ఉంది కాబట్టి ఆ నీలం రంగు సముద్రం మీద పడి సముద్ర జలాలు కూడా నీలంగా కనిపిస్తున్నాయని అప్పట్లో భావించేవారు. అది ఆయనకు సరిగ్గా అనిపించలేదు. ఆ విషయం అంతటితో వదిలేయక మన దేశానికి వచ్చిన తర్వాత దాని మీద విస్తృతంగా పరిశోధనలు చేశారు.

అదే సమయంలో ఎక్స్ రే కిరణాలు ఏదైనా పదార్థం గుండా ప్రసరిస్తే వాటి స్వభావం మారుతుంది అని సోదాహరణంగా వివరించి నోబెల్ బహుమతి పొందారు ఏహెచ్ క్రాంప్టన్ అనే శాస్త్రవేత్త. అప్పటికే రామన్ ఆకాశం నీలంగా కనిపించడానికి కారణం కాంతి, వాతావరణంలో గల ధూళి కణాలలో పరావర్తనం చెందడమేననే ప్రాథమిక అంచనాకి వచ్చివున్నారు. దీంతో క్రాంప్టన్ పరిశోధన విషయం విన్న తర్వాత, తన ప్రతిపాదన కరక్టే అనే అభిప్రాయానికి వచ్చారు. ఆయన తనకు తాను 'ఒక పారదర్శకమైన మాధ్యమం ద్వారా కాంతి ప్రయాణించినప్పుడు అది తన స్వభావంలో ఏమైనా మార్పు పొందుతుందా?' అనే ప్రశ్న వేసుకొన్నారు. ఆ దిశగా పరిశోధనలు జరిపి ఆయన చిన్న చిన్న పరికరాలతో ఒక గొప్ప ఆవిష్కరణ చేశారు. అదే 'థియరీ ఆఫ్ రేడియేషన్.' దీనికే 'రామన్ ఎఫెక్ట్' అని నామకరణం చేశారు. ఈ పరిశోధనలకు 1930లో నోబెల్ బహుమతి లభించింది. 'రామన్ ఎఫెక్ట్' కెమికల్ కాంపౌండ్స్ మాలిక్యులర్ స్ట్రక్చర్స్‌ని కనుగొనడానికి ఎంతో ఉపయోగపడింది.



సి.వి. రామన్

సీవీ రామన్‌కు శబ్ద తరంగాల మీద కూడా ఎంతో ఆసక్తి ఉండేది. దీనిని 'ఎకోస్టిక్స్' అంటారు. ఈ ఆసక్తి వలన ఆయన సంగీత పరికరాలలో తీగల అమరికా, వాటి ద్వారా వచ్చే శ్రావ్యమైన ధ్వని తరంగాల మీదా పరిశోధనలు చేశారు. ఆయన తన పరిశోధనల ద్వారా తబలా, మృదంగం, వీణ వంటి పరికరాలు పాశ్చాత్య సంగీత పరికరాలైన డ్రమ్స్ కంటే ఎక్కువ సంగీతపరమైన ధ్వని తరంగాలను ఉత్పత్తి చేస్తాయని తెలిసింది. మన సంప్రదాయ సంగీత పరికరాలనే సంగీత పరికరాలుగా పరిగణించాలనీ, మిగతావి ఎక్కువ శబ్దాన్నే ఉత్పత్తి చేస్తాయి గానీ శ్రావ్యతను కాదని కూడా నిరూపించారు రామన్. తరువాతి కాలంలో ఆయన రంగులు, వాటి వక్రీభవనమూ, పరావర్తనమూ లాంటి విషయాల మీద ఎక్కువగా పరిశోధనలు సాగించారు.

మన దేశంలో పరిశోధనలకు సరైన దిశానిర్దేశం చేసిన ఈ మహనీయుడు తన 82వ యేట 1970 నవంబరు 21న కన్నుమూశారు. ఆయన నోబెల్ బహుమతి పొందిన ఫిబ్రవరి 28 తేదీనే మన 'నేషనల్ సైన్స్ డే'.

వ్యాసకర్త ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్, అగర్తలా ఐఐఐటీ మాజీ డైరెక్టర్
(రేపు జాతీయ సైన్సు దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.తదియ రా.11.21 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: హస్త తె.5.21 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి చిత్త, వర్జ్యం: ప.12.07 నుండి 1.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.30 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.46 వరకు, అమృతఘడియలు: రా.10.44 నుండి 12.30 వరకు ; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 6.01.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి



బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను వర్చువల్‌గా ప్రధాని ప్రారంభించిన అనంతరం శిలాఫలకం వద్ద గవర్నర్ తమిళిసై, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ లక్ష్మణ్ తదితరులు

- కేంద్ర, రాష్ట్రాల సంబంధాలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన
- డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీ కె.లక్ష్మణ్‌తో కలసి పాల్గొన్న గవర్నర్

సనత్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్నేహపూర్వక వాతావరణం, పరస్పర సహకారం అందించుకోవడం ద్వారానే ఎనలేని అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద దేశవ్యాప్తంగా 554 రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలను, వివిధ ప్రాంతాల్లో నిర్మించిన రైల్ ఓవర్ బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీల ప్రారంభోత్సవాలను ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా చేపట్టారు. ఈ జాబితాలో తెలంగాణలో రూ. 230 కోట్లతో 15 రైల్వేస్టేషన్లు, 48 ఆర్‌యూబీ, ఆర్‌ఓబీలు ఉన్నాయి. బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీజేపీ రాజ్యసభ ఎంపీ కె. లక్ష్మణ్‌తో కలసి గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ సాధారణ ప్రజలకు చేరువయ్యేలా ప్రధాని చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విమాన ప్రయాణాన్ని తలపించేలా ఉన్న వందేభారత్ రైళ్లు ఇప్పటికే రాష్ట్రానికి కూడా వచ్చాయని.. భవిష్యత్తులో మరిన్ని వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని, ఇది శుభపరిణామన్నారు.

ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీని కానుకగా ఇవ్వాలి: డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీని తెలంగాణకు కానుకగా ఇస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ఎంపీ లక్ష్మణ్ ప్రత్యేక చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో చేపట్టే ప్రాజెక్టులకు అవసరమైన సహకారాన్ని తమ ప్రభుత్వం అందించేందుకు సర్వదా సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో స్టేషన్ల నిర్మాణం, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలను నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పురాతన బేగంపేట స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవడంపట్ల ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీని మ్యాన్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియాగా ఎంపీ లక్ష్మణ్ అభివర్ణించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కళ్యాణలక్ష్మి' కావాలంటే | మెట్టెలు తొడిగే ఫొటో ఉండాల్సిందే!

దరఖాస్తుదారుల ఆందోళన గైడ్‌లైన్స్‌లోనే ఈ అంశం ఉందంటున్న తహసీల్దార్

వేములవాడ: ప్రభుత్వం ఆడపిల్లల పెళ్లికి కళ్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 ఇస్తున్న విషయం తెల్సిందే. అయితే అందుకు సంబంధించి పలు పత్రాలను తల్లిదండ్రులు రెవెన్యూ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు కూతురు పెళ్లికి సంబంధించిన పత్రిక, పెళ్లి ఫొటోలు, పెళ్లి ధ్రువీకరణ పత్రం, వధూవరూలకు సంబంధించి ఆదాయ, కుల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డును సమర్పించేవారు. అయితే ఈ వివరాలతో పాటుగా మెట్టెలు తొడిగే ఫొటో కూడా జతచేయాలంటూ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త నిబంధనపై దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేశ్ వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి వచ్చిన గైడ్‌లైన్స్‌లో ఈ అంశం కూడా ఉందని వెల్లడించారు.

కుప్పంలో కృష్ణమ్మ

కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం జగన్.. బీడు భూముల్లోకి బిరబిరా

- నవరత్నాలతో కుప్పానికి 57 నెలల్లో రూ.1,400 కోట్లు అందించాం
- 15,000 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం.. మరో 15 వేల మందికిపైగా ఈ నెలలోనే పట్టాలిస్తున్నాం
- మీరంతా నావాళ్లే.. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకున్నా
- సొంత గడ్డకే మంచి చేయని చంద్రబాబుతో రాష్ట్రానికి ఏం ప్రయోజనం?





చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె వద్ద జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

సాక్షి, తిరుపతి: కనీసం సొంత నియోజకవర్గానికైనా మేలు చేయని రాజకీయ నాయకుడు ఇక రాష్ట్రానికి ఏం ఒరగబెడతారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 35 ఏళ్లలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను సైతం పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. కుప్పానికే ప్రయోజనం లేని ఆ నాయకుడి వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం ఉంటుందో అందరూ బాగా ఆలోచన చేయాలని సూచించారు. కరువు తాండవమాడిన కుప్పం నేలకు కృష్ణా జలాలను తరలిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ తాగు, సాగునీటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్ కుప్పం నియోజకవర్గానికి సోమవారం కృష్ణా జలాలను విడుదల చేశారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. అనంతరం శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె వద్ద జరిగిన సభలో ప్రసంగించారు.

మాట నిలబెట్టుకుంటున్నా..

కుప్పం నియోజకవర్గానికి నీళ్లందించే గొప్ప కార్యక్రమాన్ని ఈరోజు పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నాం. కొండలు, గుట్టలు దాటుకుని ఏకంగా 672 కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా కృష్ణమ్మ కుప్పం నియోజకవర్గంలోకి ఇప్పటికే ప్రవేశించింది. 2022 సెప్టెంబర్ 23న ఇదే కుప్పంలో బహిరంగ సభ సందర్భంగా నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలిస్తామని, చంద్రబాబు హయాంలో దోపిడీకి పాల్పడి నిలిపివేసిన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను మనమే పూర్తి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో చంద్రబాబు ముఖ్యమైన పనులను గాలికి వదిలేసి లాభాలు వచ్చే వాటిని అస్మదీయ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి ప్రజాధనాన్ని లూటీ చేశారు. తన నియోజకవర్గ ప్రజలనే దోచుకుని కనీసం దాహార్తి తీర్చని నాయకుడిని ఇంతకాలం భరించిన కుప్పం ప్రజల సహనానికి, మంచితనానికి జోహార్లు చెబుతున్నా. చంద్రబాబు వల్ల కుప్పానికి మంచి జరిగిందా? లేక మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాత కేవలం 57 నెలల వ్యవధిలో కుప్పానికి మేలు జరిగిందా? అన్నది ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. చంద్రబాబు తన హెరిటేజ్ డెయిరీ లాభాల కోసం మూసివేసిన చిత్తూరు డెయిరీని తెరిపించడమే కాకుండా అమూల్‌ను తెచ్చి కుప్పం, పలమనేరు పాడి రైతులందరికీ గిట్టుబాటు ధర అందించింది ఎవరంటే మీ జగన్. ప్రతిష్టాత్మక వెల్లూర్ సీఎంసీ మెడికల్ కాలేజీని చిత్తూరు జిల్లాకు రాకుండా, కుప్పం, పలమనేరు ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది ఎవరంటే చంద్రబాబు, ఈనాడు రామోజీరావు వియ్యంకుడు, చంద్రబాబు పార్టనర్. ఆ కాలేజీని చిత్తూరులో పునఃప్రారంభించేలా చేసింది ఎవరంటే మీ జగన్. కుప్పంలో మరో రెండు విద్యుత్తు సబ్ స్టేషన్లు, ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్సులు నిర్మిస్తోంది ఎవరంటే మీ జగన్. కుప్పం మున్సిపాలిటీకి రూ.66 కోట్లు ఇచ్చి పనులు చేయిస్తోంది మీ జగన్.

బ్యాంకు స్టేట్‌మెంట్లే సాక్ష్యం

కుప్పంలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్నీ అడుగుతున్నా. మీ బ్యాంకులకు వెళ్లి గత పదేళ్ల అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకోండి. చంద్రబాబు హయాంలో ఐదేళ్లు, మీ బిడ్డ వచ్చాక ఐదేళ్లు కలిపి మొత్తం పదేళ్ల స్టేట్‌మెంట్‌ను పరిశీలించండి. చంద్రబాబు పాలనలో మీ బ్యాంకు ఖాతాల్లోకి కనీసం ఒక్క రూపాయైనా వచ్చిందేమో చూడాలని కోరుతున్నా. మీ బిడ్డ ప్రభుత్వంలో గత 57 నెలలుగా నవరత్నాలతో మీ ఖాతాలకు అందించిన సాయాన్ని స్టేట్‌మెంట్‌లో చూడండి. నాడు అరకొరగా రూ.1,000 పింఛన్ కుప్పంలో కేవలం 31 వేల మందికి మాత్రమే ఇచ్చారు. వాటిని రూ.3 వేలకు పెంచింది మీ బిడ్డ ప్రభుత్వమే. ఇవాళ ఏకంగా 45,374 మంది ఇదే కుప్పంలో పెన్షన్లు తీసుకుంటున్నారు.

- ఒక్క కుప్పంలోనే 44,640 మంది రైతన్నలకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏకంగా రూ.214 కోట్లు పెట్టుబడి సాయంగా అందచేశాం. చంద్రబాబు హయాంలో రైతు భరోసా లేదు. రైతు భరోసా కేంద్రాలూ లేవు.
- చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ పేరుతో అక్క చెల్లెమ్మలను దగా చేయడంతోపాటు 2016 అక్టోబర్ నుంచి సున్నా వడ్డీని కూడా రద్దు చేశారు. మనందరి ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.26 వేల కోట్లు పొదుపు సంఘాల మహిళలకు ఇవ్వగా ఒక్క కుప్పంలోనే 44,888 మంది అక్కచెల్లెమ్మలకు రూ.172 కోట్లు అందించాం. బాబు సున్నావడ్డీని ఎగ్గొడితే మనందరి ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు మరో రూ.30 కోట్లు ఇచ్చింది. చంద్రబాబు హయాంలో అమ్మ ఒడి అనే పథకమే లేదు. మన ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి ద్వారా కుప్పంలో 35,951 మంది తల్లులకు రూ.155 కోట్లు అందచేసింది.
- కుప్పంలో చంద్రబాబు పాలనలో అందించిన ఇళ్ల పట్టాలు సున్నా. అదే మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక కుప్పంలో ఇప్పటికే 15,721 ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఈనెలలోనే మరో 15 వేల ఇళ్ల పట్టాలు కూడా ఇవ్వబోతున్నాం. చంద్రబాబు హయాంలో కుప్పంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్లు 3,547 కాగా కట్టింది కేవలం 2,968 మాత్రమే. అదే మీ బిడ్డ ప్రభుత్వం 7,898 ఇళ్లు మంజూరు చేసి ఇప్పటికే 4,871 ఇళ్లను పూర్తి చేసింది.
- 45–60 ఏళ్ల వయసున్న అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారత కోసం చంద్రబాబు చేసింది సున్నా. మన ప్రభుత్వం వైఎస్సార్ చేయూత ద్వారా కుప్పంలో 19,921 మంది కుటుంబాల ఖాతాల్లోకి ఇప్పటికే రూ.85 కోట్లు జమ చేసింది. నాడు కుప్పంలో కేవలం 7,002 మందికి ఆరోగ్యశ్రీతో రూ.28 కోట్లు విదిలిస్తే మన ప్రభుత్వం ఆరోగ్యశ్రీని 3,350 ప్రొసీజర్లకు విస్తరించి ఆరోగ్య ఆసరా కూడా అందిస్తూ కుప్పంలో 17,552 మందికి రూ.64 కోట్ల మేర మేలు చేసింది.

బాబుకు ఓటేసిన పేదలూ నావాళ్లే..

కుప్పంలో గత ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేసిన పేదలందరికీ ఓ మాట చెబుతున్నా. మీరందరూ నావాళ్లే అని భావిస్తూ మంచి మనసుతో మీకు మేలు చేశాం. కుప్పం నియోజకవర్గంలో మొత్తం 87,941 కుటుంబాలుంటే ఈ 57 నెలల కాలంలో నవరత్నాల పథకాలను ఏకంగా 82,039 కుటుంబాలు (93.29%) అందుకున్నాయి. మనసున్న పాలన అంటే ఇదీ కాదా? ఆలోచన చేయండి. 2019 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా డీబీటీతో నేరుగా రూ.2.55 లక్షల కోట్లు పేదల ఖాతాల్లోకి జమ చేస్తే ఒక్క కుప్పం నియోజకవర్గంలోని నా అక్కచెల్లెమ్మలకు రూ.1,400 కోట్లు అందచేశాం.

8 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

- అనర్హులుగా వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి నలుగురు
- వారిపై స్పీకర్‌కు వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఫిర్యాదులు
- ఎమ్మెల్యేలను విచారించి, వివరణ తీసుకున్న స్పీకర్ తమ్మినేని

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన 8 మంది శాసన సభ్యులపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేశారు. వీరిలో వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి నలుగురు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి శాసన సభకు ఎన్నికై పార్టీ ఫిరాయించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్ నియోజకవర్గం), ఆనం రామనారాయణరెడ్డి (వెంకటగిరి), మేకపాటి చంద్రశేఖరరెడ్డి (ఉదయగిరి), ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ)పై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నుంచి శాసన సభకు ఎన్నికై పార్టీకి దూరంగా ఉంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్ (విశాఖ దక్షిణ), కరణం బలరాం (చీరాల), మద్దాల గిరి (గుంటూరు వెస్ట్), వల్లభనేని వంశీ (గన్నవరం)పై అనర్హత వేటు వేయాలని టీడీపీ విప్ డోలా బాల వీరాంజనేయ స్వామి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రెండు పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ తమ్మినేని సీతారాం పలుమార్లు ఎమ్మెల్యేలను విచారించారు. ఎమ్మెల్యేల నుంచి వివరణలు తీసుకున్నారు. పార్టీల విప్‌లు చేసిన ఫిర్యాదులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలించిన స్పీకర్.. ఆ 8 మంది సభ్యులు పార్టీ ఫిరాయించినట్టు తేల్చారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. స్పీకర్ ఆదేశాల మేరకు ఏపీ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజావాణి వినతుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

సాక్షి, హైదరాబాద్: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే విజ్ఞాపనలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమ నిర్వహణ, విజ్ఞాపనలపై సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు వచ్చిన పిటిషన్ల పరిష్కారానికి జిల్లా స్థాయిలో నిర్ణయం తీసుకోవడంతోపాటు అవసరాన్ని బట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, కమిటీలో పోలీస్, పంచాయతీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులను సభ్యులుగా నియమించాలని ఆదేశించారు. కమిటీ విధివిధానాలను వెంటనే రూపొందించే బాధ్యతను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌కు అప్పగించారు.

ఆశలతో ఉచ్చు.. ఎన్నో ఇళ్లలో చిచ్చు

ఇదే మార్గదర్శి ఆర్థిక కుతంత్రం

- పక్కా పన్నాగంతో అప్పులు ఉచ్చులోకి చందాదారులు
- డిఫాల్ట్ అయినా చిట్టీలు కొనసాగించి అప్పులు పెంచేసిన వైనం
- ఒక చిట్టీ డబ్బుల కోసం మరెన్నో గ్రూపుల్లో చేర్పించడం
- ఆస్తులు అమ్ముకుని రోడ్డున పడుతున్న సామాన్యులు



గురివింద
రామోజీ-6

సాక్షి, అమరావతి: 'మార్గదర్శి తోడుంటే ఆనందం మీవెంటే.. ఇళ్లు, కార్లు, ఫర్నీచర్, నగలు అన్నీ కొనుక్కోవచ్చు..' ఇదీ టీవీ చానళ్లలో, హోర్డింగుల్లో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఊదరగొట్టే ప్రచారం. అది నిజమేనని నమ్మి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చేరిన చందాదారుల ఇళ్లల్లో ఆనందం ఆవిరవుతోందన్నది పచ్చి నిజం. కొత్త ఇళ్లు, కార్లు కొనుక్కోవడం దేవుడెరుగు.. ఉన్న ఇళ్లు, భూములు, బంగారం అమ్ముకుంటున్నా అప్పుల ఊబి నుంచి బయట పడటం లేదు. అందమైన కలలు చూపిస్తూ రామోజీరావు సామాన్యుల మెడకు చిట్టీల ఉచ్చు బిగిస్తున్నారు. ఒక చిట్టీ అప్పు తీర్చడం పేరిట మరో చిట్టీలో చేర్పిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తున్నారు. ఆస్తులు తెగనమ్ముకున్నా అప్పులు తీరవు.. సరికదా కాల్‌మనీ రాకెట్‌ను తలపిస్తూ మార్గదర్శి సిబ్బంది వేధింపులతో చందాదారుల కుటుంబాలు మానసిక క్షోభ అనుభవిస్తుండటం రామోజీ ఆర్థిక అరచాకాలకు నిదర్శనం. విజయవాడకు చెందిన ఓ ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ కుటుంబానికి ఇలాంటి క్షోభే మిగిలింది. ఈ వెటర్నరీ వైద్యుడి కుటుంబ సభ్యులు కోళ్ల ఫారం నిర్వహిస్తున్నారు. ఆయన భార్య మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరారు. ఆ తర్వాత ఆమెకు తెలియకుండానే మరికొన్ని చిట్టీ గ్రూపుల్లో సభ్యురాలిగా చేర్చారు. ఆ చిట్టీ గ్రూపుల చందాలు చెల్లించడం కోసమంటూ మరికొన్ని చిట్టీ గ్రూపుల్లో చేర్పిస్తూ ఏకంగా 90 చిట్టీ గ్రూపుల్లో సభ్యురాలిగా చూపించారు. నిబంధనల ప్రకారం ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఏకంగా 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించారు. అనంతరం ఆ కుటుంబం ఆస్తులను గుంజుకున్నారు. ఆ వెటర్నరీ వైద్యుడు జీపీఎఫ్ డబ్బులు రూ.35 లక్షలతోపాటు పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించినా ఇంకా అప్పులు తీరనే లేదు. కాల్‌మనీ రాకెట్ గుండాల మాదిరిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది వచ్చి అల్లరి చేసి మరీ వారి ఇంటిని వేలం వేయించారు. అంతటితో రామోజీ ఆగడాలు ఆగలేదు. విదేశాల్లో చదువుతున్న ఆ వెటర్నరీ డాక్టర్ కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించారు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మళ్లీ వేధింపులు మొదలు పెట్టారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది.. ఎలా వేలం పాటలో పాల్గొంది.. అసలు తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది.. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే లేదు. ఆమె పేరుతో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఉద్యోగులే మోసం చేశారు.

తలలు అమ్ముకున్నా తీరని అప్పులు

జాతీయ బ్యాంకులుగానీ ప్రైవేటు బ్యాంకులుగానీ తమ ఖాతాదారుల ఆర్థిక పరిస్థితిని సహేతుకంగా అంచనా వేసి తదనుగుణంగా రుణాలు ఇస్తాయి. దేశంలో ఏ ఆర్థిక సంస్థ అయినా ఈ నిబంధనను పాటించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ మాత్రం అవేవీ పట్టించుకోదు. చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారికి కూడా వారి ఆదాయం, ఆర్థిక స్థోమతను మించి ఎన్నో చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పిస్తోంది. దాంతో వాయిదాలు చెల్లించలేక వారు అప్పుల ఊబిలో కూరుకుపోయి తమకున్న కొద్దిపాటి ఆస్తులను తమకు ధారాదత్తం చేసే పరిస్థితిని సృష్టిస్తున్నారు. అందుకు విజయవాడకు చెందిన ఓ ట్యాక్సీ డ్రైవర్ దీనగాథే తార్కాణం. ఇతను మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.2 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యునిగా చేరారు. తర్వాత మరిన్ని చిట్టీ గ్రూపుల్లో చేరితే ఆర్థికంగా కలసి వస్తుందని చెప్పడంతో మరో రెండు గ్రూపుల్లో సభ్యుడిగా చేరాడు. తర్వాత ఆయనకు తెలియకుండానే ఏకంగా 20 గ్రూపుల్లో సభ్యునిగా చేర్పించేశారు. నెలకు రూ.50 వేలు వాయిదాల కిందే చెల్లించాల్సిన పరిస్థితి సృష్టించారు. చిట్టీ పాట పాడిన తర్వాత ప్రైజ్‌మనీ తీసుకునేందుకు ఆయన ఇచ్చిన ష్యూరిటీలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్దేశపూర్వకంగానే కొర్రీలు వేసి తిరస్కరించింది. వాయిదాల బకాయిలు చెల్లించేందుకు తమకున్న ఇల్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి సృష్టించారు.

బరితెగించి రామోజీ ఆర్థిక ఆగడాలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల్లో అత్యధికులది ఇలాంటి దుస్థితే. రాజకీయంగా ఎలాంటి అండాదండా లేని వారు, ప్రభుత్వ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఇతర మధ్య తరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకుని రామోజీరావు పక్కాగా తన కుట్రను అమలు చేస్తూ వారి ఆస్తులను కొల్లగొడుతున్నారు. అటువంటి చందాదారుల్లో చిట్టీల చందాలు చెల్లింపులో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, వారిని మరికొన్ని చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పిస్తున్నారు. కొత్త చిట్టీ గ్రూపులో ప్రైజ్ మనీతో పాత చిట్టీ గ్రూపు వాయిదాలు చెల్లించవచ్చని ఆశ చూపిస్తున్నారు. మళ్లీ కొత్త చిట్టీ దగ్గరకు వచ్చేసరికి ష్యూరిటీల పేరుతోనో మరో రకంగానో కొర్రీలు వేసి మరిన్ని చిట్టీ గ్రూపుల్లో చేర్పిస్తున్నారు. చాలా మంది చందాదారులకు తెలియకుండానే వారి పేరిట మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లు చిట్టీ పాటలు పాడేస్తున్నారు. ఆ ప్రైజ్‌మనీని మరో చిట్టీ గ్రూపులో సర్దుబాటు చేసినట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు. అలా చందాదారులు తమకు తెలియకుండానే లెక్కకు మించి చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

యథేచ్ఛగా చట్టం ఉల్లంఘన

- ఎవరైనా ఓ చందాదారుడు చిట్టీ పాట పాడిన తర్వాత తగిన ష్యూరిటీలు చూపించకపోతే... ఆ చిట్టీ పాటను రద్దు చేయాలి. ఆ చిట్టీ గ్రూపునకు మళ్లీ పాట(వేలం) నిర్వహించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆ నిబంధనను పాటించడం లేదు. ఆ చిట్టీ పాటను రద్దు చేయడం లేదు. కొత్తగా పాటను నిర్వహించడమూ లేదు. ఆ చిట్టీ పాట సక్రమంగా నిర్వహించినట్టు చూపిస్తూ ఆ ప్రైజ్‌మనీని వేరే ఖాతాల్లోకి మళ్లించేస్తోంది. ఆ చిట్టీ గ్రూపును యథావిధిగా కొనసాగిస్తోంది. దాంతో ఆ డిఫాల్టర్ చందాదారుడు తర్వాత నెలల వాయిదాలు కూడా చెల్లించాల్సినట్టు చూపిస్తూ అప్పుల ఊబిలోకి కురుకుపోయేలా చేస్తోంది.
- వాయిదాలు చెల్లించలేని చందాదారుడిని డిఫాల్టర్‌గా చూపించాలి. అంతవరకు ఆ చందాదారు చెల్లించిన మొత్తాన్ని ప్రత్యేక ఖాతాలో వేసి కమీషన్ పోగా వెనక్కి ఇచ్చేయాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అలా చేయడం లేదు. ఆ డిఫాల్టర్ చందాదారు మొత్తాన్ని మరో చిట్టీ బకాయి కింద జమ చేసినట్టు చూపిస్తూ.. ఇంకా బకాయిలు చెల్లించాలని రికార్డుల్లో ఆ చందాదరుని రుణగ్రస్తునిగా చూపిస్తోంది.
- ఎవరైనా ప్రైజ్‌మనీ తీసుకోని చందాదారు వాయిదాలు చెల్లించలేకపోతే డిఫాల్టర్‌గా ప్రకటించాలి. ఆ చందాదారునికి 14 రోజుల నోటీసు ఇచ్చి డిఫాల్టర్‌గా ప్రకటించినప్పటి వరకు చెల్లించిన వాయి దాలను ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ఆ తర్వాత ఏడు రోజుల్లో ఆ మొత్తాన్ని నిర్దేశిత వడ్డీ రేటుతో కలిపి చెల్లించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఈ నిబంధనను పాటించడం లేదు. అటువంటి చందాదారులను ఉద్దేశపూర్వకంగా డిఫాల్టర్లుగా ప్రకటించకుండా కొనసాగిస్తూ వారు మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోంది.
- చిట్‌ఫండ్ చట్టం ప్రకారం ప్రతి చిట్టీ గ్రూపు దేనికదే ప్రత్యేకం. ప్రతి చిట్టీ గ్రూపు ఒక ప్రత్యేక కంపెనీ వంటిది. ఒక చిట్టీ గ్రూపు చందాదారుగా చెల్లించిన మొత్తాన్ని మరో చిట్టీ గ్రూపులో సర్దుబాటు చేసినట్టు చూపించకూడదు. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉల్లంఘిస్తూ చందాదారులను ఎన్నో చిట్టీ గ్రూపుల్లో సభ్యునిగా చూపిస్తూ... అన్ని చిట్టీ గ్రూపుల మొత్తాన్ని ఒకదానికి ఒకటి అనుసంధినిస్తూ చందాదారులను ఉద్దేశ పూర్వకంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోంది.

బాధితులకు అండగా చట్టం, ప్రభుత్వం

చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు, ఆగడాల నుంచి బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేసేందుకు కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం సరైన వ్యవస్థను ఏర్పాటు చేసింది. చిట్టీ గ్రూపుల డిఫాల్టర్ సభ్యుల విషయంలో అనుసరించాలిన నిబంధనలను కేంద్ర చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 22లో విస్పష్టంగా పేర్కొంది. అయితే దశాబ్దాలుగా ప్రభుత్వాలు పట్టించుకోని ఆ చట్టాన్ని వైఎస్సార్‌సీపీ పటిష్ఠంగా అమలు చేస్తోంది. చిట్ రిజిస్ట్రార్లతోపాటు ప్రభుత్వం వరకు వివిధ స్థాయిల్లో అప్పీలు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మార్గదర్శి అక్రమాలు, వేధింపులకు చెక్ పెట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. చందాదారులు తమకు చిట్‌ఫండ్ కంపెనీ మోసం చేసిందీ.. వేధిస్తోంది.. అని భావిస్తే తగిన ఆధారాలతో జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయవచ్చు. దానిపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారించి తగిన చర్యలు తీసుకుంటారు. జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఆదేశాలతో సంతృప్తి చెందకపోతే బాధితులు రాష్ట్ర స్థాయిలో కూడా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదేశాలు ఇచ్చిన రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అప్పీల్ చేసి తగిన న్యాయం పొందవచ్చు.

రేవంత్ సీఎం అభ్యర్థి అంటే బీఆర్‌ఎస్‌కు 'మూడు'ను!

- కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డిని సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించి ఉంటే బీఆర్‌ఎస్‌కు మూడు సీట్లే వచ్చేవని ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవి ఎద్దేవా చేశారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చరణ్‌కౌశిక్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఉంటే కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు మాత్రమే వచ్చేవని నాగర్‌కర్నూల్‌లో మాజీమంత్రి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని అన్నారు. 'కేటీఆర్ పుట్టు గుడ్డి, పుట్టు చెవిటి... కాబట్టే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూడలేక పోతున్నారు, కేటీఆర్ పదే పదే 420 అని కాంగ్రెస్‌ను విమర్శిస్తే భవిష్యత్‌లో పోలీస్ కేసు పెట్టాల్సి ఉంటుంది'అని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించిందని నిప్పులు చెరిగారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీకి వంద సీట్లు దాటవని మల్లు రవి అన్నారు.

కారు ఇక తుప్పు పట్టడమే: నిరంజన్

సాక్షి, హైదరాబాద్: 'కారు మూడు నెలలుగా గ్యారేజీలో ఉందంటే దాని పరిస్థితి ఎంత అధ్వానమో గుర్తుపెట్టుకోవాలి, కారు ఇక తుప్పు పట్టడమే తప్ప బయటికి రాదు'అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎద్దేవా చేశారు. ప్రజాసమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి రాసినట్లు ఎప్పుడైనా అప్పటి సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారా అని బీఆర్‌ఎస్ మాజీమంత్రి హరీశ్‌రావును నిరంజన్ ప్రశ్నించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీపై ఉచిత సలహాలతో హరీశ్‌రావు లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆర్టీసీలో రద్దీ పెరగడం, రెండు వేల బస్సులు కొనడమంటే మహిళలకు ఉచిత ప్రయాణం హామీ సక్సెస్ అయిందని ఒప్పుకున్నట్టే కదా అని అన్నారు. '2019లో ఆర్టీసీ సిబ్బంది సమ్మె చేసినప్పుడు మీరు ఎంత కఠినంగా వ్యవహరించారో గుర్తు చేసుకోవాలి, అలాంటి మీరు సలహాలు ఇస్తున్నారా'అని ఎద్దేవా చేశారు.

ఎవరు బుడ్డరఖానో.. ఎవరు తిస్మార్‌ఖానో చూద్దాం!

సాక్షి,హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎవరు బుడ్డరఖానో.. ఎవరు తీస్మార్‌ఖానో చూద్దామని బీఆర్‌ఎస్ నేతలకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సవాల్ విసిరారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ షెడ్డుకు పోయిన కారు ఇంకో 24 ఏళ్లు అయినా బయటకురాదని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

కేజ్రీవాల్ ఏడోసారీ 'సారీ'

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఏడోసారి కూడా ఈడీ విచారణకు హాజరుకాలేదు. మద్యం పాలసీ కేసులో ఈ నెల 26న విచారణకు హాజరవ్వాలని ఈడీ ఏడోసారి కేజ్రీవాల్‌కు సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈడీ ఎదుటకు వెళ్లాలని కోర్టు ఆదేశిస్తే కేజ్రీవాల్ వెళతారని తెలిపింది. ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందని, తదుపరి విచారణ మార్చి 16న ఉన్నందున అప్పటి దాకా వేచి ఉండాలని సోమవారం ఆప్ ఓ ప్రకటనలో పేర్కొంది. సమన్లు పంపుతూ విచారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేయరాదని కోరింది.

ప్రజల సూచనలతో బీజేపీ మేనిఫెస్టో: నడ్డా

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టో రూపకల్పనకు గాను ప్రజల నుంచి సూచనలు కోరుతున్నట్లు పార్టీ చీఫ్ జేపీ నడ్డా చెప్పారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలను సేకరించేందుకు సోమవారం 'వికసిత్ భారత్ మోదీ కీ గ్యారెంటీ' వీడియో వ్యాన్లను నడ్డా ప్రారంభించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నదే తమ పార్టీ ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ అమలు చేసిన పనుల వీడియోలను ఈ వ్యాన్లలో ప్రదర్శిస్తారు. పార్టీ మేనిఫెస్టో రూపకల్పనకు సూచనలు ఇవ్వాలనుకునే వారు 9090902024కు మిస్డ్ కాల్ ఇవ్వాలని నడ్డా కోరారు. నమో యాప్‌లో కూడా ప్రజలు తమ సూచనలను పంపవచ్చన్నారు.

బీజేపీలోకి కాంగ్రెస్ ఎంపీ

రాంచీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌కు చెందిన ఆ పార్టీ ఎంపీ గీతా కోడా సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. మాజీ సీఎం మధు కోడా భార్య అయిన గీత రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున ఎన్నికైన ఏకైక లోక్‌సభ సభ్యురాలు. మధు కోడా జార్ఖండ్ సీఎంగా 2006 నుంచి 2008 వరకు పనిచేశారు. బొగ్గు కుంభకోణంలో దోషిగా తేలడంతో జైలు శిక్ష అనుభవించారు.

'వారంలో షాజహాన్ అరెస్ట్'

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాళీకి చెందిన ముఖ్యనేత షాజహాన్ షేక్‌ను రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లోనే అరెస్ట్ చేస్తుందని అధికార టీఎంసీ పార్టీ పేర్కొంది. షాజహాన్ షేక్ అరెస్ట్‌పై స్టే ఇవ్వబోమంటూ కలకత్తా హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో అధికార పార్టీ ఈ మేరకు పేర్కొంది. పరారీలో ఉన్న షాజహాన్‌ను పోలీసులు వారం రోజుల్లో అరెస్ట్ చేస్తారని తెలిపింది. హైకోర్టు ఉత్తర్వులను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆరోపించింది. అతడి అరెస్ట్‌కు తాము ఎటువంటి అడ్డంకులు కల్పించబోమని తెలిపింది.

గొప్పగా మాట్లాడి వస్తే ఇలాగేనా చెక్ చేసేది ?

కస్టమ్స్ అధికారులతో యానా మిర్ వాగ్వాదం



న్యూఢిల్లీ: పాక్ బాలికల విద్య, హక్కుల ఉద్యమకారిణి మలాలా యూసఫ్‌జాయ్‌లాగా తానేమీ స్వదేశం వదిలిపోలేదని, సొంత కశ్మీర్‌లో హాయిగా ఉన్నానంటూ బ్రిటన్ పార్లమెంట్ భవనంలో ప్రసంగించిన కశ్మీర్ యువతి యానా మిర్ ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. బ్రిటన్ నుంచి విమానంలో తిరిగొచ్చాక ఆమె బ్యాగులను ఢిల్లీ కస్టమ్స్ అధికారులు తనిఖీచేయడమే ఆమె ఆగ్రహానికి లోనయ్యారు. బ్రిటన్‌లో భారత్ గురించి గొప్పగా ప్రసంగించిన నాలాంటి వ్యక్తిని ఇలాగేనా అవమానించేది?. ఖరీదైన లూయిస్ విట్టన్ బ్రాండ్ షాపింగ్ ఖాళీ సంచులు తెచ్చినందుకే బిల్లులు ఎగ్గొట్టిన దొంగలా చూస్తున్నారు. నన్ను వాళ్లు ఇండియా మీడియా యోధురాలిగా భావిస్తే మీరేమో ఇక్కడ నన్ను బ్రాండ్ స్మగ్లర్‌లా భావించి పరువు తీస్తున్నారు'' అని అధికారులతో స్వరం పెంచి మాట్లాడారు. అధికారులతో వాగ్వాదం తాలూకు వీడియోను స్వయంగా కెమెరాతో షూట్‌చేసి 'ఎక్స్'లో షేర్‌చేశారు. దీనిపై ఢిల్లీ కస్టమ్స్ అధికారులు వివరణ ఇచ్చారు. ''అంతర్జాతీయ ప్రయాణికుల బ్యాగులను స్కానింగ్ చేయడం సర్వసాధారణం. గౌరవం చట్టాలకు అతీతం కాదు. బ్యాగ్ స్కానింగ్‌కు ఆమె ఒప్పుకోలేదు' అని అన్నారు.

రష్యా యుద్ధరంగం నుంచి భారతీయులు వెనక్కు

న్యూఢిల్లీ: ఉక్రెయిన్– రష్యా యుద్ధంలో రష్యా సైన్యానికి సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న భారతీయ యువకుల్లో కొందరిని సురక్షితంగా తిరిగి పంపించేశారు. రష్యా ఆర్మీకి 'సపోర్ట్ స్టాఫ్'గా చేరి సెక్యూరిటీ హెల్పర్లుగా విధుల్లో ఉన్న యువకులను వీలైనంత త్వరగా వెనక్కి పంపాలని భారత విదేశాంగ శాఖ డిమాండ్‌చేసిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకుంది. భారత్‌చేసిన విజ్ఞప్తిమేరకు కొందరిని రష్యా స్వదేశానికి పంపిందని భారత విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది. అక్కడి భారతీయులందరినీ సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే పనికే భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. రష్యాలో ఇతరత్రా ఉద్యోగాల్లో చేరిస్తామని మభ్యపెట్టి కొందరు ఏజెంట్లు ఈ యువకులను రష్యా యుద్ధక్షేత్రానికి తరలించిన విషయం తెల్సిందే.

గాజాలో ఆకలి కేకలు

23 లక్షల మందికీ ఆహార కొరత | కరువుతో అలమటిస్తున్నది 5 లక్షలు

- నానాటికీ పెరుగుతున్న ఆకలిచావులు
- సహాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయెల్
- ఘోరకలి దిశగా పరిస్థితులు: ఐరాస



గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. అక్కడున్న మొత్తం 23 లక్షల మందీ జనాభా తీవ్ర ఆహార కొరతతో అల్లాడుతున్నారు. 80 శాతం మంది గాజావాసులు ఇజ్రాయెల్ దాడులకు తాళలేక, దాని బెదిరింపులకు తలొగ్గి ఇప్పటికే ఇల్లూ వాకిలీ వదిలేశారు. కొద్ది నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఎలాంటి సహాయక సామగ్రినీ ఇజ్రాయెల్ అనుమతించకపోవడంతో అన్నమో రామచంద్రా అంటూ అంతా అలమటిస్తున్నారు. వారిలోనూ కనీసం 5 లక్షల మంది అత్యంత తీవ్రమైన కరువు బారిన పడ్డారని ఐరాస ఆవేదన వెలిబుచ్చింది. తాళలేని ఆకలిబాధతో దుర్భర వేదన అనుభవిస్తున్నారని ఐరాస పాలస్తీనా శరణార్థుల సంస్థ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) తాజా నివేదికలో వెల్లడించింది. వారికి తక్షణ సాయం అందకపోతే అతి త్వరలోనే గాజా ఆకలిచావులకు ఆలవాలంగా మారడం ఖాయమని హెచ్చరించింది...

నరకానికి నకళ్లు...

గత ఆదివారం గాజా శరణార్థి శిబిరంలో ఓ రెణ్నెల్ల పసివాడు ఆకలికి తాళలేక మృత్యువాత పడ్డాడు. గాజాలో కనీవినీ ఎరగని మానవీయ సంక్షోభానికి ఇది కేవలం ఆరంభం మాత్రమే కావచ్చని ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మున్ముందు అక్కడ పదులు, వందలు, వేలల్లో, అంతకుమించి ఆకలి చావులు తప్పకపోవచ్చని హెచ్చరిస్తున్నాయి. ప్రతీకారేచ్ఛతో పాలస్తీనాపై నాలుగున్నర నెలలుగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ ఆ క్రమంలో గాజా స్ట్రిప్‌ను అష్ట దిగ్బంధనం చేయడమే ఇందుకు కారణం. గాజాకు ఆహారం, నిత్యావసరాల సరఫరాను కూడా ఇజ్రాయెల్ వీలైనంతగా అడ్డుకుంటూ వస్తోంది. చివరికి ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల సాయాన్ని కూడా అనుమతించడం లేదు. దాంతో గాజావాసులు అల్లాడిపోతున్నారు. శరణార్థి శిబిరాలు నరకానికి నకళ్లుగా మారుతున్నాయి. కొన్నాళ్లుగా ఆకలి కేకలతో ప్రతిధ్వనిస్తున్నాయి. యుద్ధం మొదలైన తొలినాళ్లలో గాజాలోకి రోజుకు 500 పై చిలుకు వాహనాల్లో సహాయ సామగ్రి వచ్చేది. క్రమంగా 50 వాహనాలు రావడమే గగనమైపోయింది. ఇప్పుడవి 10కి దాటడం లేదు! ఉత్తర గాజాలోనైతే పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆ ప్రాంతానికి ఎలాంటి మానవతా సాయమూ అందక ఇప్పటికే నెల రోజులు దాటిపోయింది. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ కూడా చివరిసారిగా జనవరి 23 అక్కడికి సహాయ సామగ్రిని పంపింది. నాటినుంచి ఇజ్రాయెల్ ఆంక్షలు తీవ్రతరం కావడంతో చేతులెత్తేసినట్టు సంస్థ చీఫ్ ఫిలిప్ లాజరిని స్వయంగా అంగీకరించారు! గాజా ఆకలి కేకలను పూర్తిగా మానవ కల్పిత సంక్షోభంగా ఆయన అభివర్ణించారు. ''సహాయ సామగ్రితో కూడిన వాహనాలేవీ గాజాకు చేరకుండా చాలా రోజులుగా ఇజ్రాయెల్ పూర్తిగా అడ్డుకుంటోంది. కనీసం ఆహార పదార్థాలనైనా అనుమతించాలని కోరినా పెడచెవిన పెడుతోంది'' అంటూ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు.


కలుపు మొక్కలే మహాప్రసాదం

ఆకలికి తట్టుకోలేక గాజావాసులు చివరికి కలుపు మొక్కలు తింటున్నారు! ఔషధంగా వాడాల్సిన ఈ మొక్కలను ఆహారంగా తీసుకుంటే ప్రమాదమని తెలిసి కూడా మరో దారి లేక వాటితోనే కడుపు నింపుకుంటున్నారు. దీన్ని కూడా సొమ్ము చేసుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. మాలో అని పిలిచే ఈ మొక్కలను కట్టకింత అని రేటు పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఆకలికి తాళలేక గుర్రాల కళేబరాలనూ తింటున్నారు!

మాటలకందని విషాదం...

యూఎన్ ఆఫీస్ ఫర్ ద కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫైర్స్ (ఓసీహెచ్‌ఏ) గణాంకాల మేరకు గాజాలోని మొత్తం 23 లక్షల మందినీ తీవ్ర ఆహార కొరత వేధిస్తోంది. వారిలోనూ 5 లక్షల మందికి పైగా తీవ్రమైన కరువు పరిస్థితుల బారిన పడ్డారు. ఇజ్రాయెల్ వైఖరే ఇందుకు ప్రధాన కారణం...

- గాజాలోకి సహాయ సామగ్రి కోసం ఇజ్రాయెల్ కేవలం ఒకే ఒక ఎంట్రీ పాయింట్‌ను తెరిచి ఉంచింది.
- ఆ మార్గంలోనూ దారిపొడవునా లెక్కలేనన్ని చెక్ పాయింట్లు పెట్టి ఒక్కో వాహనాన్ని రోజుల తరబడి తనిఖీ చేస్తోంది.
- దీనికి తోడు అతివాద ఇజ్రాయెలీ నిరసనకారులు పాలస్తీనా వాసులకు సాయమూ అందడానికి వీల్లేదంటూ భీష్మించుకున్నారు.
- దక్షిణ గాజా ఎంట్రీ పాయింట్‌ను కొన్నాళ్లుగా వారు పూర్తిగా దిగ్బంధించారు.
- సహాయక వాహనాలకు భద్రత కల్పిస్తున్న స్థానిక పోలీసుల్లో 8 మంది ఇటీవల ఇజ్రాయెల్ దాడులకు బలయ్యారు. అప్పట్నుంచీ ఎస్కార్టుగా వచ్చే వారే కరువయ్యారు.
- దాంతో గాజాలో సహాయక వాహనం కనిపిస్తే చాలు, జనమంతా ఎగబడే పరిస్థితి నెలకొని ఉంది! వాహన సిబ్బందిని చితగ్గొట్టి చేతికందినన్ని సరుకులు లాక్కెళ్తున్నారు.
- మరోవైపు దీన్ని సాకుగా చూపి ఇజ్రాయెల్ సహాయ వాహనాలను అడ్డుకుంటోంది.
- గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు మెరుపు దాడి చేసి వందల మందిని పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. యుద్ధానికి కారణంగా నిలిచిన ఈ దాడిలో ఐరాస పాలస్తీనా శరణార్థుల సంస్థ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) సిబ్బంది పాత్రా ఉందని ఇటీవల తేలడంతో ఆ సంస్థ గాజా నుంచి దాదాపుగా వైదొలగింది. సహాయక సామగ్రి చేరవేతలో ఇన్నాళ్లూ వ్యవహరించిన ఆ సంస్థ నిష్క్రమణతో గాజావాసుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**



జూన్ నుంచి మూడో టర్మ్

- మా ఘనవిజయం ఖాయం: మోదీ
- యువత కలలే తన సంకల్పమని వెల్లడి
- పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. జూన్ నుంచి తమ మూడో టర్మ్ పాలన మొదలవుతుందని ధీమా వెలిబుచ్చారు. ''ఆ తర్వాత సాకారమయ్యే వికసిత భారత్ దేశ యువత కలలకు ప్రతిరూపంగా ఉంటుంది. దేశ రూపురేఖలు ఎలా ఉండాలో నిర్ణయించే పూర్తి హక్కులు వారికున్నాయి. వారి కలలే నా సంకల్పం . నా సంకల్పమే వికసిత భారతానికి హామీ. ఈ నయా భారత్‌లో చిన్న లక్ష్యాలకు చోటు లేదు. పెద్ద పెద్ద కలలు కంటూ వాటి సాకారానికి నిర్విరామంగా కృషి చేస్తున్నాం. పదేళ్లుగా ఈ వేగం ప్రపంచాన్నే అబ్బురపరుస్తోంది'' అన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రూ.41 వేల కోట్లతో తలపెట్టిన 2,000 పై చిలుకు రైల్వే ప్రాజెక్టులకు సోమవారం ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటిలో 27 రాష్ట్రాల పరిధిలో 554 అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పునరభివృద్ధి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌బ్రిడ్జి పనులున్నాయి. తెలంగాణలో రూ.230 కోట్లతో 15 అమృత్ భారత్ స్టేషన్లు, రూ.169 కోట్లతో 17 రైల్ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లకు మోదీ భూమి పూజ చేశారు. రూ.221 కోట్లతో పూర్తయిన 3 రైల్ ఫ్లై ఓవర్, 29 రైల్ అండర్ పాస్‌లను జాతికి అంకితం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైల్వే శాఖ రాజకీయ క్రీడలకు వేదికగా కునారిల్లిందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. తమ పాలనలో పదేళ్లుగా ఆధునికతను అందిపుచ్చుకుని దూసుకుపోతోందన్నారు. ''కొన్నేళ్లుగా భారత్ అన్ని రంగాల్లోనూ శరవేగంగా ప్రగతి సాధిస్తోంది. పన్నుల రూపేణా ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయినీ వారి సంక్షేమానికే వెచ్చిస్తున్నాం. గత కొద్ది రోజుల్లో దేశవ్యాప్తంగా పలు ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్‌లను ప్రారంభించా'' అని చెప్పారు.

టెక్స్‌టైల్ రంగ ప్రగతికి సాయం

టెక్స్‌టైల్ రంగానికి కేంద్రం అన్నివిధాలా మద్దతుగా నిలుస్తుందని మోదీ చెప్పారు. ''దేశాభివృద్ధిలో ఆ రంగానిది కీలక పాత్ర వికసిత భారత లక్ష్యసాధనలో టెక్స్‌టైల్ రంగం పాత్రను మరింతగా పెంచేందుకు కృషి చేస్తున్నాం'' అన్నారు. భారత్ టెక్స్–2024ను మోదీ ప్రారంభించారు. ''వికసిత భారతానికి పేదలు, యువత, రైతులు, మహిళలు నాలుగు స్తంభాలు. వారందరికీ టెక్స్‌టైల్ రంగంలో గణనీయమైన పాత్ర ఉంటుంది'' అని ఈ సందర్భంగా అన్నారు. 2014లో రూ.7 లక్షల కోట్లున్న భారత టెక్స్‌టైల్ రంగం విలువ ఇప్పుడు రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. నాలుగు రోజుల భారత్ ఎక్స్‌పోలో 100కు పైగా దేశాల నుంచి 3,500కు పైగా ఎగ్జిబిటర్లు, 3,000 పై చిలుకు కొనుగోలుదారులు, 40 వేల మందికి పైగా వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొంటున్నారు.

ఉపాధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో వివేక్ రామస్వామి టాప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలిస్తే దేశ ఉపాధ్యక్షుడిగా ఎవరు ఉంటారనే దానిపై కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్ (సీపీఏసీ) నిర్వహించిన పోలింగ్‌లో భారతీయ మూలాలున్న వ్యాపారవేత్త వివేక్ రామస్వామి హాట్ ఫేవరెట్‌గా నిలిచారు. సౌత్ డకోటా గవర్నర్, రిపబ్లికన్ నాయకురాలు క్రిస్టీ నోయెమ్, వివేక్ రామస్వామిలకు సమానంగా 15 శాతం ఓట్లు పడ్డాయని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. సీపీఏసీ పోలింగ్‌లో భారతీయ మూలాలున్న మరో నాయకురాలు, అమెరికా పార్లమెంట్‌లో తొలి హిందూ సభ్యురాలు తులసీ గబార్డ్‌కు కేవలం తొమ్మిది శాతం ఓట్లు పడ్డాయి. రాష్ట్రాలవారీగా రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికల్లో నిక్కీ హేలీని వెనక్కినెట్టి ట్రంప్ వరస విజయాలు సాధిస్తుండటంతో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్ పేరు దాదాపు ఖరారైంది. దాంతో ఉపాధ్యక్ష అభ్యర్థి ఎవరనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. అందుకే శనివారం సీపీఏసీ పోల్ నిర్వహించారు.

పేదరికం కనుమరుగవుతోంది

మా సంక్షేమ పాలనే కారణం: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో పేదరికం మటుమాయం అవుతోందని ప్రధాని మోదీ చెప్పారు. గత పదేళ్లలో తలసరి గృహ వినియోగ వ్యయం రెండున్నర రెట్లు పెరగడమే ఇందుకు తార్కాణమన్నారు. ఆదివారం న్యూస్9 గ్లోబల్ సదస్సులో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ''తలసరి వినియోగ పెరుగుదల పట్టణాల కంటే గ్రామాల్లోనే ఎక్కువగా ఉన్నట్టు కూడా సర్వేలో తేలింది. ప్రజలకు ఖర్చు చేసే సామర్థ్యం పెరుగుతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రామాలు, పేదలు, రైతుల సంక్షేమంపై మేమిచ్చిన ప్రాధాన్యమే ఇందుకు కారణం. గ్రామీణ భారతాన్ని దృష్టి పెట్టుకుని పలు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశాం. మహిళల సాధికారత సాధించాం. అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించాం. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని అద్భుతంగా పెంచాం. పాలనతో పాటు దృక్కోణం తదితరాలన్నింట్లోనూ అపారమైన మార్పు తీసుకొచ్చాం'' అని వివరించారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజలను కావాలనే కరువు పరిస్థితుల్లో మగ్గేలా చేశాయంటూ కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు గుప్పించారు. ''ఈ కరువు, సంతుష్టీకరణ రాజకీయాలపై మాకు నమ్మకం లేదు. సంతృప్త పాలనే మా ధ్యేయం. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నాం'' అని వివరించారు. గత పదేళ్లలో ప్రపంచ వేదికపై భారత్ విశ్వసనీయత ఎంతగానో పెరిగిందన్నారు.

సమున్నత శిఖరాలకు సామర్థ్యం: కొన్నేళ్లుగా తమ ప్రభుత్వ పనితీరుకు ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళా రిజర్వేషన్ల బిల్లు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి గీటురాయిగా నిలిచాయని మోదీ చెప్పారు. ''గత పాలకులకు భారతీయుల సామర్థ్యంపై కనీస నమ్మకం కూడా లేదు. వారిని తక్కువగా అంచనా వేశారు'' అంటూ కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పుడెప్పుడో 1960లు, 80ల్లో వారు మొదలు పెట్టిన పలు పథకాలను 2014లో తాము అధికారంలోకి వచ్చాక పూర్తి చేయాల్సి వచ్చిందన్నారు. ''మా పాలనలో దేశవ్యాప్తంగా సగటున రోజుకు రెండు కొత్త కాలేజీలు, వారానికో కొత్త యూనివర్సిటీ వచ్చాయి. అసాధ్యమంటూ ఏదీ లేదన్న విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో తొణికిసలాడుతోంది'' అని మోదీ అన్నారు. చెప్పారు. మూడో టర్మ్ పాలనలో దేశ సామర్థ్యాన్ని సమున్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

జపాన్ మూన్ స్నైపర్ మేల్కొంది!



టోక్యో: ఓ వైజ్ఞానిక విశేషం. అంతకంటే అబ్బురం! గత నెలలో చంద్రుడిపై దిగిన జపాన్ ల్యాండర్ 'మూన్ స్నైపర్' అనూహ్యంగా నిద్ర లేచింది. జాబిలిపై సుదీర్ఘంగా 14 రోజుల పాటు కొనసాగిన రాత్రివేళలో గడ్డకట్టించే మైనస్ 130 డిగ్రీల వాతావరణాన్ని తట్టుకుని మరీ బతికింది! దాంతో జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ (జాక్సా) సంభ్రమాశ్చర్యాలకు లోనైంది. అంతటి చలిని తట్టుకునేలా సామర్థ్యం లేకపోయినా అద్భుతమే చేసిందంటూ హర్షం వెలిబుచ్చింది. ''స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్ (స్లిమ్)గా పిలిచే ఈ ల్యాండర్‌తో ఆదివారం రాత్రి సంబంధాల్ని పునరుద్ధరించాం. మేం పంపిన సందేశానికి ప్రతిస్పందించింది'' అని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మూన్ స్నైపర్ జనవరి 19న చంద్ర మధ్యరేఖకు దక్షిణంగా షియోలీ బిలం వాలులో తలకిందులుగా దిగడం తెలిసిందే. దాంతో దానిపై జాక్సా ఆశలు వదిలేసుకుంది. సౌర ఫలకాలు సూర్యుడికి వ్యతిరేక దిశలో ఉండిపోవటంతో ల్యాండర్‌ను నిద్రాణ స్థితిలోకి పంపారు. సూర్యుడి దిశ మారి ఎండ అందుబాటులోకి రావటంతో ల్యాండర్ సౌరశక్తిని సమకూర్చుకుని పని చేయడం ప్రారంభించింది. చంద్రుడిపై రాత్రి సమీపించడంతో దాన్ని మళ్లీ నిద్రావస్థలోకి పంపారు.

మేమొస్తే 'అగ్నిపథ్' రద్దు: ఖర్గే

యువతకు న్యాయం చేయాలంటూ రాష్ట్రపతికి లేఖ


న్యూఢిల్లీ: తాత్కాలిక ప్రాతిపదికన యువతను సైన్యంలో చేర్చుకునే 'అగ్నిపథ్' పథకాన్ని తాము అధికారంలోకి వస్తే రద్దుచేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ఈ పథకాన్ని ప్రకటించే నాటికే భర్తీ ప్రక్రియలో ఉత్తీర్ణులై నియామక పత్రాల కోసం ఎదురుచూసిన రెండు లక్షల మందికి తక్షణం ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన లేఖ రాశారు. 'సాయుధదళాల్లోకి శాశ్వత ప్రాతిపదికన నియామకాలు ఆగిపోవడంతో లక్షలాది మంది యువత భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. అగ్నివీర్‌లు నాలుగేళ్ల తర్వాత ఉద్యోగాలు కోల్పోయి నడిరోడ్డుపై నిల్చుంటారు. సామాజికంగానూ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటారు'' పేర్కొన్నారు. సైనిక అభ్యర్థుల పోరాటానికి మద్దతుగా ఉంటామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. సైన్యంలో చేరేందుకు యువత కన్న కలలను అగ్నివీర్ పథకంతో బీజేపీ చిదిమేసిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. ''కేంద్రానికి కొంత జీతభత్యాల చెల్లింపులు ఆదా అవుతాయి తప్పితే ఈ పథకంతో ఎవరికి ఎలాంటి ఉపయోగం లేదు'' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్ అభిప్రాయపడ్డారు. అగ్నివీర్ కింద సైన్యంలోకి తీసుకునే యువతలో నాలుగేళ్ల తర్వాత అత్యంత ప్రతిభ కనబరిచిన 25 శాతం మందినే 15 ఏళ్ల శాశ్వత కమిషన్‌లోకి తీసుకుంటామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే.

కోస్ట్ గార్డ్‌లో మహిళల శాశ్వత కమిషన్... మమ్మల్నే అమలు చేయమంటారా?

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో మహిళా ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన (పర్మనెంట్ కమిషన్) నియమించాల్సిందేనని కేంద్రానికి సుప్రీంకోర్టు మరోమారు స్పష్టం చేసింది. తమ ఆదేశాలను అమలు చేయకుంటే తామే ఆ పని చేస్తామని హెచ్చరించింది. అర్హులైన షార్ట్ సర్వీస్ మహిళా ఉద్యోగులకు పర్మినెంట్ కమిషన్ ఇవ్వాలంటూ కోస్ట్ గార్డ్ ఆఫీసర్ ప్రియాంకా త్యాగీ పెట్టుకున్న పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం విచారించింది. ఈ విషయంలో కొన్ని అవరోధాలున్నాయని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి చేసిన వాదనలను తోసిపుచ్చింది. ''త్రివిధ దళాల్లో మహిళా అధికారులను పర్మినెంట్ కమిషన్‌లోకి అనుమతిస్తూ సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు చెప్పింది. అయినా ప్రభుత్వం పితృస్వామ్య వ్యవస్థలా మాట్లాడుతోంది. ఆ పోకడ వదిలేయండి. కోస్ట్ గార్డ్‌లో మహిళల ముఖాలు చూడొద్దనుకుంటున్నారా?'' అంటూ చీవాట్లు పెట్టింది. ''ఏవేవో కారణాలతో ఈ అంశాన్ని ఏడాదంతా సాగదీస్తామంటే కుదరదు. మహిళలకు తక్షణం పర్మినెంట్ కమిషన్ ఇవ్వండి. లేదంటే మేమే ఆ పనిచేస్తాం. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోండి. మాట్లాడితే నారీశక్తి అంటారు. ప్రభుత్వం నిబద్ధత చాటాలి. మహిళా అధికారులకూ సముచిత స్థానం దక్కేలా విధానపరమైన నిర్ణయాలతో రండి'' అని సూచించింది.

పంజాబ్ ప్రావిన్స్ సీఎంగా మరియం




లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ కూతురు, పీఎంఎల్–ఎన్ ఉపాధ్యక్షురాలు అయిన మరియం నవాజ్(50) చరిత్ర సృష్టించారు. రాజకీయంగా ఎంతో కీలకమైన పంజాబ్ ప్రావిన్స్‌కు ముఖ్యమంత్రిగా ఆమె ఎన్నికయ్యారు. పాకిస్తాన్ చరిత్రలో ఒక ప్రావిన్స్‌కు సీఎంగా మహిళ పగ్గాలు చేపట్టడం ఇదే మొట్టమొదటిసారి. పంజాబ్ అసెంబ్లీలో ప్రస్తుతం 327 సీట్లుండగా ముఖ్యమంత్రి అభ్యర్థికి 187 మంది సభ్యుల అవసరం ఉంటుంది. ఇటీవలి ఎన్నికల్లో పీఎంఎల్–ఎన్ 137 సీట్లు గెలుచుకోగా, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పీటీఐకి చెందిన స్వతంత్ర అభ్యర్థులు 113 సీట్లు, ఇతర స్వతంత్రులు 20 సీట్లు సాధించారు. వీరిలో స్వతంత్రులు పీఎంఎల్–ఎన్‌కు మద్దతు పలికారు. శనివారం సీఎం ఎన్నికకు జరిగిన ఓటింగ్‌లో మరియంకు 220 ఓట్లు పడ్డాయి. పీటీఐ స్వతంత్ర అభ్యర్థులు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు.

గజల్ దిగ్గజం పంకజ్ ఉధాస్ కన్నుమూత

ముంబై: 1980, 90వ దశకాల్లో హుషారు పాటలతోపాటు ఎన్నో యుగళ, విషాద గీతాలను తన గాత్రంలో అజరామర పాటలుగా మలచిన ప్రముఖ గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ గొంతు శాశ్వతంగా మూగబోయింది. చిట్ఠీ ఆయీ హై, ఔర్ ఆహిస్తా కీజియే బాతే అంటూ తన గాత్రంతో సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన ఉధాస్ దీర్ఘకాలంగా అనారోగ్యంతో సతమతమవుతూ సోమవారం తుదిశ్వాస విడిచారని ఆయన కూతురు నయాబ్ చెప్పారు. పంకజ్ వయసు 72 సంవత్సరాలు. సోమవారం ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో కన్నుమూసిన పంకజ్ అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. గజల్ ఆల్బమ్స్‌తో పాటు హిందీ సినిమాల్లో నేపథ్య గాయకుడిగా భారతీయ సినీ ప్రేక్షకులకు ఆయన సుపరిచితులు. నామ్, సాజన్, మొహ్రా, దయావన్ వంటి సినిమాల్లో ఆయన పాటలు పాపులరయ్యాయి.

ఎన్నో హిట్స్

గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో సంగీత కుటుంబంలో పంకజ్ జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ దిల్‌రూబా సంగీతవాయిద్యం వాయించడంలో దిట్టం. పంకజ్ ఇద్దరు సోదరులూ గాయకులే. అందుకే ఈయన ఇదే రంగంలో అడుగుపెట్టారు. మొదట్లో తబలా నేర్చుకుని తర్వాత హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంపై మక్కువ పెంచుకుని గాయకునిగా మారారు. 1980లో ఆహట్ ఆల్బమ్‌తో ఆయన తన కెరీర్‌ను మొదలెట్టారు. నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో 50కిపైగా గజల్ ఆల్బమ్స్ విడుదలచేశారు. నా కజ్‌రే కీ ధార్, చాందీ జైసా రంగ్ హై



తేరా సోనే జైసే బాల్, ఆజ్ ఫిర్ తుమ్ పే ప్యార్ ఆయా, చాహత్ దేశ్ సే ఆనే వాలే అంటూ ఎన్నో హిట్స్ ఆయన పాడారు. నేపథ్య గాయకునిగా కొనసాగుతూనే గజల్స్‌తో ఆయన చేసిన కృషికిగాను కేంద్ర ప్రభుత్వం ఆయనకు 2006లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన మృతిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలు రంగాల ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 'చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందర్నీ తన మెలోడీలతో మైమరపించిన అద్భుత గాయకుడు పంకజ్. భారతీయ సంగీతంలో ఒక ఆశాదీపం ఆరిపోయింది. గతంలో ఆయనను ఎన్నోసార్లు కలిశా. ఆయన ఆలపించిన గజల్స్ ప్రతి మదితో నేరుగా సంభాషిస్తాయి. సంగీత ప్రపంచంలో ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేనిది' అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

చాందినీ చౌక్ నుంచి అక్షయ్‌కుమార్ ?



సాక్షి, న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చాందినీ చౌక్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగొచ్చని వార్తలొచ్చాయి. దీనిపై ఇప్పటికే పార్టీ నేతలు అక్షయ్‌ను ఒకసారి సంప్రదించారని జాతీయ మీడియాలో వార్తలు షికార్లు చేస్తున్నాయి. ఢిల్లీలో గతంలో గెలిచిన మొత్తం 7 లోక్‌సభ స్థానాలను తిరిగి ఈసారి కూడా దక్కించుకోవాలని కమలదళం పట్టుదలతో ఉంది. సినిమాల్లోకి రాకముందు గతంలో చాలా సంవత్సరాలు ఢిల్లీ చాందినీ చౌక్ ప్రాంతంలో అక్షయ్‌కుమార్ నివసించారు. అందుకే స్థానికతను దృష్టిలో ఉంచుకుని అక్షయ్‌కుమార్‌ను బరిలోకి దింపితే ఎలా ఉంటుంది అని బీజేపీ లోతైన లెక్కలు వేస్తోందని సమాచారం. గడిచిన 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ అన్నిస్థానాలను స్వీప్ చేసింది. ఈ ఏడాది అదే ఊపు కొనసాగించాలని భావిస్తోంది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తులు కుదరడంతో మూడు స్థానాల్లో కాంగ్రెస్, 4 స్థానాల్లో ఆప్ బరిలో దిగాలని నిర్ణయించుకున్నాయి. దీంతో ఈ ఏడు స్థానాల్లో త్రిముఖపోరు కాస్తా ద్విముఖ పోరుగా మారింది. దీంతో అభ్యర్థిని మరింత ఆచితూచి ఎంపికచేయాలని బీజేపీ భావిస్తోంది.



సోమవారం ముంబైలోని విధాన్ భవన్‌లో రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలి రోజు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, కాంగ్రెస్ ఎమ్మెల్యే నానా పటోలే



దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూశారు. గతంలో ఖజానా–ఎ ఫెస్టివల్ ఆఫ్ గజల్స్ ప్రకటన సందర్భంగా పంకజ్



సోమవారం ముంబైలో 'పులిని రక్షించండి' ప్రచార కార్యక్రమంలో మిస్ వరల్డ్–2023 కరోలినా బిలావ్స్కా, ఇతరులకు పులి ప్రతిరూపాన్ని బహూకరిస్తున్న మహారాష్ట్ర మంత్రి సుధీర్ ముంగంటివార్

క్లుప్తంగా...

ఆస్పత్రి నుంచి మహేశ్ గైక్వాడ్ డిశ్చార్జ్



సాక్షి, ముంబై: థానే జిల్లా ఉల్లాస్‌నగర్‌లోని హిల్‌లైన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కాల్పుల్లో తీవ్ర గాయాలైన శివసేన (శిందే) స్థానిక నాయకుడు మహేశ్ గైక్వాడ్ ఎట్టకేలకు సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. థానేలోని జూపిటర్ ఆసుపత్రిలో 24 రోజులపాటు చికిత్స పొందిన ఆయన డిశ్చార్జ్ కావడంతో ఆయన కుటుంబీకులతో పాటు స్థానిక శివసేన కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ గైక్వాడ్ విలేకరులతో మాట్లాడుతూ ఇలంటి సంఘటన ఎవరికీ జరగొద్దని, ఇలాంటి ఘటనలకు ఎవరూ పాల్పడకుండా ఉండేందుకు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎంపీ శ్రీకాంత్ శిందేలు ఆసుపత్రిలో ఉన్న సమయంలో తనకు, తన కుటుంబానికి అండగా ఉండి ధైర్యాన్నిచ్చారని వారికి ధన్యవాదాలు తెలిపారు. అధికారంలో ఉన్న శివసేన (శిందే వర్గం) స్థానిక నాయకుడైన మహేశ్ గైక్వాడ్‌పై ఉల్లాస్‌నగర్‌లోని పోలీసు స్టేషన్‌లో బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ కాల్పులు జరుపగా ఈ సంఘటనకు సంబంధించి ఆయనతో పాటు మొత్తం 15 మందిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ నిందితులందరూ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది భవనంలో అగ్నిప్రమాదం

ముంబై: దక్షిణ ముంబైలోని మహారాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆసుపత్రి సిబ్బంది నివాసం ఉండే ఎత్తైన నివాస భవనంలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈమేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. ఈ మంటల్లో ఎవరూ గాయపడలేదని, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. అధికారి తెలిపిన వివరాల ప్రకారం, ముంబై పోలీస్ కమిషనరేట్‌కు సమీపంలో ఉన్న జీటీ హాస్పిటల్‌లోని స్టాఫ్ క్వార్టర్స్ భవనంలోని 14వ అంతస్తులోని ఫ్లాట్‌లో రాత్రి 8.45 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందితో పాటు నాలుగు ఫైరింజన్లు, ఇతర వాహనాలు మంటలను ఆర్పారని అధికారులు వెల్లడించారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణోత్సవాలు





సతీసమేతంగా శ్రీ శ్రీనివాస కల్యాణోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకాంత్ శిందే. హాజరైన భక్తులు

హాజరైన సీఎం ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్

సాక్షి, ముంబై: డోంబివలిలో శ్రీ శ్రీనివాస కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), డాక్టర్ శ్రీకాంత్ శిందే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డోంబివలి ప్రీమియర్ కంపెనీ మైదానంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కల్యాణోత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ కల్యాణోత్సవాలకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎంపీ శ్రీకాంత్ శిందేతో పాటు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ఉత్సవం ద్వారా తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లలేని భక్తులకు తమ ప్రాంతంలోనే దేవున్ని దర్శించుకునేందుకు వీలు కలిగిందని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే తెలిపారు. మరోవైపు కల్యాణ్ నియోజకవర్గంలోని భక్తుల కోసం ఈ శ్రీ శ్రీనివాస కల్యాణోత్సవాలు నిర్వహించినట్లు శ్రీకాంత్ శిందే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి నుంచి ప్రత్యేకంగా వచ్చిన అర్చక బృందం ఈ శ్రీనివాస కల్యాణోత్సవాలు నిర్వహించింది. ఇందుకు డోంబివలిలోని శ్రీ బాలాజీ ఆలయంతోపాటు థానేలోని వర్కారీ సంప్రదాయ మండలి సహకరించింది. ఈ సందర్భంగా వివిధ భజనలు అన్నమయ్య కీర్తనలను ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. కనుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తుల శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి పది గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులతోపాటు తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అఖిల పద్మశాలీ సమాజం రక్తదాన శిబిరం

సాక్షి, ముంబై: ముంబై కామాటిపురలోని అఖిల పద్మశాలీ సమాజం ట్రస్ట్‌కు 100 ఏళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కామాటిపురలోని సమాజం హాల్‌లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ రక్తదాన శిబిరంలో అనేక మంది రక్తదానం చేశారు. జేజే మహానగర్ బ్లడ్‌బ్యాంక్ సంస్థ సహకారంతో సమాజం ఆరోగ్య సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది వరకు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అమీన్ పటేల్, కార్పొరేటర్ జావేద్ జునేజాలతోపాటు అనేక మంది హాజరై రక్తం అందించే దాతలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన అందరికీ చిరుకానుకలు, పత్రాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దొంతుల బాలనర్సయ్య, ఉపాధ్యక్షుడు దోమల కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురళి లావుశెట్టి, మేనేజింగ్ ట్రస్టీ చైర్మన్ బాదాసు చంద్రకాంత్, మెనేజింగ్ ట్రస్టీ పబ్బ రమేశ్, కోశాధికారి చెన్న విఠల్, చుక్కపురం రాజు, వన్నెలదాస్ శ్రీనివాస్, గుడ్ల విజయ్, గుడ్ల వివేక్, తుమ్మ సునీల్, రాహుల్, యతురాజుల గంగాధర్, యార వెంకట్, శ్రీహరి, మామిడి బాలయ్య, మ్యాకల వెంకట్, జోరిగల్ వజ్రేశ్, తాటిపాముల శ్రీహరి, మామిడి సరోజ, లావుశెట్టి ఉమ, లక్కబత్తిని స్నేహలత, సంగీత నాందల్, విశ్వనాథ్ కుడిక్యాల్, తాళ్ల సుదర్శన్, పాల్గొన్నారు.



నేటి నుంచి శ్రీకన్యకాపరమేశ్వరి కుంభాభిషేకం

29వ తేదీ వరకు నిర్వహణ

సాక్షి, ముంబై: ముంబై మాటుంగాలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం నుంచి తృతీయ కుంభాభిషేకం ప్రారంభం కానుంది. 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజులపాటు జరగనున్న ఈ కుంభాభిషేకం ఉత్సవాలకు హల్దీపూర్ శ్రీవైశ్య గురుమఠం పీఠాధిపతి శ్రీశ్రీ వామనాశ్రం స్వామిజీ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా మాటుంగాలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. మొదటి రోజు మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యావచనంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు, పూజలు జరగనున్నాయి. అలాగే మధ్యాహ్నం అఖండ జ్యోతి స్థాపన, గ్రహణ పూజ, హారతితోపాటు మహాప్రసాదం, సాయంత్రం అంకురార్పణంతోపాటు హోమం, మళ్లీ హారతి అనంతరం మహాప్రసాదం అందించనున్నారు. ఇలా మూడు రోజుల పాటు జరగనున్న ఈ కుంభాభిషేకం ఉత్సవాలలో చివరి రోజు కుంభాభిషేకం పూజలను వామనాశ్రం స్వామిజీ నిర్వహించనున్నారు. అనంతరం గురుదర్శనంతోపాటు అన్నదానం ఇతర పూజలు జరగనున్నాయి. రాత్రి స్వామిజీ చేతులమీదుగా లక్ష పుష్పార్చన, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవీమాత రథయాత్ర, హారతి, మహాప్రసాదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బొంబాయి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కేవీ రమేశ్‌చెట్టి, ప్రధాన కార్యదర్శి పాన్నూరి ప్రభాత్ ఒక ప్రకటనలో తెలిపారు.



మనోజ్ జరాంగేపై కేసు నమోదు

- రాష్ట్రవ్యాప్తంగా 1,041 మందిపై కేసులు
- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కొన్ని రోజులుగా రాష్ట్రప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్న మనోజ్
- రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు
- ఎంఎస్‌ఆర్టీసీ బస్సుకు నిప్పంటించిన ఆందోళనకారులు



సాక్షి, ముంబై: మరాఠా రిజర్వేషన్ కోసం ఆందోళన చేపట్టిన మనోజ్ జరాంగే పాటిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,041 మందిపై కేసులు నమోదు చేయగా.. అయిదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా మనోజ్ జరాంగే ప్రభుత్వంపై ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌పై తీవ్రమైన పదజాలంతో ఆరోపణలు చేయడంతోపాటు ఏకవచనంతో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాంతియుతంగా ఉన్న ప్రభుత్వం యాక్షన్ మోడ్‌లోకి దిగింది. దీంతో పోలీసులను రంగంలోకి దింపింది. అందిన వివరాల మేరకు జరాంగే పాటిల్‌తోపాటు రాష్ట్రంలోని 1,041 మందిపై కేసులు నమోదు చేసి ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం తొలిసారిగా బీడ్ జిల్లాలోని శిరూర్, అమల్‌నేర్‌లో మనోజ్ జరాంగే పాటిల్‌పై కేసు నమోదైంది. 1,041 కేసులలో మరాఠ్వాడాలో అత్యధికంగా 425 కేసులు నమోదయ్యాయి. మనోజ్ జరాంగేపాటిల్ సన్నిహితులైన శ్రీరామ్ కురాన్కర్, శైలేశ్ పవార్, బాలాసాహెబ్ ఇంగలేలతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్రంలో ఉద్రిక్తత

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్తమైన వాతావరణం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో ఆందోళనలు హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జల్నా జిల్లా అంబడ్ తాలూకాలో కర్ఫ్యూ విధించారు. అదేవిధంగా మరాఠ్వాడాలోని మూడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. ఛత్రపతి సంభాజీనగర్, జల్నా, బీడ్ జిల్లాల్లో సుమారు 10 గంటలపాటు ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసిన అనంతరం సోమవారం సాయంత్రం నాలుగు గంటలవరకు మళ్లీ ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించారు.

బస్సులు బంద్

జల్నా జిల్లా మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎంఎస్‌ఆర్టీసీ) బస్సుకు నిప్పంటించారు. దీంతో జల్నా జిల్లాతోపాటు ఛత్రపతి సంభాజీనగర్‌లో పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ ఆందోళన నేపథ్యంలో ఎంఎస్‌ఆర్టీసీ జల్నా, ఛత్రపతి సంభాజీ నగర్ జిల్లాలో కొంతసమయంపాటు బస్సు సేవలను నిలిపివేశారు.



సోమవారం ముంబైలో 22వ జీ సినీ అవార్డ్స్ ట్రోఫీని ఆవిష్కరించిన సందర్భంగా ఫొటోలకు పోజులిస్తున్న నటి ఆలియా భట్

హాకర్లను ఎందుకు తొలగించడం లేదు?

- బీఎంసీని ప్రశ్నించిన బాంబే హైకోర్టు
- బాటసారులు నడిచేందుకు ఇబ్బందిగా ఉంది
- ఎన్నో దశాబ్దాల సమస్యను బీఎంసీ ఎందుకు పరిష్కరించలేకపోతోందంటూ అసహనం
- పన్నులు వసూలు చేస్తున్న బీఎంసీనే మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం



దాదర్: ముంబైలో అక్రమ హాకర్ల కారణంగా బాటసారులకు నడిచేందుకు ఫుట్ పాత్ లేకుండా పోతోంది. గత్యంతరం లేక ముంబైకర్లకు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ నేపథ్యంలో హాకర్లకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదంటూ బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)ని బాంబే హైకోర్టు మందలించింది. అనేక దశాబ్దాలుగా ముంబైకర్లను పట్టిపీడిస్తున్న అక్రమ హాకర్ల బెడదపై ఇటీవల న్యాయమూర్తులు గౌతం పటేల్, కమల్ ఖథా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా న్యాయమూర్తుల బెంచీ బీఎంసీకి పలు నిర్దేశాలు జారీచేసింది. 'ముంబైకర్ల నుంచి బీఎంసీ వివిధ పన్నులు వసూలు చేస్తుంది. దీంతో వారికి వివిధ మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత బీఎంసీపై ఉంది. ముంబైలో ప్రధాన రోడ్లు మొదలుకుని చిన్నాచితక గల్లీలో ఇలా ఎక్కడ చూసినా అక్రమంగా తిష్టవేసిన హాకర్లు దర్శనమిస్తున్నారు. నగర పౌరులకు నడిచేందుకు చోటు లేదు. గత్యంతరంలేక వారిని రోడ్డుపై నడిచేలా మీరే చేస్తున్నారు' అని బీఎంసీపై మండిపడింది.

ఎక్కడ చూసినా అక్రమ వ్యాపారులే..

బీఎంసీ వ్యాపారుల కోసం ప్రత్యేకంగా హాకర్స్ జోన్ కేటాయిస్తుంది. అక్కడ వ్యాపారం చేయడానికి లైసెన్స్ జారీ చేస్తుంది. అయినప్పటికీ వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై ఎందుకు తిష్టవేస్తున్నారు? బీఎంసీ అధికారులు, సిబ్బంది దాడిచేసి అక్రమ వ్యాపారుల సామగ్రి జప్తు చేస్తున్నారు. జరిమానా చెల్లించి మళ్లీ ఆ సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఇలాంటి వ్యాపారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. వారి సమస్యలు పరిష్కరించేందుకు బీఎంసీ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎందుకు కనుగొనడం లేదని ప్రశ్నించింది. ముంబై మొదలుకుని ఉప నగరాల్లో ఎక్కడ చూసినా అక్రమ వ్యాపారులు తిష్టవేసిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారం మొదలుకుని ప్రధాన రహదారుల వరకు మొబైల్ ఫోన్ కవర్లు, ఇయర్ ఫోన్లు, బూట్లు, చెప్పులు, దుస్తులు, సాక్స్, బెల్టులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కూరగాయలు, పండ్లు, ఫలాలు, నిమ్మకాయ షర్బత్, ఇతర శీతల పానీయాలు విక్రయించే హాకర్లు విచ్చల విడిగా కన్పిస్తున్నారు. షాపుల ఎదురుగా అక్రమ వ్యాపారులు తిష్ట వేయడంవల్ల వారు కూడా నష్టపోతున్నారు. క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్న వ్యాపారులు నష్టపోతున్నారు. అక్రమ వ్యాపారులు లాభాలు గడిస్తున్నారు. అక్రమ వ్యాపారుల వల్ల నడిచేందుకు చోటులేక జనాలు రోడ్లపైకి వస్తున్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే అందుకు బాధ్యులెవరని బీఎంసీని నిలదీసింది. ఈ పరిస్థితి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోర్టు స్పష్టం చేసింది.

దాదర్ ప్రాంత ప్రజల వెతలు.............

నగరం సహా, తూర్పు, పశ్చిమ ఉప నగరాలలోని వివిధ ప్రాంతాలతో పోలిస్తే దాదర్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దాదర్ ప్రాంతం నగరం నడిబొడ్డున ఉంది. ఎంతో మంది బీఎంసీ, పోలీసు కమిషనర్లుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కానీ ఇంతవరకు దాదర్ పరిసరాలను హాకర్ల నుంచి విముక్తి కల్పించలేక పోయారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న దాదర్ రైల్వే స్టేషన్‌కు ఆనుకుని అనేక చిన్నాచితక రోడ్లు, గల్లీలు ఉన్నాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ ప్రాంతాలన్నీ అక్రమ హాకర్లు, కొనుగోలు దార్లతో కిటకిటలాడుతుంటాయి. ముఖ్యంగా దాదర్ ప్రాంతంలో హోల్‌సేల్ కూరగాయలు, పూల మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ పశ్చిమ, సెంట్రల్ రైల్వే మార్గాలు కలుస్తాయి. దీంతో దాదర్ స్టేషన్‌కు అందరూ సులభంగా చేరుకుంటారు. రెండు రైల్వే మార్గాల కనెక్టివిటీ ఇక్కడే కావడంతో తెల్లవారుజామున నుంచి అర్ధరాత్రి వరకు ఈ ప్రాంతమంతా ప్రయాణికులు, వ్యాపారులతో కిటకిటలాడుతుంది. అంతేగాకుండా ఇక్కడ దూరప్రాంతాల ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ఫాస్ట్ లోకల్ రైళ్లు కూడా ఆగుతాయి. ఇక్కడ దొరకని వస్తువంటూ ఏదీ లేదు. మహాశివరాత్రి, ఉగాది, దసరా, శ్రీకృష్ణ జన్మాష్టమి, నవరాత్రులు, గణేశోత్సవాలు, దసరా, దీపావళి తదితర పండుగలు, ఉత్సవాలు వచ్చాయంటే ఇసుకపోస్తే రాలనంత జనాలుంటారు. అత్యవసర సమయంలో ఈ ప్రాంతానికి అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు కూడా సునాయాసంగా చేరుకోలేని పరిస్థితి ఉందంటే ఇక్కడ ఏ స్థాయిలో హాకర్లు తిష్టవేశారో ఇట్టే అర్థమవుతోంది. దాదర్ పరిసరాల్లో ఉంటున్న స్థానికుల ఇళ్లకు బంధువులు కూడా రావడానికి వెనకడుగు వేస్తున్నారు. భవనాల దరిదాపులకు ట్యాక్సీ లు, బెస్ట్ బస్సులు రావు. సొంత వాహనాల్లో వస్తే పార్కింగ్‌కు స్థలం దొరకదు. కనీసం బైక్ తీసుకెళ్లడానికి కూడా చోటుండదు. ఎక్కడ చూసినా హాకర్లే దర్శనమిస్తారు. దీంతో తమ ఇళ్లకు స్నేహితులు, దగ్గరి, దూరపు బంధువులు రావడమే మానేశారని స్థానికులు వాపోతుంటారు. ఎవరైనా చనిపోతే బంధువులు నేరుగా శ్మశానవాటికకే వస్తున్నారే తప్ప ఇంటికి రావడం లేదు. దీన్ని బట్టి దాదర్ ప్రాంతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది.

క్లుప్తంగా...

కొనసాగుతున్న మిలాన్ విన్యాసాలు



విశాఖ సిటీ: మిలాన్-2024లో భాగంగా సముద్ర దశ విన్యాసాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం బంగాళా ఖాతంలో సముద్రం నుంచి ఉపరితలంపై ఉన్న శత్రు స్థావరాలు, గగనతలంలో వైమానిక లక్ష్యాలను సమర్థవంతంగా ఛేదించే విన్యాసాలు చేపట్టారు. అలాగే జలాంతర్గాముల వ్యూహాలను తిప్పికొట్టడం, క్రాస్-డెక్ ల్యాండింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహించారు. మంగళవారంతో సీ-ఫేజ్ విన్యాసాలు ముగియనున్నాయి.

ట్రైకార్ చైర్మన్‌గా గుండా సురేంద్ర నియామకం



సాక్షి,అమరావతి: ఏపీ షెడ్యూల్డ్ తెగల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్)సంస్థ చైర్మన్‌గా గుండా సురేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్ర వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఎలక్షన్ స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారు.

సాంప్రదాయ హస్తకళలకు ప్రోత్సాహం

- చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత
- 'భారత్ టెక్స్ 2024' ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఏపీ పెవిలియన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని హస్తకళల వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ, సాంప్రదాయ కళాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత తెలిపారు. సోమవారం ఢిల్లీలో దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ వస్త్ర ప్రదర్శన 'భారత్ టెక్స్ 2024'లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గొప్ప వారసత్వం, శక్తివంతమైన వస్త్ర పరిశ్రమకు నిలయంగా ఉందన్నారు. ప్రతి జిల్లా నుంచి ప్రత్యేకమైన చేనేత, హస్తకళలను పెవిలియన్‌లో ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీ వస్త్ర ఉత్పత్తిలోనే కాకుండా వ్యాపారం, పెట్టుబడికి ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందన్నారు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్, ఆప్కో ఎండీ పవనమూర్తి, లేపాక్షి ఈడీ విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను కేంద్ర ప్రభుత్వం, భారత టెక్స్‌టైల్ రంగం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయి.

బాబు లీల.. కేడర్ గోల

టీడీపీలో ఎవరిని ఎక్కడి నుంచి పోటీ చేయిస్తున్నారో తెలియక గందరగోళం



సాక్షి, అమరావతి: అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు చేస్తున్న హడావుడితో తెలుగుదేశం పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. తమ నియోజకవర్గానికి అభ్యర్థిగా రోజుకో నేత పేరు.. అదీ సంబంధం లేని ప్రాంతాలకు చెందిన వారి పేర్లు వస్తుండటంతో కేడర్ నిర్ఘాంతపోతున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడిగా 99 మంది అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో ఇప్పటికే పలుచోట్ల ఆందోళనలు జరుగుతున్నాయి. మిగిలిన సీట్లలో అభ్యర్థులను ఖరారు చేసేందుకు చంద్రబాబు చేస్తున్న కసరత్తు కేడర్‌ను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఎవరిని ఎక్కడి నుంచి బరిలోకి దింపుతారో, ఎందుకు అలా చేస్తున్నారో అర్థంకాక పార్టీ నేతలు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఐవీఆర్ఎస్ సర్వే అంటూ కేడర్‌కు వారి నియోజకవర్గానికి సంబంధం లేని కొత్త వ్యక్తుల పేర్లు చెప్పి వారు ఆ స్థానంలో పోటీ చేస్తే గెలుస్తారో లేదో చెప్పండని నిలదీస్తుండటంతో ఏమి చేయాలో కార్యకర్తలకు పాలుపోవడం లేదు.

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో మైలవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ సీటును వసంత కృష్ణప్రసాద్‌కి ఖరారు చేయడంతో ఉమా పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పెనమలూరుకు సిద్ధంగా ఉండాలని ఉమాకు చంద్రబాబు సూచించారు. పెనమలూరులో అభ్యర్థి ఉమా అయితే సమ్మతమేనా అని ఫోన్లు వస్తుండడంతో కేడర్ తెల్లబోతోంది. ఉన్నట్టుండి ఉమాను ఇక్కడకు దిగుమతి చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్ తనకు కాకుండా మరొకరికి సీటు ఇస్తే తాను చేతగానివాడిలా చూస్తూ ఊరుకోనంటూ బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. దేవినేని ఉమా కూడా పెనమలూరులో కొందరు టీడీపీ నాయకులకు ఫోన్లు చేసి అక్కడి పరిస్థితి ఎలా ఉంటుందని ఆరా తీస్తుండటంతో ఇదేమి పరిస్థితంటూ స్థానిక నేతలు జుట్టు పీక్కుంటున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావును నిన్నటి వరకు చంద్రబాబు గాల్లో పెట్టారు. మొదటి జాబితాలో ఆయన పేరు గల్లంతైంది. ఇప్పుడు ఆయన్ని గురజాల నుంచి నర్సరావుపేటకు మార్చాలనే ఆలోచన చేస్తున్నారు. నర్సరావుపేట టీడీపీ అభ్యర్థిగా యరపతినేని అయితే ఎలా ఉంటుందోనని ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్నారు. దీంతో అక్కడి ఇన్‌ఛార్జి చదలవాడ అరవింద్‌బాబు వర్గం లబోదిబోమంటోంది. మరోవైపు గురజాలలో వలస వచ్చిన నేత జంగా కృష్ణమూర్తి అభ్యర్థిత్వంపై సర్వే చేస్తున్నారు. గురజాలలో తనను కాదని ఉన్నట్టుండి జంగాను తేవడంతో యరపతినేని కారాలు మిరియాలు నూరుతున్నారు.

విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును అయితే ఏకంగా జిల్లా దాటించే ప్రయత్నం చేస్తుండడంతో ఉత్తరాంధ్ర టీడీపీ ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది. ఆయన్ని విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని ఒత్తిడి తేవడం, ఆయన నిరాకరిస్తుండటం గందరగోళానికి దారితీసింది.

విజయవాడ పశ్చిమ సీటు కోసం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారు. మరోవైపు ఆ సీటు తమదేనని జనసేన హడావుడి చేస్తోంది. ఈ మూడు శిబిరాలు నివ్వెరపోయేలా కొత్తగా ఎంకే బేగ్‌ను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఆయన అభ్యర్థిత్వంపై ఐవీఆర్ఎస్ సర్వే చేస్తుండటంతో స్థానిక నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు.

సహకార కార్యాలయాల ఆధునికీకరణ

రూ.283.53 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సహకార రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకుల ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కంప్యూటరీకరణతోపాటు డిజిటల్ పోర్టల్‌ను అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరీకరణ శరవేగంగా జరుగుతోంది. రెండో విడతలో సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయాలు, గ్రామీణాభివృద్ధి బ్యాంకులను ఆధునికీకరిస్తారు. ఈ ప్రాజెక్టును రూ.283.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. మూడేళ్ల కాలవ్యవధిలో పూర్తి చేయనున్న ఈ ప్రాజెక్టు కింద అత్యాధునిక కంప్యూటర్ల కోసం రూ.201.60 కోట్లు వెచ్చిస్తారు. సాఫ్ట్‌వేర్ మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్ కోసం రూ.30లక్షలు, ఎంఎఫ్‌పీ కోసం రూ.27.60 లక్షలు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.15.90 లక్షలు, యూపీఎస్‌ల కోసం మరో రూ.8.40 లక్షలు ఖర్చు చేయనున్నారు. కాంపోనెంట్ నిధుల బదిలీ కోసం ఇప్పటికే రెండు ఖాతాలను తెరిచారు. 100 శాతం కేంద్ర వాటా ఉన్న సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ కోసం ఒకటి, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వ్యాపార లావాదేవీల కోసం మరొక ఖాతాలను రెడీ చేశారు.

వేగంగా పీఏసీఎస్ కంప్యూటరైజేషన్

రాష్ట్రంలోని 2,037 పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ కోసం ఆప్కాబ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. రూ.79.72 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కింద హార్డ్‌వేర్, డిజిటలైజేషన్, సిస్టమ్స్ పోర్ట్ కాంపోనెంట్లకు రూ.62.96కోట్లు ఖర్చు చేయనుంది. ఇప్పటికే ప్రాజెక్టు అమలు కోసం ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసింది. హార్డ్‌వేర్ సేకరణ జరుగుతోంది. సిస్టమ్ ఇంటిగ్రేషన్ కార్యకలాపాలను చేపట్టేందుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టు అమలు కోసం రాష్ట్ర స్థాయిలో ఎస్‌పీఎంయూ, జిల్లా స్థాయిలో డీపీఎంయూ, పీఏసీఎస్ స్థాయిలో మైగ్రేషన్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఆస్టిన్ తెలుగు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పరమేశ్వరరెడ్డి

సాక్షి, అమరావతి: అమెరికాలోని ఆస్టిన్ నగరంలో ఆస్టిన్ తెలుగు కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం- 2024 ఏర్పాటైంది. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉన్న ప్రవాసాంధ్రులు సోమవారం అక్కడి ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా పరమేశ్వరరెడ్డి నంగి, ఉపాధ్యక్షుడిగా శ్రీని బైరపనేని, కార్యదర్శిగా భరత్ పిస్సాయ్, ట్రెజరర్‌గా చిన్నపరెడ్డి కుందూరును ఎన్నుకున్నారు. ప్రతిభ నల్ల (కల్చరల్), లక్ష్మీకాంత్ (ఫైనాన్స్ స్పాన్సర్షిప్), వెంకటేష్ దూబాల (ఫుడ్ లాజిస్టిక్స్), శ్రీలత అంబటి (మెంబర్షిప్ టెక్నాలజీ), సర్వేశ్వరరెడ్డి పాశం (స్పోర్ట్స్) సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా అర్జున్ అనంతుల, గిరి మేకల, బ్రహ్మేంద్రరెడ్డి లాక్కును ఎన్నుకున్నారు. గత కార్యవర్గంలో సేవలందించిన రామ్ హనుమంతు మల్లిరెడ్డి, మురళీధర్ రెడ్డి వేలూరు, శ్రీనివాస్ బత్తుల ఇతర టీసీఏ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.

నేటి నుంచి ఐబీ బృందం పర్యటన

- విజయవాడకు చేరుకున్న ఏడుగురు సభ్యులు
- మార్చి 7 వరకు జిల్లాల్లో పర్యటించనున్న బృందం
- ప్రభుత్వ స్కూళ్లు.. వాటిలోని సదుపాయాలపై అధ్యయనం
- ఆ నివేదిక ఆధారంగా సిబ్బందికి 'ఐబీ' శిక్షణ
- 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియట్(ఐబీ) సిలబస్ అమలు కోసం విద్యా శాఖ వేగం పెంచింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు.. వాటిలోని సదుపాయాలపై అధ్యయనం చేసేందుకు ఐబీ నుంచి ఏడుగురు సభ్యుల బృందం సోమవారం విజయవాడకు చేరుకుంది. ఈ బృందంలో కరిక్యులం డిజైన్ సీనియర్ మేనేజర్ ఆల్డో(మెక్సికో), ఈక్విటీ అండ్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ సీనియర్ మేనేజర్ కళా పరశురామ్, పర్సనల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ ఎరిక్ బాబర్(ఇంగ్లండ్), కరిక్యులం స్పెషలిస్ట్ అలెన్ (ఇంగ్లండ్), అసెస్‌మెంట్ ఆపరేషన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ అసోసియేట్ మేనేజర్ మైఖేల్ డోనోవన్ (ఇంగ్లండ్), పోస్ట్ ఆథరైజేషన్ పాలసీ అండ్ డిజైన్ సీనియర్ మేనేజర్ వెండీ గ్రీన్(అమెరికా), సీనియర్ లెర్నింగ్ ఆర్కిటెక్ట్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ డెలివరీ జెన్ ఫ్లెజికోచ్ (అమెరికా) ఉన్నారు. వీరంతా మూడు బృందాలుగా ఏర్పడి మంగళవారం నుంచి మార్చి 7 వరకు జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా, మండల, మున్సిపల్ స్కూళ్లతో పాటు అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలను పరిశీలిస్తారు. అక్కడి పరిస్థితులు, వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాలను అంచనా వేస్తారు. అనంతరం నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఐబీ విభాగానికి అందజేస్తారు. సోమవారం విజయవాడకు చేరుకున్న ఐబీ బృందంతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి సమావేశమయ్యారు. టీచర్ ట్రైనింగ్, అసెస్మెంట్లు, విద్యా సంబంధిత అంశాలను ఆయన ఐబీ బృందానికి వివరించారు. అధ్యయనం అనంతరం అంతర్జాతీయ ప్రతినిధులిచ్చే నివేదిక ఆధారంగా విద్యా శాఖ సిబ్బందికి ఐబీ అమలుపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయులు, మండల, జిల్లా విద్యాధికారులు, ఎస్సీఈఆర్టీ, డైట్ సిబ్బంది, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డు సిబ్బందికి దశలవారీగా 'ఐబీ'పై అవగాహన, నైపుణ్యం, సామర్థ్యం పెంపుపై శిక్షణ ఇస్తారు. వీరందరికీ సర్టిఫికెట్లు జారీ చేసి ప్రతిష్టాత్మక ఐబీ గ్లోబల్ టీచర్ నెట్‌వర్క్‌లో భాగం చేస్తారు. అనంతరం 2025-26 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్‌లో బోధన ప్రారంభమవుతుంది. ఏటా ఒక తరగతి చొప్పున పెంచుతూ 2035 నాటికి విద్యార్థులు పదో తరగతి, 2037లో ప్లస్2లో ఐబీ సిలబస్‌లో పరీక్షలు రాసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ విద్యార్థులకు ఐబీ, ఏపీ ఎస్సీఈఆర్టీ కలిసి జాయింట్ సర్టిఫికేషన్ ఇస్తాయి. ఈ సర్టిఫికెట్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంటుంది.

సుందర రైల్వేస్టేషన్లు

- రాష్ట్రంలో పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, పలువురు ప్రజాప్రతినిధులు



సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జీవీఎల్ నరసింహం తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ)/గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయవాడ డివిజన్‌లోని గుణదల, వాల్తేరు డివిజన్‌లోని 12 రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విజయవాడలోని గుణదలలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రైల్వే స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. తన నియోజకవర్గ పరిధిలో రామవరప్పాడు, గుణదల స్టేషన్‌లకు రూ.40 కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. రైల్వేల అభివృద్ధికి ప్రధాని మోదీ అధిక ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైల్వేలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందులో ఆంధ్రప్రదేశ్ టాప్‌లో నిలవడం సంతోషించదగ్గ విషయమన్నారు. అలాగే సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.443.47 కోట్లతో వాల్తేరు డివిజన్‌లో ఏపీ పరిధిలో ఉన్న సింహాచలం, అరకు, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, నౌపాడ స్టేషన్లతో పాటు ఒడిశా పరిధిలో పర్లాకిమిడి, జైపూర్, రాయగడ, కోరాపుట్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.218.13 కోట్లతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 4 రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, రైల్వే పురోగతిపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహం, ఎమ్మెల్యే గణబాబు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూటికుప్పల సూర్యారావు, బీజేపీ నాయకుడు విష్ణుకుమార్ రాజు, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పొత్తుకు కాపులు వ్యతిరేకం

- పవన్‌కు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నా.. ఎంత డబ్బు కావాలి?
- మీడియాతో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తును కాపులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. ఆశీలమెట్ట లోని ఓ ఫంక్షన్ హాలులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పవన్‌కళ్యాణ్‌కు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నా.. ఎంత డబ్బు కావాలో చెప్పాలని కోరారు. ప్రజాశాంతి పార్టీలో చేరితే అతనిని ముఖ్యమంత్రిని చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ సిద్ధం అంటుంది..టీడీపీ, జనసేన దోచుకోవడానికి సంసిద్ధం అంటున్నాయన్నారు. ప్రధాని మోదీ తిరుపతి సాక్షిగా ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మాట తప్పారని, ప్రత్యేక ప్యాకేజీ, స్మార్ట్ సిటీలు నిర్మాణం చేపడతానని చెప్పి మోసం చేశారని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమయ్యారని అన్నారు. మోదీ పాలనలో ఇతర మతాల ప్రజలకు భద్రత లేదని, పాస్టర్లకు ఆత్మరక్షణ కోసం రైఫిల్ కొనిస్తానని చెప్పారు. మోదీ తొత్తులుగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వంగవీటి రంగాను హత్య చేయించిన చంద్రబాబు చెర నుంచి పవన్ బయటకు రావాలని హితవు పలికారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బ్రీత్ ఎనలైజర్లు పెట్టాలంటూ పిల్

బుధవారం విచారణ జరుపుతామన్న ధర్మాసనం

సాక్షి, అమరావతి: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ జనవాహిని పార్టీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. బ్రీత్ ఎనలైజర్ల ఏర్పాటు ద్వారా మద్యం ప్రభావానికి లోను కాకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుందని, అందువల్ల ఈ దిశగా ఆదేశాలు ఇవ్వాలంటూ ఆ పార్టీ కార్యదర్శి ఎం.శివరామ్ సుందర్ కోరారు. అత్యవసర విచారణ నిమిత్తం పిటిషనర్ తరఫు న్యాయవాది డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబు సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్16 ప్రకారం చిత్త భ్రమణం (అన్‌సౌండ్ మైండ్) ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనర్హులని ఆయన తెలిపారు. పరిమితికి మించి మద్యం సేవించిన వారు చిత్తభ్రమణం కిందకే వస్తారని తెలిపారు. అందువల్ల ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్ ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. మద్యం సేవించిన వారు ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16 పరిధిలోకి ఎలా వస్తారని ప్రశ్నించింది. 18 ఏళ్లు దాటిన వారికి ఓటు హక్కు కల్పిస్తున్నారని గుర్తు చేసింది. నిర్దిష్ట వయసు లేనివారికి మద్యం విక్రయించడంపై నిషేధం ఉందని తెలిపింది. ప్రసాద్‌బాబు సమాధానమిస్తూ.. పరిమితికి మించి వాహనం నడపడం మోటారు వాహనాల చట్టం కింద నేరమని, అలాగే ఓటు ద్వారా రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే అర్హత మద్యం సేవించి ఓటువేసే వారికి ఉండకూడదన్నారు. ప్రసాద్‌బాబు వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

చంద్రబాబు అండ్ కోది తప్పుడు ప్రచారం

మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: తాను చెప్పిన విషయాన్ని వక్రీకరించి చంద్రబాబు అండ్ కో తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. గతంలో కడపకు చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి వచ్చి కళింగ వైశ్యుల భూముల వ్యవహారంలో సెటిల్‌మెంట్ చేస్తుంటే 'నువ్వొచ్చి చేయడమేమిటని, ఇక్కడి నుంచి పొమ్మని చెప్పాను' అని, అదే విషయాన్ని కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో చెప్పానని తెలిపారు. కళింగ వైశ్యులకు తాను అండగా ఉన్నానన్న విషయాన్ని గుర్తు చేశానన్నారు. దీనిని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రతిదీ రాజకీయం చేయడం తప్ప అంతకుమించి టీడీపీ నేతలు సాధించిందేమీ లేదన్నారు. అసలు సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని, అప్పట్లో గట్టిగా చెప్పి పంపించేశానని అన్నారు. జిల్లాకు తాను ఎంత మేలు చేశానో ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. జిల్లాలో ఎక్కడ చూసినా తన మార్కు అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ జిల్లాకు మేలు జరిగింది ఒక్క వైఎస్సార్ ఫ్యామిలీతోనే అని ధర్మాన స్పష్టం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, అంబేడ్కర్ యూనివర్సిటీ, రిమ్స్ మెడికల్ కళాశాల తదితర కీలక ప్రాజెక్టులు వైఎస్ రాజశేఖరరెడ్డి చలవేనన్నారు. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మహేంద్రతనయ ప్రాజెక్టు పనులు ఊపందుకోవడం, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ తదితర అభివృద్ధి పనులెన్నో జరిగాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పనిచేసి జిల్లాకు ఒక్కటంటే ఒక్కటి కూడా మంచి చేయలేదని విమర్శించారు. చేతనైతే జిల్లాలో చంద్రబాబు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు.

ముదిరింది ఎండే కాదు.. ఈనాడు పచ్చ పైత్యం కూడా

రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

- అయినా సరిపడా సరఫరా చేస్తున్న డిస్కంలు
- ఎక్కడా కోతలు లేకుండా ముందస్తు చర్యలు
- ప్రణాళిక ప్రకారం బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు
- లేని ఇబ్బందులు సృష్టించి ఈనాడు తప్పుడు రాతలు



సాక్షి, అమరావతి: ఎండలు మండుతున్నాయో లేదో ఏసీ గదుల్లో కూర్చునే రామోజీకేం తెలుస్తుంది. ఒకసారి కళ్లు తెరిచి రోడ్డు మీదకు వస్తే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. వాతావరణ మార్పుల కారణంగా ఫిబ్రవరి నెలలోనే ఎండలు ముదురుతుండటంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకీ పెరుగుతోంది. అయినప్పటికీ ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా కోతలు లేని నాణ్యమైన విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు అందిస్తున్నాయి. కానీ ఎండ కన్నెరుగని డ్రామోజీ 'ఎండలు ముదరకముందే ఎడా పెడా కోతలు' శీర్షికన ఈనాడులో అడ్డగోలుగా ఓ అబద్ధాన్ని అచ్చేశారు. ఈ అసత్య కథనంపై రాష్ట్ర విద్యుత్ సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. రాష్ట్రంలో ఏదైనా సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల సమయంలో వచ్చే స్వల్ప విద్యుత్ అంతరాయాలను వ్యవసాయ విద్యుత్ కోతలుగా చూపిస్తూ తరచూ కథనాలు ప్రచురించడం ఈనాడు దిగజారుడుతనానికి నిదర్శనమని, ఇలాంటి నీతి మాలిన పాత్రికేయం ఆ పత్రిక పతనానికి నాంది అని దుయ్యబట్టాయి. వాస్తవాలేమిటో వివరించాయి.

ఈనాడు ఆరోపణ: విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయని ప్రకాశం జిల్లాలో ఓ గ్రామం రైతులు, విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని పార్వతీపురం మన్యం జిల్లాలోని ఓ గ్రామం రైతులు ఆందోళన చేశారు.


వాస్తవం: పార్వతీపురం మన్యం జిల్లా యర్రసామంతవలస 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఏర్పడ్డ విద్యుత్ అంతరాయం, ప్రకాశం జిల్లా ఉమా మహేశ్వరపురం 33/11 కేవి సబ్ స్టేషన్, అద్దంకి దగ్గర గుండ్లకమ్మ వంతెన సమీపంలో 33 కేవీ కుంకుపాడు లైన్ మరమ్మతుల వల్ల తలెత్తిన అంతరాయాలను వ్యవసాయ విద్యుత్ కోతలుగా ఈనాడు ప్రచురించింది. అది అవాస్తవం. నిజానికి ఈ రెండు చోట్లా ప్రత్యామ్నాయంగా ఏపీ ట్రాన్స్‌కో హై వోల్టేజ్ సబ్ స్టేషన్ లైన్ల ద్వారా విద్యుత్ అందించడం కూడా జరిగింది. వ్యవసాయ వినియోగదారులకు పగటి పూట విద్యుత్ సరఫరాకు అధికారులు గతంలోనే చర్యలు తీసుకున్నారు. అక్కడక్కడా సమస్యలు తలెత్తినా వెంటనే నివారించేందుకు సబ్‌స్టేషన్, లైన్ల సామర్థ్యం పెంపుదల పనులు జరుగుతున్నాయి. ఇంక ఆందోళన చేయాల్సిన అవసరమేముంది? అదంతా కేవలం రామోజీ మార్కు సృష్టి మాత్రమే.

ఈనాడు ఆరోపణ: రైతులకు పగటిపూట అంతరాయం లేకుండా 9 గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పిన సర్కారు.. వేసవి ఆరంభంలోనే చేతులెత్తేసింది. ముందస్తు ప్రణాళికల్లో విఫలమైంది.

వాస్తవం: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరుగుతోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను విద్యుత్ సంస్థలు అందిస్తున్నాయి. ఇందుకోసం బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికను రూపొందిస్తున్నాయి. రైతులకు పగటిపూట తొమ్మిది గంటల విద్యుత్తును ఎటువంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేస్తున్నాయి. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం ఈ ఏడాది రబీ సీజను నుండి సోలార్ విద్యుత్‌ను వ్యవసాయానికి ప్రత్యేకంగా సరఫరా చేయనున్నాయి. గడిచిన పది రోజుల్లో ప్రజలకు.. ముఖ్యంగా రైతులకు ఏమాత్రం కొరత లేకుండా విద్యుత్ అందిస్తున్నాయి.

ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు గత పది రోజుల్లో విద్యుత్ వినియోగం, సరఫరా, కొనుగోలు, కొరత వివరాలు (మిలియన్ యూనిట్లలో)

తేదీ	విద్యుత్ వినియోగం	విద్యుత్ లభ్యత	జాతీయ గ్రిడ్ నుంచి వాడిన అదనపు విద్యుత్	మార్కెట్ (ఎక్ఛేంజీ) కొనుగోళ్లు	కొరత
16	228.04	230.44	-2.40	0.68	0.00
17	226.13	227.40	-1.27	0.49	0.00
18	217.87	220.79	-2.92	2.73	0.00
19	225.81	226.88	-1.07	4.30	0.00
20	230.88	229.31	1.57	9.50	0.00
21	232.08	230.55	1.53	17.38	0.00
22	236.11	235.96	0.15	17.02	0.00
23	238.77	237.92	0.85	17.97	0.00
24	238.04	235.28	2.76	23.38	0.00
25	231.97	234.11	-2.14	17.77	0.00



పంకజ్ ఉధాస్

నివాళి

గజల్ గంధర్వుడు

'ముజ్ కో యారో మాఫ్ కర్నా,
మై నషేమే హూ'
'థోడి థోడి పియా కరో'
'షరాబ్ చీజ్ హి ఐసీ'
'సబ్‌కో మాలూమ్ హై మై షరాబీ నహీ'
'చాందీ జైసా రంగ్ హై తేరా'
'కభీ సాయా హై కభీ ధూప్'
'దివారోంసే మిల్ కర్ రోనా అచ్ఛా లగ్తా హై'
'ఆయియే బారిషోం కా మౌసం హై'...
ఒక్కటా రెండా పంకజ్ ఉధాస్ పేరు వినడ గానే ఈ పేరుతో పాటు వినిపించే అమృత గుళికల్లాంటి గజల్స్, పాటలు ఎన్నో ఎన్నెన్నో. గజల్స్‌ను ఎప్పుడూ వినే వాళ్లతో పాటు, ఎప్పుడూ వినని వాళ్లను కూడా తన అభిమా నులుగా చేసుకున్నాడు గజల్ మేస్ట్రో పంకజ్ ఉధాస్. ఎప్పుడూ వినని వాళ్లు ఆయన గొంతు నుంచి ఒక్కసారి గజల్ వింటే మంత్రముగ్ధు లయ్యే వారు. మళ్లీ మళ్లీ వినాలని తపించే వారు. 'ఆహత్' ఆల్బమ్‌తో ఆనందాశ్చర్యాలకు గురి చేసిన పంకజ్ గజల్ ప్రపంచంలో అజరా మరమైన కీర్తిని సొంతం చేసుకున్నారు. సోమవారం ఆయన భౌతికంగా దూరమైనా ప్రతి శ్రోతలో, అభిమానిలో సజీవంగా నిలిచే ఉంటాడు.

గుజరాత్‌లోని జెట్‌పూర్‌లో పుట్టిన పంకజ్ ముగ్గురు అన్నదమ్ములలో చిన్నవాడు. అన్న నిర్మల్ ఉధాస్‌తో ఆ ఇంట్లో గజల్ గజ్జె కట్టింది. మరో అన్న మన్‌హర్ ఉధాస్ బాలీవుడ్‌లో కొన్ని సినిమాలకు పాడాడు. తండ్రి కేశుభాయిదాస్ ప్రభుత్వ ఉద్యోగి. వైణికుడు. ప్రసిద్ధ వైణికుడు అబ్దుల్ కరీమ్ ఖాన్ దగ్గర దిల్‌రుబా నేర్చుకు న్నాడు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ ఇల్లు ఒక సంగీత పాఠశాలలాగ ఉండేది.

వన్స్ అపాన్ ఎ టైమ్ బ్లాక్ అండ్ వైట్ చిత్రాల పాటల నుంచి గజల్స్ వరకు ఆ ఇంట్లో ఎన్నో వినిపించేవి. రాగాలు, స్వరఝరుల గురించి చర్చ జరిగేది.

తనకు ఏమాత్రం సమయం దొరికినా పంకజ్ తండ్రి దిల్‌రుబా వాయించేవాడు. దిల్ రుబా నుంచి వచ్చే సుమధుర శబ్దతరంగాలు పంక జ్‌ను సంగీతం వైపు నడిపించాయి. 'చక్కగా స్కూలు పాఠాలు చదువుకోకుండా ఈ సంగీత పాఠాలు నీకు ఎందుకు నాయనా' అని తండ్రి మందలించి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదీ తెలియ దుగానీ గజల్స్ గురించి, దిల్‌రుబాపై వినిపించే రాగాల గురించి సందేహాలు అడిగినప్పుడు కుమా రుడి సంగీతోత్సాహానికి ఆ తండ్రి మురిసిపోయే వాడు.

ఒక్క సందేహం అడిగితే మూడు సమాధా నాలు చెప్పేవాడు. అంతేకాదు ముగ్గురు కుమారు లను రాజ్‌కోట్(గుజరాత్)లోని 'సంగీత్ అకాడమీ' లో చేర్పించాడు. ఆ కళాశాలలో తబాలా వాయిం చడం నేర్చుకున్న పంకజ్ గులామ్ ఖదీర్ ఖాన్ సాహెబ్ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాడు. డిగ్రీ కోసం ముంబైలోని సెయింట్ జేవియర్ కాలే జీలో చేరిన పంకజ్ 'క్లాస్‌లో సైన్స్ పాఠాలు' కాలేజీ తరువాత శాస్త్రీయ సంగీత పాఠాలపై శ్రద్ధ పెట్టేవాడు. తొలిసారిగా 'కామ్నా' (1972) అనే సినిమాలో పాడాడు పంకజ్. ఆ సినిమా ఫ్లాప్ అయినప్పటికీ గాయకు డిగా పంకజ్‌కు మంచి పేరు వచ్చింది. అయితే ఈ మంచి పేరు తనకు వెంటనే మరో అవకాశాన్ని తీసుకు రాలేదు.

'ఇది కూడా మంచికే జరిగింది. పంకజ్‌కు బోలెడు అవకాశాలు వచ్చి ఉంటే తనకు అత్యంత ఇష్టమైన గజల్స్‌కు అనివార్యంగా దూరం కావాల్సి వచ్చేది' అంటారు పంకజ్ అభిమానులు.

అవకాశాల సంగతి ఎలా ఉన్నా పంకజ్‌లో గజల్స్‌పై ఆసక్తి అంతకంతకూ పెరుగుతూనే పోయింది. 'ఉద్యోగం చెయ్ లేదా వ్యాపారం చెయ్' లాంటి సలహాలు అదేపనిగా వినిపిస్తున్న కాలంలో ఒక అద్భుత అవకాశం తనను వెదు క్కుంటూ వచ్చింది. అమెరికా, కెనడాలలో పది నెలల పాటు ఉన్న పంకజ్ అక్కడ ఎన్నో గజల్ కచే రీలు చేశాడు. 'వాహ్వా వాహ్వా'లతో కూడిన ప్రేక్ష కుల చప్పట్లు అతడి ప్రతిభను ప్రశంసించే సర్టిఫికె ట్లు అయ్యాయి. ఇండియాకు డబ్బులతో కాదు ఉత్సాహంతో... ఆత్మవిశ్వాసంతో వచ్చాడు.

'గజల్స్' కోసమే ఉర్దూ నేర్చుకున్నాడు పంకజ్. గజల్స్ గానంలో మరింత పట్టు సాధిం చాడు. పంకజ్ ఉధాస్ అనే శబ్దం వినబడగానే 'గ జల్' అనేది అతడి పేరు ముందు వచ్చి మెరిసేది.

1980లో తొలి గజల్ ఆల్బమ్ 'ఆహత్'ను తీసుకువచ్చాడు. ఈ గజల్ ఆల్బమ్ తనకు తీసుకు వచ్చిన పేరు అంతా ఇంతా కాదు. పదేళ్ల పోరాటం తరువాత పంకజ్ తొలి ఆల్బమ్ అనూహ్యమైన విజయం సాధించింది. ఇక అప్పటి నుంచి 50 వరకు ఆల్బమ్‌లను తీసుకువచ్చాడు. మ్యూజిక్ ఇండియా 1987లో లాంచ్ చేసిన పంకజ్ 'షా గుఫ్తా' మన దేశంలో కంపాక్ట్ డిస్క్‌పై రిలీజ్ అయిన తొలి ఆల్బమ్. ఇక సినిమాల విషయానికి వస్తే 'ఘాయల్' సినిమా కోసం 1990లో లతా మంగేష్కర్‌తో కలిసి మెలోడియస్ డ్యూయెట్ పాడాడు. ఇక 'నామ్' సినిమాలో 'చిఠ్ఠీ ఆయీ హై' పాట ఎంత పెద్ద హిట్టో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ పాట సూపర్ హిట్ అయిన తరు వాత అవకాశాలు వెల్లువెత్తాయి. అయితే అవకా శాన్ని సొమ్ము చేసుకోవాలని పంకజ్ ఎప్పుడూ అనుకోలేదు.

ఆచితూచి నిర్ణయం తీసుకునేవాడు. రాశి కంటే వాసికి ప్రాధాన్యత ఇచ్చాడు. బహుశా ఇలాంటి విలువలే సంగీత చరిత్రలో అతడికి సము న్నత స్థానం ఇచ్చాయి. సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ కోసం 'ఆదాబ్ అర్జ్ హై' టాలెంట్ హంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించాడు పంకజ్. సినిమా కోసం పాడినా, నటించినా, టీవీ షోలు నిర్వహించినా గజల్స్‌పై తనకు ఉన్న ప్రత్యేక ప్రేమను ఎప్పుడూ కాపాడుకునేవాడు పంకజ్. అందుకే గజల్స్‌ను ప్రేమించే వాళ్ల మదిలో చిరస్థాయిగా, ఇంకో వందేళ్లయినా సజీవంగానే ఉంటాడు.

పంకజ్ ఫేవరెట్ సాంగ్

రేడియోలో వినిపించే బేగం అఖ్తర్ గానామృ తానికి చాలా చిన్న వయసులోనే ఫిదా అయ్యాడు పంకజ్. 'ఆమెది ఒక వినూత్న స్వరం' అంటాడు. భావాలు, భావోద్వేగాలు పాటలో ఎలా పలికించాలో ఆమె గొంతు విని నేర్చుకున్నాడు. 'యే మొహబ్బత్ తేరే అంజామ్ పే' తనకు ఇష్టమైన పాట. ఎప్పుడు వినాలనిపించినా వినేవాడు. పద్దెని మిది సంవత్సరాల వయసులో పంకజ్‌కు ప్రసిద్ధ గజల్ గాయకుడు మెహదీ హాసన్‌తో పరిచయం అయింది. చాలాకాలానికి యూకే టూర్‌లో స్నేహితుడి ఇంట్లో హాసన్‌ను కలుసు కున్నాడు. పంకజ్ గానప్రతిభకు కితాబు ఇచ్చాడు హాసన్. ఈ కితాబు కంటే హాసన్‌తో కలిసి పర్యటించడం, అతడి గొంతును గంటల తరబడి వినడాన్ని బాగా ఎంజాయ్ చేసేవాడు పంకజ్.



అదర్ సైడ్

హీరో జాన్ అబ్రహం పంకజ్‌కు వీరాభి మాని. విద్యాబాలన్, జాన్ అబ్రహమ్, సమీరా రెడ్డిలాంటి వారికి తన మ్యూజిక్ వీడి యోలతో బ్రేక్ ఇచ్చాడు పంకజ్. ఎప్పుడూ సంగీత ప్రపంచంలో తేలియాడినట్లు కని పించే పంకజ్‌కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. స్కూల్, కాలేజీలలో బాగా ఆడేవాడు. పంకజ్ ఫేవరెట్ బౌలర్ బీఎస్ చంద్రశేఖర్. సంగీతం తప్ప ఏమీ తెలియనట్లు ఉండే పంకజ్ మ్యాచ్ లకు సంబంధించి చేసే విశ్లేషణ ఆకట్టుకునేది.

'మీరు క్రికెట్ వ్యాఖ్యాతగా బ్రహ్మాం డంగా రాణించవచ్చు' అని సరదాగా అనే వారు సన్నిహితులు.

పంకజ్‌ను చూసీచూడగానే అంతర్ముఖు డు(ఇంట్రావర్ట్) అని అనిపిస్తుంది అయితే ఆయన చాలా సరదా మనిషి అని, చుట్టు పక్కల వాళ్లను తెగ నవ్విస్తారని చెబుతుం టారు సన్నిహితులు.

డాక్టర్ కావాలనేది పంకజ్ చిన్నప్పటి కల. అయితే సంగీతం అతడిని వేరే దారిలోకి తీసుకువెళ్లింది. డాక్టర్ కాకపోయినా ఆయన పాడే గజల్స్ ఔషధాలలాగే పనిచేసి మన సుకు స్వస్థతను చేకూరుస్తాయి.

ముక్కు సూటి మనిషి

సినిమా రంగంలో అవకాశాలు రావాలంటే 'నిక్కచ్చిగా మాట్లాడే ధోరణి' ఉండకూడదు అంటారు. అయితే పంకజ్ మాత్రం 'నొప్పిం చక తానొవ్వక' అన్నట్లుగా ఎప్పుడూ ఉండే వాడు కాదు. తన మనసులోని మాటను కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేవాడు. బాలీ వుడ్ మ్యూజిక్ ప్రస్తావన వస్తే....

'మ్యూజిక్ ఇండస్ట్రీ పూర్తిగా మారిపో యింది. నాన్-ఫిల్మ్ మ్యూజిక్‌ను పట్టించుకో వడం లేదు. సర్వం బాలీవుడ్ అన్నట్లుగా ఉంది. బాలీవుడ్‌లో తొంభై శాతం మ్యూజిక్ హిప్ హాప్, పంజాబీ, ర్యాప్. ఆర్డీ బర్మన్ క్లాసిక్స్‌లాంటివి ఇప్పుడు వినే పరిస్థితి లేదు. పాటలు స్క్రీన్‌ప్లేలో భాగంగా ఉండడం లేదు. సినిమాను ప్రమోట్ చేయడానికి అన్నట్లుగా ఉంటున్నాయి. బాలీవుడ్‌లోని ఒకప్పటి స్వర్ణ శకం తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తు న్నాను. బాలీవుడ్ గాయకుల్లో పాప్ సంగీత నేపథ్యం నుంచి వచ్చిన వారే ఎక్కువ. ఖవ్వాలి ఎవ్వరికీ పట్టని కళ అయింది' అని నిట్టూర్చేవాడు పంకజ్.

బీబీసీ టాప్ 100 సాంగ్స్‌లో...

'పంకజ్‌తో ఎన్నో విలువైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఆయన పాడిన చిఠ్ఠీ ఆయీ హై పాట మన దేశంలో అందరూ కనెక్ట్ అయ్యేంత రేంజ్‌లో హిట్ అయింది. సినిమాలో ఈ పాట కీలకం. పంకజ్‌లోని సమయ పాలన, క్రమశిక్ష ణను దగ్గరి నుంచి చూసే అవకాశం వచ్చింది' అంటాడు మహేష్ భట్. తన 'నామ్' సినిమా కోసం ఈ పాటను పంకజ్ తో పాడించాడు మహేష్. పాటను ఒక ప్రముఖ గజల్ గాయ కుడితో పాడిస్తే బాగుంటుందని మహేష్‌కు సలహా ఇచ్చారు ప్రఖ్యాత సినీ రచయిత సలీమ్ ఖాన్. బాలీవుడ్‌లో ప్రతి అంశాన్ని 'స క్సెస్‌ఫుల్ ఫార్ములా'తో తూచి కాచి వడబోసే కాలంలో సంజయ్ దత్ సినిమాలోని పాటను గజల్ గాయకుడితో పాడించడం సాహసం అనే చెప్పాలి. ఫార్ములాలు సినిమా వాళ్లకు కానీ, ప్రేక్షకులకు కాదని ఈ పాట విజయం నిరూపించింది. 'చిఠ్ఠీ' పాటను బీబీసీ రేడియో సహస్రాబ్ది 'టాప్ 100' పాటలలో ఒకటిగా ఎంపిక చేసింది. కారణం తెలియదుగానీ ఈ పాట ఆఫర్‌ను తాను మొదట్లో తిరస్కరించా నని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు పంకజ్. ఈ సినిమాలో పంకజ్ గొంతు వినిపించడమే కాదు.. తానూ కనిపిస్తాడు కూడా.

సాగుబడి

శతభిష కార్తె: మార్చి 3 వరకు
పూర్వాభాద్ర కార్తె: మార్చి 4 నుంచి

కరువుకు నెలవైన రాజస్థాన్‌లోనూ ఓ మాజీ ఉపాధ్యాయుడు ముత్యాల పెంపకం చేపట్టి విజయం సాధించటమే కాకుండా ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు పొందారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వినోద్ భారతి (45) మాజీ కంప్యూటర్ ఉపా ధ్యాయుడు. సొంతూళ్లోనే ఉండి మరో పని చేయ డానికి లేక ముత్యాల పెంపకం గురించి ఆలోచించారు.

కరువు నేలలోనూ లాభాల ముత్యాలు!



ఆల్చిప్పలతో వినోద్



వినోద్ ముత్యాల చెరువులను సందర్శిస్తున్న అధికారులు

భువనేశ్వర్ లోని భారతీయ మంచినీటి ఆక్వాక ల్చర్ పరిశోధనా సంస్థలో ఐదేళ్ల క్రితం శిక్షణ పొంది కొండంత ఆశతో 10×5 చెరువులో 500 ఆల్చిప్పలు వదిలారు. వేడి వాతావరణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించకపోవటంతో నెల రోజుల్లోనే 453 ఆల్చిప్పలు చనిపోయాయి. ఆ తర్వాత గానీ, ఆల్చిప్పలు బాగుండాలంటే నీటిలో పిహెచ్ 7.5, ఉష్ణోగ్రత 25–30 డిగ్రీల మధ్య ఉండాలని గ్రహించలేకపోయారు. వేస విలో చెరువుపై షేడ్‌నెట్ వేస్తే చాలదని, 3–4 గంటలకోసారి నీటిని మార్చాల్సిన అవ సరం ఉందని అనుభవపూర్వకంగా గ్రహించారు. వెయ్యి ఆల్చిప్పలు తెచ్చి మళ్లీ చెరు వులో వదిలారు. ఈ సారి 70% విజయం సాధించారు. ఇక ఆ తర్వాత వెనుదిరగలేదు. నాలుగు చెరువులకు ముత్యాల సాగు విస్తరించారు.

ఇటీవల తీసిన పంటలో పది వేల ముత్యాల దిగుబడి తీశారు. అరబ్ దేశాల్లో వ్యాపారు లకు ఒక్కో ముత్యం రూ. 500కు అమ్మి రూ. 20 లక్షల ఆదాయం సంపాదించారు. ఆ నోటా ఈ నోటా విని అధికారులు, రైతులు వినోద్ ముత్యాల చెరువుల్ని ఆసక్తిగా చూస్తు న్నారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు వచ్చి చూశారు. ఏకంగా ప్రధాని మోదీ కూడా ప్రశం సిస్తూ ఆయనకు లేఖ రాశారు. ఆ ఉత్సాహంతో ఇతర రైతులకు శిక్షణ ఇస్తున్నారు వినోద్. రాష్ట్ర ప్రభుత్వం ముత్యాల పెంపకంపై శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

- పుట్టగొడుగులతో యువిబి వెలుగుతో డి-విటమిన్‌ని జోడిస్తున్న ఐఐహెచ్ఆర్
- డి-విటమిన్‌తో సుసంపన్నం చేసిన పుట్టగొడుగులను అప్పటికప్పుడు వండుకు తినొచ్చు / వారం నిల్వ చేసుకోవచ్చు
- ఆ పుట్టగొడుగులను ఎండబెట్టి లేదా పొడి చేసి పెట్టుకుంటే.. ఆరు నెలలు వరకు నిల్వ చేసుకొని ఆహారంగా తీసుకోవచ్చు
- మన దేశంలో మందిలో డి-విటమిన్ లోపం ఉన్నందున.. తక్కువ ఖర్చుతో చేపట్ట దగ్గ మంచి ఆహార వ్యాపారం ఇది



అల్ట్రావైలెట్ కాంతిలో ఉంచి పుట్టగొడుగులను డి-విటమిన్‌తో సుసంపన్నం చేస్తున్న దృశ్యం

డి-విటమిన్ పుట్టగొడుగులు!

డి-విటమిన్.. మనిషి శారీరక, జీవరసా యన పరమైన ఆరోగ్యాన్ని నిర్వహించ డంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషి స్తుంది. కాల్షియం శోషణను సులభతరం చేయడం, రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడం ద్వారా ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన దేశంలో సూర్యరశ్మి పుష్కలంగా ఉన్న ప్పటికీ.. జనాభాలో గణనీయమైన భాగం (50–94%) ప్రజలు కీలక మైన డి-విటమిన్ లోపంతో బాధ పడుతున్నారు. రకరకాల కారణాల వల్ల శరీరానికి ఎండ తగలకపో వటం వల్ల ప్రజలు డి-విటమిన్ లోపానికి గురవుతున్నారు.



డి-విటమిన్‌తో సుసంపన్నం చేసిన ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులు

యువిబి కిరణాల ద్వారా డి-విటమిన్...

అయితే, ఎండబెట్టిన పుట్టగొడుగులను ఆహా రంగా తీసుకోవటం ద్వారా ఈ సమస్యను అధిగమిం చవచ్చు. పుట్టగొడుగు లను అల్ట్రావైలెట్-బి (యువిబి) కిరణాల రేడియేషన్‌కు గురి చేసి నప్పుడు అవి డి-విట మిన్‌ని సంతరించు కుంటాయి. పుట్టగొ డుగుల్లో ఎర్గోస్టె రాల్ మూలకం ఉంటుంది. దీనికి ఎండ లేదా యువిబి కిర ణాలు తగిలిన ప్పుడు సమర్థ వంతంగా డి2 విట మిన్ (ఎర్గో కాల్సిఫెరో ల్) ని ఉత్పత్తి చేయగల గుణం దీనికి ఉంది.

ఎల్మ్ ఆయిస్టర్ (హైప్సిజిగస్ ఉల్మారియస్) రకం పుట్టగొడు గుల పెంపకంపై విస్తృత పరిశోధనలు చేస్తున్న బెంగళూరులోని ఐసీఎఆర్ అనుబంధ సంస్థ భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) శాస్త్రవేత్తలు.. డి-విటమిన్ కలిగిన పుట్టగొడుగు లను ఉత్పత్తి చేసే ప్రత్యేక యువిబి ఎక్స్‌పోజర్ యంత్రాన్ని రూపొందించారు. దేశీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఈ పరికరాన్ని రూపొందించటం విశేషం. దీన్ని రూ. 10–15 వేల ఖర్చుతో సులువుగా అసెంబుల్ చేసుకోవచ్చని ఐఐ హెచ్ఆర్ మష్రూమ్ లాబ్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా. సి. చంద్రశేఖర తెలిపారు. ఇందులో ఒకసారి కిలోన్నర పుట్టగొడు గులను విటమిన్ డితో సుసంపన్నం చేయవచ్చు.

డి-విటమిన్ పుట్టగొడుగులను 6 నెలలు నిల్వ చేసుకోవచ్చు

అంతేకాకుండా, యువిబి కాంతిలో ఉంచటం ద్వారా డి-విటమిన్‌తో సుసంపన్నం చేసిన తాజా పుట్టగొడుగులను తాజాగా అప్పటికప్పుడు నచ్చిన విధంగా వండుకొని తినొచ్చు. లేదా 4–6 డిగ్రీల చల్లని ఉష్ణోగ్రతలో 4–7 రోజులు నిల్వ చేసుకొని వాడుకోవచ్చని ఐఐహెచ్ఆర్ మష్రూమ్స్ ల్యాబ్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా. సి. చంద్రశేఖర 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.



ఎండు పుట్టగొడుగులు

ఇది కూడా వీలుకాని పరిస్థితుల్లో వాటిని ఎండబెట్టి నిల్వచేసి వాడుకో వచ్చు లేదా ఎండబెట్టిన పుట్టగొడుగు లను పొడి చేసి నిల్వ చేసి వాడుకో వచ్చు. ఎండబెట్టి (డీహైడ్రేట్) చేసిన పుట్టగొడుగులను గానీ, వాటిని పొడిగా మార్చి గానీ 6 నెలల వరకు వాడుకోవచ్చు. ప్రకృతి సహజమైన రోజువారీ విటమిన్ డి సప్లిమెంట్‌గా తీసుకోవచ్చు. వీటిలో ఆర్నెల్లకు పైగా డి-విటమిన్ పుష్కలంగా ఉన్నట్లు తమ పరిశోధనల్లో వెల్లడైందన్నారు. ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగు లతో పాటు బటన్ మష్రూమ్స్‌ను కూడా ఈ విధంగా డి-విటమిన్‌తో సుసంపన్నం చేయవచ్చా? అన్న ప్రశ్నకు ఐఐహెచ్ఆర్‌లో తాము ప్రయత్నించలేదని, అయితే, అమె రికాలో ఇప్పటికే వాణిజ్యపరంగా చేస్తున్నారన్నారు.

5 నుంచి 10 నిమిషాలు చాలు...

వ్యక్తికి ఒక రోజుకు 18 మైక్రోగ్రాముల డి-విటమి న్ అవసరం. యువిబి ఎక్స్‌పోజర్ యంత్రంలోని (100 వోల్టుల) కాంతి కింద 5 నిమిషాలు ఉంచిన 50–70 గ్రాముల తాజా ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులను తీసుకుంటే ఒక రోజుకు సరిపడా డి-విటమిన్ అందు తుంది. లేదా యువిబి (100 వోల్టుల) కాంతి కింద 10 నిమిషాలు ఉంచిన 2–3 గ్రాముల తాజా ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులను తీసుకుంటే మనిషికి రోజుకు అవసరమైన డి-విటమిన్ అందుతుందని డా. సి. చంద్రశేఖర 'సాక్షి సాగు బడి'తో చెప్పారు. అంటే, తక్కువ సేపు యువిబి కాంతిలో ఉంచిన ఎక్కువ పుట్టగొడుగులు తిన్నా పర్వాలేదు. ఎక్కువ సేపు యువిబి కాంతిలో ఉంచిన తక్కువ పుట్ట గొడుగులు తిన్నా చాలన్నమాట.

ఎన్నో రకాలుగా తీసుకోవచ్చు...

డి-విటమిన్‌తో సుసంపన్నమైన ఈ పుట్టగొడు గులను అనేక విధాలుగా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పుట్టగొడుగుల పొడిని క్యాప్సూల్ రూపంలో తీసుకోవచ్చు లేదా పుట్టగొడు గుల రసం తీసుకోవచ్చు రాగి ముద్ద వంటి రోజు వారీ ఆహార ఉత్పత్తులతో కలిపి తినవచ్చు లేదా ఈ పొడిని వేడి నీటితో కలిపి సూప్‌గానూ.. డి-విటమి న్ లోపాన్ని భర్తీ చేసుకోవడానికి ఏదో ఒక రీతిలో రోజువారీ ఆహారంలో తీసుకోవచ్చు. ఐఐహెచ్ఆర్ రూపొందించి, ప్రమాణీకరించిన ఈ సాంకేతికత మన దేశ ప్రజల్లో డి-విటమిన్ లోపాన్ని తీర్చడా నికి విలువైన పరిష్కారాన్ని అందిస్తుందని డా. చంద్రశేఖర వివరించారు.



పుట్టగొడుగుల పొడి

మార్చి 5 నుంచి 7వ తేదీ వరకు బెంగళూరు లోని ఐఐహెచ్ఆర్‌లో జరగనున్న జాతీయ ఉద్యాన ప్రదర్శన–2024లో ప్రదర్శించనున్న అనేక కొత్త సాంకేతికతల్లో డి-విటమిన్ ఎన్‌రిచ్‌డ్ మష్రూమ్ టెక్నాలజీ కూడా ఒకటి. ఇతర వివరా లకు.. ఐఐహెచ్ఆర్ మష్రూమ్ లాబ్ ప్రధాన శాస్త్రవేత్త డా. సి. చంద్రశేఖరను సంప్రదించ వచ్చు: 95579 35579, 80575 47150
Chandrashekara.C@icar.gov.in

సౌరశక్తితో పుట్టగొడుగుల పెంపకం

ఏ కాలంలో అయినా సులువుగా ఇంటిపట్టున ఆరుబయటే పుట్టగొడుగుల పెంపకానికి ఉపయోగపడే 'సోలార్ పవర్ ఇంటిగ్రేటెడ్ అవుట్‌డోర్ మష్రూమ్ గ్రోయింగ్ యూనిట్'ను ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు మూడేళ్ల క్రితమే రూపొందించారు. 1.35 × 0.93 × 1.69 మీటర్ల సైజులో ఉండే ఈ సోలార్ యూనిట్‌తో నెలకు 25–28 కిలోల ఎల్మ్ ఆయిస్టర్, వైట్ ఆయిస్టర్ పుట్టగొడుగులను ఉత్పత్తి చేయవచ్చని ఐఐహెచ్ ఆర్ చెబుతోంది. తెలుగు రాష్ట్రాల్లో సీజనల్‌గా పుట్టగొడుగులు పెంచు కోవచ్చు. ఇంటి స్థాయిలో డి-విట మిన్‌తో సుసంపన్నం చేసిన తాజా పుట్టగొడుగులను, ఎండు పుట్టగొడు గులను తయారు చేసుకునే కుటుం బాలతో పాటు వాణిజ్య స్థాయిలో తయారు చేసి విక్రయించాలనుకునే వ్యాపారస్తులకు కూడా ఐఐహెచ్ఆర్ టెక్నాలజీలు ఉపయోగకరంగా ఉంటాయి. పుట్టగొడుగుల ఉత్ప త్తిపై ఐఐహెచ్ఆర్ ఏడాదికి రెండు, మూడు సార్లు 5 రోజుల శిక్షణా శిబిరం నిర్వహిస్తుంటుంది. వచ్చే జూన్ 24–28 తేదీల్లో కూడా శిక్షణా శిబిరం జరగనుంది. ఐఐహెచ్ఆర్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు.





మైదానంలోకి దిగిన హార్దిక్ పాండ్యా

భారత్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకొని సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు. డీవై పాటిల్ టి20 కప్ క్రికెట్ టోర్నీలో రిలయన్స్ జట్టు తరఫున అతను బరిలోకి దిగాడు. బీపీసీఎల్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో 3 ఓవర్లలో 22 పరుగులిచ్చి 1 వికెట్ తీసిన పాండ్యా...10వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 3 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గత ఏడాది వన్డే వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పాండ్యా కాలి మడమకు గాయం కాగా...అప్పటి నుంచి అతను రీహాబిలిటేషన్‌లోనే ఉన్నాడు.

ట్రయల్స్‌కు బజరంగ్, వినేశ్, సాక్షిలకు ఆహ్వానం



ఆసియా చాంపియన్‌షిప్, ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహించే ట్రయల్స్‌లో పాల్గొనాల్సిందిగా స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్, సాక్షి మలిక్‌లను భారత రెజ్లింగ్ సమాఖ్య ఆహ్వానించింది. మార్చి 10, 11 తేదీల్లో ఈ ట్రయల్స్ జరుగనున్నాయి. డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌పై న్యాయపోరాటం చేసిన బజరంగ్, వినేశ్, సాక్షిలపై వివక్ష చూపరాదని పరతు విధిస్తూ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్... డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్‌ను ఎత్తేసింది.

చెలరేగిన షఫాలీ, లానింగ్

ఢిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం



షఫాలీ

బెంగళూరు: టోర్నీ తొలి మ్యాచ్‌లో అనూహ్యంగా చివరి బంతికి ఓటమి పాలైన ఢిల్లీ క్యాపిటల్స్ రెండో పోరులో సత్తా చాటింది. సోమవారం ఏకపక్షంగా సాగిన మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. యూపీకి ఇది వరుసగా రెండో పరాజయం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 119 పరుగులే చేయగలిగింది. శ్వేత సెహ్రావత్ (42 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. ఢిల్లీ స్పిన్నర్ రాధా యాదవ్ (4/20) ప్రత్యర్థిని కుప్పకూల్చగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజాన్ కాప్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఢిల్లీ 14.3 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 123 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (43 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ మెగ్ లానింగ్ (43 బంతుల్లో 51; 6 ఫోర్లు) దూకుడైన ఆటతో అర్ధ సెంచరీలు సాధించారు. స్కోర్లు సమమైన తర్వాత లానింగ్ అవుట్ కాగా, జెమీమా రోడ్రిగ్స్ (4 నాటౌట్) లాంఛనం పూర్తి చేసింది. మరో 33 బంతులు మిగిలి ఉండగానే గెలుపు ఢిల్లీ సొంతమైంది. నేడు జరిగే పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది.

సెమీస్‌లో పట్నా, హరియాణా



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పట్నా పైరేట్స్, హరియాణా స్టీలర్స్ జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎలిమినేటర్–1లో పట్నా పైరేట్స్ 37–35తో దబంగ్ ఢిల్లీ జట్టును ఓడించగా... ఎలిమినేటర్–2లో హరియాణా స్టీలర్స్ 42–25తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. పట్నా తరఫున సచిన్ (9 పాయింట్లు), సుధాకర్ (5), మంజీత్ (5), సందీప్ (5) రాణించారు. ఢిల్లీ తరఫున అషు మలిక్ ఏకంగా 19 పాయింట్లు స్కోరు చేయడం విశేషం. మరో మ్యాచ్‌లో హరియాణా తరఫున వినయ్ (12), శివమ్ (8), మోహిత్ (7) ఆకట్టుకున్నారు. బుధవారం జరిగే సెమీఫైనల్స్‌లో పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్; జైపూర్ పింక్ పాంథర్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

కుర్రాళ్లు కొట్టేశారు

- నాలుగో టెస్టులో భారత్ విజయం
- 5 వికెట్ల తేడాతో ఓడిన ఇంగ్లండ్
- సిరీస్ 3–1తో భారత్ వశం
- రాణించిన రోహిత్, గిల్, జురెల్
- మార్చి 7 నుంచి చివరి టెస్టు



గిల్ జురెల్

కింగ్ కోహ్లి ఈ సిరీస్ నుంచి తప్పుకున్నాడు. తొలి టెస్టులో మంచి ఇన్నింగ్స్ ఆడిన కేఎల్ రాహుల్ గాయంతో తర్వాత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. వైఫల్యంతో శ్రేయస్ అయ్యర్‌ను తీసేశారు. ఇక ప్రధాన బ్యాటింగ్ దళానికి కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్కడే పెద్ద దిక్కు. రజత్ పటిదార్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్... వీళ్లంతా పూర్తిగా కొత్తవాళ్లు! ఈ సిరీస్‌తోనే అరంగేట్రం చేశారు. 11 మందిలో నలుగురు కొత్తవాళ్లతో... మిగతా అనుభవం లేనివారితో... సంప్రదాయ మ్యాచ్‌లాడి ఇంగ్లండ్‌లాంటి 'బజ్‌బాల్' దూకుడు జట్టును ఓడించడం ఆషామాషీ కానేకాదు. కానీ కుర్రాళ్లతో నిండిన టీమిండియా ఆడి గెలిచింది. సిరీస్‌ను సొంతం చేసుకుంది. రోహిత్, కోహ్లి తర్వాత టీమిండియా భవిష్యత్తుకు కొండంత విశ్వాసాన్ని ఈ సిరీస్ ఇచ్చింది.

రాంచీ: ఐదు టెస్టుల సిరీస్‌ను ఆఖరి మ్యాచ్ మిగిలుండగానే భారత్ 3–1తో కైవసం చేసుకుంది. గత మ్యాచ్‌ల్లాగే నాలుగు రోజుల్లోనే ముగిసిన ఈ నాలుగో టెస్టులో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 192 పరుగుల లక్ష్యాన్ని భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ (81 బంతుల్లో 55; 5 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (124 బంతుల్లో 52 నాటౌట్; 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో రాణించారు. తొలి ఇన్నింగ్స్ టాప్‌స్కోరర్ ధ్రువ్ జురెల్ (77 బంతుల్లో 39 నాటౌట్; 2 ఫోర్లు) టెస్టు విజయానికి అవసరమైన పరుగుల్ని అజేయంగా చేసి పెట్టాడు. ఇంగ్లండ్ స్పిన్నర్లలో షోయబ్ బషీర్ 3 వికెట్లు పడగొట్టగా, రూట్, హార్ట్‌లీలకు చెరో వికెట్ దక్కింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కీలకమైన పరుగులు చేసిన కొత్త వికెట్ కీపర్, బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

రోహిత్, గిల్ ఫిఫ్టీ–ఫిఫ్టీ

ఈ టెస్టుతో పాటు సిరీస్ విజయానికి 152 పరుగులు కావాల్సి ఉండగా... ఓవర్‌నైట్ స్కోరు 40/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియాను ఓపెనర్లు రోహిత్, జైస్వాల్ ఒడిదొడుకుల్లేకుండా నడిపించారు. కుదురుగా ఆడుతున్న యశస్వి జైస్వాల్ (44 బంతుల్లో 37; 5 ఫోర్లు)ను జట్టు స్కోరు 84 పరుగుల వద్ద రూట్ బోల్తా కొట్టించాడు. అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాక మరో ఓపెనర్ రోహిత్‌ను హార్ట్‌లీ పెవిలియన్ చేర్చాడు. 99/2 వద్ద ఓపెనర్లే అవుటయ్యారు. ఇక్కడిదాకా టీమిండియా మంచి స్థితిలోనే ఉంది. అయితే బషీర్ స్పిన్నేయడంతో రజత్ పటిదార్ (0), జడేజా (4), సర్ఫరాజ్ (0)లు బ్యాట్లెత్తారు. అప్పుడు భారత్ స్కోరు 120/5. సగం వికెట్లను కోల్పోయింది. ఇక మిగిలిన సగంలో జురెల్ తప్ప అంతా స్పెషలిస్టు బౌలర్లే! లక్ష్యమింకా 72 పరుగుల దూరంలో ఉంది. ఇలాంటి గడ్డు స్థితిలో శుబ్‌మన్, జురెల్ మొండి పోరాటం చేశారు. ఇంగ్లండ్ సారథి స్టోక్స్ వరుసబెట్టి స్పిన్ త్రయం బషీర్, హార్ట్‌లీ, రూట్‌లతోనే బౌలింగ్ వేయించాడు. అయినా ప్రత్యర్థి జట్టుకు పట్టుబిగించే అవకాశమివ్వకుండా... మరో వికెట్ పడకుండా గిల్–జురెల్ జోడీ ఇన్నింగ్స్‌ను నడిపించింది. ఈ క్రమంలో శుబ్‌మన్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... టీ విరామానికి ముందే భారత్ విజయతీరాలకు చేరుకుంది. ఇద్దరు అబేధ్యమైన ఆరో వికెట్‌కు 72 పరుగులు జోడించడంతో టెస్టుతోపాటు సిరీస్ కూడా మన జట్టు వశమైంది.

- వరుసగా మూడు టెస్టుల్లో గెలిచి 3–1తో ఐదు టెస్టుల సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ 64.58 శాతంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ (75) అగ్రస్థానంలో, ఆస్ట్రేలియా (55) మూడోస్థానంలో ఉన్నాయి.
- ఈ టెస్టూ నాలుగో రోజుల్లో ముగియడం... ధర్మశాలలో ఆఖరి టెస్టు (మార్చి 7 నుంచి)కు 9 రోజుల విరామం ఉండటంతో ఇంగ్లండ్ జట్టు సభ్యులు రెండు వేర్వేరు చోట్ల విశ్రాంతి తీసుకోనున్నారు. కొన్నాళ్లు చండీగఢ్, ఆ తర్వాత బెంగళూరుల్లో స్టోక్స్ బృందం సేద తీరుతుంది. మూడో టెస్టుకు ముందూ ఇలాంటి గ్యాపే ఉండటంతో ఇంగ్లండ్ జట్టు అబుదాబిలో విశ్రాంతి తీసుకొని వచ్చింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353; భారత్ తొలి ఇన్నింగ్స్: 307; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 145; భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 55; యశస్వి (సి) అండర్సన్ (బి) రూట్ 37; శుబ్‌మన్ గిల్ (నాటౌట్) 52; రజత్ పటిదార్ (సి) పోప్ (బి) బషీర్ 0; జడేజా (సి) బెయిర్‌స్టో (బి) బషీర్ 4; సర్ఫరాజ్ (సి) పోప్ (బి) బషీర్ 0; ధ్రువ్ జురెల్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (61 ఓవర్లలో 5 వికెట్లకు) 192. వికెట్ల పతనం: 1–84, 2–99, 3–100, 4–120, 5–120. బౌలింగ్: జో రూట్ 7–0–26–1, హార్ట్‌లీ 25–2–70–1, బషీర్ 26–4–79–3, అండర్సన్ 3–1–12–0.

17 స్వదేశంలో భారత్‌కిది వరుసగా 17వ టెస్టు సిరీస్ విజయం. చివరిసారి టీమిండియా సొంతగడ్డపై 2012లో ఇంగ్లండ్ చేతిలోనే ఓడిపోయింది.



మధ్యప్రదేశ్ ఆటగాళ్ల సంబరం

నాలుగు పరుగుల వేదన!

- క్వార్టర్ ఫైనల్లో ఓడిన ఆంధ్ర
- రంజీ సెమీస్‌లో మధ్యప్రదేశ్

ఇండోర్: ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలిసారి సెమీఫైనల్లోకి అడుగు పెట్టాలనుకున్న ఆంధ్ర జట్టు ఆశలు గల్లంతయ్యాయి. సోమవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4 పరుగుల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. 170 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 95/4తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. హనుమ విహారి (136 బంతుల్లో 55; 5 ఫోర్లు) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అనుభవ్ (6/52) ఆరు వికెట్లతో ఆంధ్రను దెబ్బ తీశాడు. 129/8తో ఇబ్బందుల్లో పడిన ఆంధ్ర జట్టును అశ్విన్ హెబర్ (22), గిరినాథ్ రెడ్డి (15) తొమ్మిదో వికెట్‌కు 32 పరుగులు జత చేసి గెలుపు దిశగా తీసుకెళ్లారు. అయితే గిరినాథ్‌నూ అనుభవ్ వెనక్కి పంపించాడు. గెలుపు కోసం చివరి వికెట్‌కు మరో 9 పరుగులు చేయాల్సి ఉండగా ఆంధ్ర నాలుగు పరుగులు జోడించింది. అయితే ఖెజ్రోలియా బౌలింగ్‌లో హెబర్ ఎల్బీడబ్ల్యూ కావడంతో ఆంధ్ర శిబిరం తీవ్ర నిరాశలో మునిగింది. మరో క్వార్టర్ ఫైనల్లో తమిళనాడు ఇన్నింగ్స్, 33 పరుగుల తేడాతో సౌరాష్ట్రను ఓడించి సెమీస్‌లోకి అడుగు పెట్టింది.

ఆంధ్ర జట్టుకు మళ్లీ ఆడను: విహారి



ఇండోర్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) క్రికెటేతర కారణాలతో తనను అవమానపర్చిందని, ఇకపై ఆ జట్టుకు ఆడబోనని భారత టెస్టు క్రికెటర్ గాదె హనుమ విహారి ప్రకటించాడు. తాజా రంజీ ట్రోఫీ సీజన్‌లో ఆంధ్ర టీమ్ క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్ చేతిలో ఓడిన అనంతరం అతను ఈ విషయాన్ని వెల్లడించాడు. సీజన్ తొలి మ్యాచ్ తర్వాత తనను కెప్టెన్సీ నుంచి తొలగించేందుకు కారణమైన ఘటన వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విహారి పేర్కొన్నాడు. 'బెంగాల్‌తో తొలి మ్యాచ్ సమయంలో కెప్టెన్‌గా ఉన్న నేను జట్టు సహచరుడు ఒకరిపై (కేఎన్ పృథ్వీరాజ్) ఆగ్రహం వ్యక్తం చేశాను. రాజకీయ నాయకుడి కుమారుడైన అతను తన తండ్రితో ఈ విషయం చెప్పాడు. దాంతో ఏసీఏ అధికారులు నన్ను కెప్టెన్సీ నుంచి తప్పించారు. నేనేమీ వ్యక్తిగత దూషణకు పాల్పడకపోయినా నాకంటే ఆ ప్లేయర్‌కే ప్రాధాన్యతనిచ్చి ఏసీఏ చర్య తీసుకుంది. భారత్‌కు 16 టెస్టులు ఆడిన నేను గత ఏడాది జట్టు కోసం ఒంటి చేత్తో బ్యాటింగ్ చేశా. 7 సీజన్లలో 5సార్లు నాకౌట్ చేరడంలో కీలక పాత్ర పోషించా. ఆటపై, జట్టుపై ఇష్టంతో సీజన్ ముగిసేవరకు ఆగి ఇప్పుడు ఈ విషయాన్ని చెబుతున్నా. ఇకపై ఆంధ్ర జట్టుకు ఆడను' అని విహారి స్పష్టం చేశాడు. సదరు క్రికెటర్ ప్రవర్తనపై జట్టు సభ్యులంతా తనకు మద్దతుగా నిలిచిన లేఖను కూడా విహారి సోషల్ మీడియాలో పెట్టాడు.

ఏసీఏ వివరణ...

సాక్షి, విశాఖపట్నం: విహారి ఆరోపణల్లో వాస్తవం లేదని ఏసీఏ తెలిపింది. 'విహారి తనను తిట్టాడంటూ ఒక క్రికెటర్ ఏసీఏకు అధికారికంగా ఫిర్యాదు చేసిన మాట వాస్తవం. మా దృష్టిలో ఆటగాళ్లంతా సమానమే. అయితే కెప్టెన్సీ తీసేయడానికి ఇది కారణం కాదు. భారత టెస్టు జట్టులో స్థానం ఆశిస్తున్న విహారి పూర్తి సీజన్‌కు అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో రికీ భుయ్‌ను నియమించాం. గతంలోనూ విహారి మాటతీరుపై ఫిర్యాదులు వచ్చాయి. ముస్తాక్ అలీ టోర్నీ సమయంలో జట్టులో విభేదాలు ఉన్నట్లూ తెలిసింది. ఆంధ్రకు వచ్చినప్పటి నుంచి కూడా విహారి పదే పదే జట్టు మారేందుకు ప్రయత్నిస్తూ ఎన్‌ఓసీలు అడిగాడు. అయితే ఆపై క్షమాపణలు కోరడంతో జట్టు కోసం అతడిని కొనసాగించాం. తాజా ఘటనపై విచారణ జరిపించి తదుపరి చర్యలు తీసుకుంటాం' అని ఏసీఏ స్పష్టం చేసింది.

సినిమా రీల్స్



ప్రభాస్

అందుకే ఆ టైటిల్!

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కథాంశంతో ఈ మూవీ రూపొందుతోంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా టైటిల్‌ని తొలుత 'ప్రాజెక్ట్ కె' అని నిర్ణయించారు. ఆ తర్వాత 'కల్కి 2898 ఏడీ'గా మార్చారు. కొత్త టైటిల్‌పై ఇటు సినిమా ఇండస్ట్రీలోనూ, అటు ప్రేక్షకులు, ప్రభాస్ అభిమానుల్లోనూ ఆసక్తి నెలకొంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' టైటిల్ ఎందుకు పెట్టామనే విషయాన్ని వెల్లడించారు. ''నేను మహాభారతం గురించి వింటూ, స్టార్ వార్స్‌ని చూస్తూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' ఆలోచన వచ్చింది. ఈ చిత్రకథ మహాభారతం కాలం నుంచి మొదలై 2898తో పూర్తవుతుంది. గతంతో ప్రారంభమై భవిష్యత్తుతో ముగుస్తుంది కాబట్టి 'కల్కి 2898 ఏడీ' టైటిల్ పెట్టాం. ఈ మూవీలో ఆరు వేల సంవత్సరాల మధ్య జరిగే కథను చూపించనున్నాం. భవిష్యత్తు ప్రపంచం ఎలా ఉంటుందో చూపే ప్రయత్నం కూడా చేశాం. ఈ క్రమంలోనే ఓ ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. సినిమాలోని ప్రధాన పాత్రలన్నీ ఇండియన్ మైథాలజీ చుట్టే ఉంటాయి. గతంలో హాలీవుడ్‌లో విడుదలైన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'బ్లేడ్ రన్నర్' మూవీ పోలికలు 'కల్కి 2898 ఏడీ'లో ఎక్కడా కనిపించవు. ఓ రకంగా ఇది నాకు సవాల్'' అన్నారు. సి. అశ్వినీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' మే 9న విడుదల కానుంది.



సుహానా ఖాన్

కింగ్ కోసం ట్రైనింగ్

బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్, ఆయన తనయ సుహానా ఖాన్ కలిసి ఓ యాక్షన్ మూవీ చేయనున్నారనే టాక్ వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'కింగ్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారట మేకర్స్. సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది మేలో ఆరంభించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. ఈ సినిమాలో సుహానా ఖాన్‌కు కూడా యాక్షన్ సీన్స్ ఉంటాయట. దీంతో ముందుగా కొంత ట్రైనింగ్ తీసుకుని ఆ తర్వాత సెట్స్‌లో జాయిన్ అవ్వాలని భావించారట సుహానా. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్స్ పర్యవేక్షణలో ఆమె ట్రైనింగ్ తీసుకుంటున్నారని బాలీవుడ్ భోగట్టా. షారుక్ ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్ ('వార్, పఠాన్, బ్యాంగ్ బ్యాంగ్' సినిమాల దర్శకుడు) కలిసి 'కింగ్' సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయాలనుకుంటున్నారు. అలాగే 'కింగ్' సినిమా ఓ కొలిక్కి వచ్చాక షారుక్ ఖాన్ 'పఠాన్' సినిమా సీక్వెల్ 'పఠాన్ 2'ను సెట్స్ పైకి తీసుకువెళ్తారట. 'పఠాన్' సినిమాను తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలోనే సీక్వెల్ రూపొందనుంది.

నటుడు కెన్నెత్ మిచెల్ మృతి



ప్రముఖ హాలీవుడ్ నటుడు కెన్నెత్ మిచెల్ (49) కన్నుమూశారు. 'కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్' వంటి చిత్రాల సిరీస్‌లలో నటుడిగా తనకంటూ ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన 'అమియోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్' (ఏఎల్ఎస్) వ్యాధి కారణంగా ఈ నెల 24న తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు తాజాగా వెల్లడించారు. కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్: డిస్కవరీ, మిరాకిల్, ఛార్మ్స్ ఫర్ ది ఈజీ లైఫ్, బ్లడ్ హనీ, ఘోస్ట్ విస్పర్స్' వంటి పలు చిత్రాల్లో నటించారు కెన్నెత్. 'కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్: డిస్కవరీ' వంటి సినిమాలతో ఆయన బాగా పాపులర్ అయ్యారు. ప్రత్యేకించి 'కెప్టెన్ మార్వెల్' మూవీలో ఆయన చేసిన జోసెఫ్ డాన్వర్ పాత్ర ప్రేక్షకులకు బాగా గుర్తుంటుంది. సినిమాలతో పాటు పలు వెబ్ సిరీస్‌లు, సహాయ పాత్రల్లోనూ నటించి ప్రేక్షకులను అలరించారాయన. కాగా కెన్నెత్ మిచెల్ మృతిపై పలువురు హాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలిపారు.

రాజకీయం నేపథ్యంలో...



నిహాన్, వేణుగోపాలాచారి

నిహాన్, వైష్ణవి కాంబ్లే జంటగా రవి బాసర దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి రాజారెడ్డి'. రజిత రవీందర్ ఎర్ర, సునీత వెంకటరమణ నిర్మించిన ఈ మూవీ మార్చి 1న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ– ''మా ఊరి రాజారెడ్డి' సినిమా స్వర్గీయ రాజారెడ్డిగారిని గుర్తు చేసేలా ఉంటుంది. రాజకీయం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ నిర్మల్ ప్రాంతం వాళ్లు కావడం సంతోషం. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. కాగా.. మంచితనం మూర్తీభవించిన రాజా రెడ్డి (నిహాన్ పాత్ర) నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని యూనిట్ పేర్కొంది. ''మా ఊరి రాజారెడ్డి'ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వెంకటరమణ. ''నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు నిహాన్. ''మా డైరెక్టర్ ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ చేసి మధ్యలో వదిలేస్తే.. సినిమాని నేను పూర్తి చేశాను'' అన్నారు కో డైరెక్టర్ రవీంద్ర సిద్ధార్థ.

క్లైమాక్స్‌ని ఎవరూ ఊహించలేరు



రాశీ సింగ్

''భూతద్దం భాస్కర్ నారాయణ' చిత్రంలో లక్ష్మి అనే రిపోర్టర్ పాత్ర చేశాను. చాలా సహజంగా ఉండే బలమైన పాత్ర నాది. ఈ మూవీలో సస్పెన్స్, రొమాన్స్, పాటలు.. ఇలా అన్నీ ఉన్నాయి. తర్వాత ఏం జరుగుతుందనే సస్పెన్స్ ఆద్యంతం ఉంటుంది. క్లైమాక్స్‌ని ఎవరూ ఊహించలేరు. 'భూతద్దం భాస్కర్ నారాయణ' వంటి మంచి సినిమా చేసినందుకు గర్వంగా ఉంది'' అని హీరోయిన్ రాశీ సింగ్ అన్నారు. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశీ సింగ్ మాట్లాడుతూ– ''మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్శిటీలో చదువుకున్నాను. ఏడాది పాటు ఎయిర్ హోస్టెస్‌గా చేశాను. చిన్నప్పటి నుంచి సినిమాలపై ఆసక్తి ఉండేది. హీరోయిన్ కావాలని చాలా కష్టపడి సినిమాల్లోకి వచ్చాను. మేం మొదట్లో ముంబైలో ఉండేవాళ్లం.. ఇప్పుడు హైదరాబాద్‌కి వచ్చేశాం. తెలుగు పరిశ్రమ, హైదరాబాద్ చాలా నచ్చాయి. ఇక 'భూతద్దం భాస్కర్ నారాయణ' విషయానికొస్తే.. ఆడిషన్‌లో నన్ను ఎంపిక చేశారు పురుషోత్తం రాజ్. కథ నచ్చితే గ్లామర్ రోల్స్ చేయడానికి సిద్ధమే. 'ఆర్య 2' మూవీ చూసి అల్లు అర్జున్‌గారికి ఫ్యాన్ అయిపోయాను. సుహాస్‌కి జోడీగా నేను నటించిన 'ప్రసన్న వదనం' సినిమా త్వరలో విడుదల కానుంది'' అన్నారు.



శ్రుతీ మరాఠే

శ్రుతికి స్వాగతం

మరాఠీ, తమిళ భాషల్లో సినిమాలు చేస్తున్న గుజరాతీ అమ్మాయి శ్రుతీ మరాఠే తెలుగు చిత్ర పరిశ్రమకు వస్తున్నారు. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' సినిమాతో శ్రుతి తెలుగుకు పరిచయం కానున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'దేవర' షూటింగ్‌లో శ్రుతి జాయిన్ అయ్యారు. ఈ విషయాన్ని సోషల్ మాధ్యమాల వేదికగా వెల్లడించారు శ్రుతి. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్ పూర్తి కాగానే పాటల చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ కేరళ వెళ్లాలనే ఆలోచనలో ఉందని సమాచారం. కొరటాల శివ దర్శకత్వంలో కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల కానుంది.

ధైర్యం.. ప్రేమ



రాశీ ఖన్నా

''యోధ'లో భాగం కావటం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం ఒక అద్భుతమైన అనుభూతిని ఇచ్చింది. ఒక మంచి కథతో రూపొందింది. సినిమా కథనంలో ధైర్యం, ప్రేమను చాలా గొప్పగా మిళితం చేశారు. ప్రేక్షకులతో కలిసి ఈ చిత్రాన్ని బిగ్ స్క్రీన్‌పై చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు రాశీ ఖన్నా. సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. మార్చి 15న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాశీ ఖన్నా ఈ విధంగా స్పందించారు. ''యోధ' అనేది ఒక అసాధారణమైన ప్రయాణం. సినిమా కథనం అత్యంత ఆసక్తిగా ఉండటమే కాదు ధైర్యం మరియు దేశభక్తి స్ఫూర్తిదాయకంగానూ ఉంటుంది'' అన్నారు సిద్ధార్థ్ మల్హోత్రా. ఈ చిత్రానికి దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే–పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు.


ఫుల్ కామెడీ



పోసాని కృష్ణమురళి

అజయ్, వంశీ ఏకశిరి, ఆదిత్య శశాంక్ నేతి, రోమిక శర్మ తదితరులు నటించిన చిత్రం 'వి లవ్ బ్యాడ్ బాయ్స్'. పోసాని కృష్ణమురళి, అలీ, సప్తగిరి, పృథ్వీ, శివారెడ్డి కీలక పాత్రల్లో పప్పుల వరలక్ష్మి సమర్పణలో పప్పుల కనక దుర్గారావు నిర్మించారు. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం టీజర్‌ని 'విశ్వంభర' దర్శకుడు వశిష్ఠ రిలీజ్ చేశారు. ''ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గ కథ కథనాలతో ఆద్యంతం నవ్వించే కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు దుర్గారావు.

అందమైన ప్రేమకథ



అపర్ణ, వినాయక్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ జంటగా నటించిన చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ నిర్మించిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ కానుంది. సోమవారం ప్రెస్‌మీట్‌లో దాసరి ఇస్సాకు మాట్లాడుతూ– ''అందమైన ప్రేమకథా చిత్రం ఇది. వాస్తవ ఘటనలతో ఈ మూవీని అద్భుతంగా రాశారు వసంత్ వెంకట్ బాల'' అన్నారు. ''మా సినిమాను ఆడియన్స్ పెద్ద సక్సెస్ చేయాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''ఈ చిత్రంలో యాక్షన్ సీక్వెన్స్ సహజంగా ఉంటాయి. మా చిత్రాన్ని పంపిణీ చేస్తున్న పార్థుకి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	353	72,790
నిఫ్టీ ▽	91	22,122

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	16,013	△	16
డోజోన్స్	39,138	△	7
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▽	22
డాక్స్	17,423	△	4
షాంఘై	2,977	▽	29
నికాయ్	39,234	△	135

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	61,510
బంగారం (22 క్యారట్)	58,580
వెండి (కేజీ)	76,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయకరెన్సీ	81.06	84.74
£	బ్రిటన్ పౌండ్	భారతీయకరెన్సీ	102.77	107.75
€	యూరో	భారతీయకరెన్సీ	87.74	92.23
¥	జపాన్ ఎన్ (100)	భారతీయకరెన్సీ	42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయకరెన్సీ	51.95	56.77
S$	సింగపూర్ డాలర్	భారతీయకరెన్సీ	59.36	64.05
SAR	సౌదీ రియాల్	భారతీయకరెన్సీ	21.20	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయకరెన్సీ	21.67	23.46
¥	చైనా యువాన్	భారతీయకరెన్సీ	10.40	12.49

స్టార్టప్‌లతో ప్రతి నెలా సమావేశం నిర్వహించండి..

ఆర్‌బీఐకి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన

న్యూఢిల్లీ: అంకుర సంస్థలు, ఫిన్‌టెక్ సంస్థల ఆందోళనలను, సమస్యలను పరిష్కరించేందుకు వాటితో నెలవారీ సమావేశాలు నిర్వహించాలని రిజర్వ్ బ్యాంక్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ సంస్థలతో జరిగిన సమావేశంలో మంత్రి ఈ మేరకు సూచనలు చేసినట్లు ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. రేజర్‌పే, క్రెడ్, పీక్‌ఎక్స్‌వీ తదితర 50 సంస్థల టాప్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ భేటీలో పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వివేక్ జోషి, డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తదితరులు, ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా, ఎన్‌పీసీఐ అధికారులు హాజరయ్యారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)పై ఆర్‌బీఐ ఆంక్షల కొరడా ఝుళిపించిన తరుణంలో ఫిన్‌టెక్, స్టార్టప్‌లతో భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, పీపీబీఎల్ ఉదంతంపరమైన ఆందోళనలేమీ అంకుర సంస్థల వ్యవస్థాపకుల్లో కనిపించలేదని అధికారి తెలిపారు. ఈ భేటీలో స్టార్టప్‌లు సైబర్ సెక్యూరిటీ సంబంధ అంశాలను ప్రస్తావించినట్లు వివరించారు.

మహాకుంభ్‌లో వెయ్యి అంకుర సంస్థలు..

మార్చి 18 నుంచి న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగే స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో 1,000 పైచిలుకు అంకుర సంస్థలు, పెద్ద సంఖ్యలో ఇన్వెస్టర్లు, ఇన్‌క్యుబేటర్లు పాల్గొననున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం డీపీఐఐటీ నిర్వహించనుంది. పరిశ్రమకు సంబంధించిన అంశాలపై చర్చలు, మెంటార్ సెషన్లు, మాస్టర్‌క్లాస్‌లు, కీలకోపన్యాసాలు, యూనికార్న్ రౌండ్‌టేబుల్ సమావేశాలు మొదలైనవి ఉంటాయి.



స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ సంస్థలతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశం

అదానీ డిఫెన్స్ కాంప్లెక్స్ షురూ



కాన్పూర్: రక్షణ రంగానికి అవసరమయ్యే మందుగుండు, మిస్సైల్ తయారీకి వీలుగా అదానీ గ్రూప్ భారీ కాంప్లెక్స్‌ను ప్రారంభించింది. ఇది దక్షిణాసియాలోనే అతిపెద్ద కాంప్లెక్స్‌గా... దీనిలో రెండు మెగా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా డిఫెన్స్ తయారీలో ఒక్కిక్క కార్యకలాపాలకు తెర తీసింది. 500 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన దీనిని తయారీ సాకర్యాల కోసం అదానీ డిఫెన్స్ ఏ ఏరోస్పేస్ రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో పూర్తిస్థాయి మందుగుండు సామగ్రి తయారీకి వీలు కల్పించింది.

హైదరాబాద్-బ్యాంకాక్ మధ్య ఇండిగో డైరెక్ట్ ఫ్లైట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండిగో తాజాగా హైదరాబాద్-బ్యాంకాక్ మధ్య నేరుగా సర్వీసులను సోమవారం ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఉదయం 3.55కు విమానం బయల్దేరి 9.05కు బ్యాంకాక్ చేరుకుంటుంది. ఇరు నగరాల మధ్య డైరెక్ట్ ఫ్లైట్ నడుపుతున్న భారతీయ తొలి విమానయాన సంస్థ తామేనని ఇండిగో ప్రకటించింది. భారత్-బ్యాంకాక్ మధ్య ఇండిగో ప్రతి వారం 37 సర్వీసులు నడుపుతోంది.

అక్షరాల్లో ఫోన్ సంభాషణలు

ట్రూకాలర్ సరికొత్త ఫీచర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాలర్ వివరాలను తెలిపే యాప్ ట్రూకాలర్ తాజాగా సంభాషణ ఫీచర్‌ను జోడించింది. ప్రీమియం కస్టమర్ల కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్‌ను జత చేసింది. ఇది కాల్ రికార్డింగ్‌తోపాటు మాట్లాడిన మాటలను అక్షర రూపం చేస్తుంది. ప్రస్తుతానికి ఇంగ్లిష్, హిందీ భాషలకు ఈ ఫీచర్ పరిమితం. ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ వివరాలతో కూడిన సమ్మరీ కూడా ప్రత్యక్షం అవుతుంది.

పీపీబీఎల్ నుంచి విజయ్ ఔట్

పేటీఎమ్ బ్యాంక్ బోర్డు పునర్వ్యవస్థీకరణ



న్యూఢిల్లీ: పేటీఎమ్ పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) బోర్డు నుంచి పార్ట్‌టైమ్ నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విజయ్ శేఖర్ శర్మ తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో బోర్డును పునర్వ్యవస్థీకరించినట్లు పేటీఎమ్ పేర్కొంది. సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ శ్రీధర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ దేవేంద్రనాథ్ సారంగి, బీఓబీ మాజీ ఈడీ గార్గ్, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ రజనీశ్ కొత్త బోర్డును ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

ఎస్‌బీఐ కొత్త ఫండ్‌కు కోట్లలో నిధులు

రూ.6,700 కోట్లు సమీకరణ



ముంబై: ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఓ నూతన పథకం ద్వారా భారీగా నిధులు సమీకరించింది. ఎస్‌బీఐ ఎనర్జీ అపార్చునిటీస్ ఫండ్ పట్ల ఇన్వెస్టర్లు ఎంతో ఉత్సాహం చూపించారు. రూ.5,000 కోట్ల సమీకరణను ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ అంచనా వేయగా, దీన్ని అధిగమించి రూ.6,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అన్ని రకాల పంపిణీ భాగస్వామ్యుల ద్వారా విస్తృతమైన స్పందన వచ్చిందని, దరఖాస్తులు 5 లక్షలు దాటాయని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. పెద్ద సంఖ్యలో కొత్త ఇన్వెస్టర్లు ఈ నూతన ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌ఓ)లో పాల్గొనడం చూస్తుంటే అది ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోందని పేర్కొంది. ఎనర్జీ థీమ్ (ఇంధన రంగం) పట్ల ఇన్వెస్టర్ల నమ్మకానికి నిదర్శనమని తెలిపింది. ఇంధనం, దాని అనుబంధ రంగాల్లో పనిచేసే కంపెనీల్లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీ, డెరివేటివ్స్, డెట్ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెడుతుంది. రాజ్ గాంధీ, ప్రదీప్ కేశవన్ ఫండ్ మేనేజర్లుగా పనిచేయనున్నారు.

లాభాల స్వీకరణ...

- ఐటీ, మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు
- బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- సెన్సెక్స్ నష్టం 353 పాయింట్లు
- 22,150 స్థాయి దిగువకు నిఫ్టీ

ముంబై: ఐటీ, మెటల్, ఫార్మా షేర్లలో విక్రయాల ఒత్తిడితో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 353 పాయింట్లు నష్టపోయి 72,790 వద్ద నిలిచింది. నిఫ్టీ 91 పాయింట్లు క్షీణించి 22,122 వద్ద నిలిచింది. సూచీలకిది రెండో రోజూ నష్టాల ముగింపు. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల ప్రభావంతో ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాలు ఒత్తిడి నెలకొంది. ఒక దశలో సెన్సెక్స్ 472 పాయింట్లు పతనమై 72,667 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు క్షీణించి 22,075 వద్ద ఇంట్రాడే కనిష్టాల్ని తాకింది. అయితే ద్వితీయార్థంలో విద్యుత్, క్యాపిటల్ గూడ్స్, యుటిలిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.38%, 0.06% నష్టపోయాయి. ఆసియాలో జపాన్, తైవాన్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పేటీఎం షేరుకు ఈ రోజు 5% ఎగసి రూ.428.10 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. యూపీఐ హ్యాండిల్ 'ఆపేటీఎం'ను ఉపయోగిస్తున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలను వేరే బ్యాంకులకు మార్చే అవకాశాలను పరిశీలించాలని ఎన్‌పీసీఐకి ఆర్‌బీఐ సూచించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.



ముక్కా ప్రొటీన్స్ @ రూ. 26-28

ఈ నెల 29- మార్చి 4 మధ్య ఐపీవో

ఫిష్ మీల్, ఆయిల్, ఫిష్ సొల్యూబల్ పేస్ట్ తదితర ప్రొడక్టుల కంపెనీ ముక్కా ప్రొటీన్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 29న ప్రారంభంకానుంది. మార్చి 4న ముగియనున్న ఇష్యూకి రూ. 26-28 ధరల శ్రేణి ప్రకటించింది. దీనిలో భాగంగా 8 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 224 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

హోటల్ పరిశ్రమలో కొనసాగనున్న జోరు

- 2024-25లో 7-9% వృద్ధి
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



కోల్‌కతా: దేశ హోటల్ పరిశ్రమ వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ మంచి వృద్ధిని చూడనుంది. 2024-25లో హోటల్ పరిశ్రమ ఆదాయం మొత్తం మీద 7-9 శాతం మేర పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. దేశీయ విహార పర్యటనలు కొనసాగుతుండడం, సమావేశాలు, ప్రోత్సాహకాలు, సదస్సులు, ప్రదర్శనలకు (ఎంఐసీఈ) డిమాండ్ ఉండడం వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధికి మద్దతుగా నిలుస్తాయని ఇక్రా తెలిపింది. సాధారణ ఎన్నికల ప్రభావం స్వల్పకాలమేనని పేర్కొంది. హోటల్ పరిశ్రమ డిమాండ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకం, టైర్-2 సిటీలు కీలక చోదకంగా నిలుస్తాయని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హోటళ్లలో గదుల భర్తీ రేటు (ఆక్యుపెన్సీ) దాదాపు గరిష్ఠంగా 70-72 శాతానికి చేరుకుంటుందని, 2022-23లో ఇది 68-70 శాతమే ఉన్నట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా హోటల్ గదుల రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటున రూ.7,200-7,400 మధ్య ఉంటాయని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.7,800-8,000కు పెరగొచ్చని అంచనా వేసింది. దేశ ఆతిథ్య రంగంపై సానుకూల అవుట్‌లుక్‌ను ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-2-2024	
విశాఖ	500-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
26-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

భవిత

- గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఆర్‌సెట్-2024

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 16 యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థుల కోసం ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఆర్‌సెట్)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా ఏపీలోని వర్సిటీలు, రీసెర్చ్ సెంటర్లు, అనుబంధ కళాశాలల్లో పీహెచ్‌డీ(ఫుల్‌టైమ్/పార్ట్ టైమ్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» విభాగాలు: సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, అగ్రికల్చర్-ఫ్లానింగ్, లా అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ తదితరాలు.
» అర్హత: 55శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ తదితర కోర్సులు) ఉత్తీర్ణులై ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 50శాతం మార్కులు సాధించాలి. పీజీ చివరి సంవత్సరం ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు అర్హులే.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» పరీక్ష విధానం: ఏపీఆర్‌సెట్ ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష. బహుళైచ్ఛిక ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కులు లేవు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది: 19.03.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ తేదీలు: 04.04.2024 నుంచి 07.04.2024 వరకు.
» హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేది: 10.04.2024.
» పరీక్ష తేదీలు: ఏప్రిల్ 2024.
» వెబ్‌సైట్: cets.apsche.ap.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, ముంబైలో 20 పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ బరోడా.. రెగ్యులర్ ప్రాతిపదికన రిస్క్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 20
» పోస్టుల వివరాలు: మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్.
» విభాగాలు: పోర్ట్‌ఫోలియో మానిటరింగ్ అండ్ ఎక్స్‌పోజర్ మేనేజ్‌మెంట్, సెక్టార్/ఇండస్ట్రీ అనలిస్ట్, ఎంటర్‌ప్రైజ్ రిస్క్ మేనేజ్‌మెంట్, క్లైమెట్ రిస్క్, మోడల్ వాలిడేషన్, అనలిటిక్స్, మోడల్ డెవలప్‌మెంట్, ఎన్‌బీఎఫ్‌సీ అండ్ ఎంఎస్‌ఎంఈ సెక్టార్ క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్, ఎంఎస్‌ఎంఈ క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్.
» అర్హత: సంబంధిత విభాగంలో సీఏ, ఎంబీఏ/పీజీ, సర్టిఫికెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:08.03.2024
» వెబ్‌సైట్: www.bankofbaroda.in

డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో యూజీ, పీజీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యా విధానంలో యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» యూజీ ప్రోగ్రామ్: బీఏ, బీకాం, బీఎస్సీ.
» పీజీ ప్రోగ్రామ్: ఎంఏ: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ /ఎకనామిక్స్/హిస్టరీ /పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ /పొలిటికల్ సైన్స్ /సోషియాలజీ/ఇంగ్లిష్ /తెలుగు /హిందీ/ఉర్దూ.
» ఎంఎస్సీ: మ్యాథ్స్/అప్లైడ్ మ్యాథ్స్/సైకాలజీ/బోటనీ/కెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫిజిక్స్/జువాలజీ. ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ.
» డిప్లొమా ప్రోగ్రామ్: సైకలాజికల్ కౌన్సెలింగ్/ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్/రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు/హ్యూమన్ రైట్స్/కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం/ఉమెన్స్ స్టడీస్.
» డిప్లొమా ప్రోగ్రామ్: మార్కెటింగ్ మేనేజ్‌మెంట్/ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.
» సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ఫుడ్ అండ్ న్యూట్రిషన్/లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్/ఎన్‌జీవోస్ మేనేజ్‌మెంట్/ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
» కోర్సు వ్యవధి: యూజీ ప్రోగ్రామ్‌కు మూడేళ్లు, పీజీ ప్రోగ్రామ్‌కు రెండేళ్లు, ఎంఎల్ఐఎస్సీ/బీఎల్ఐఎస్సీ/డిప్లొమా/పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌కు ఏడాది, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌కు ఆరు నెలలు.
» అర్హత: కోర్సులను అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:29.02.2024
» రూ.200 ఆలస్య రుసుముతో రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.03.2024.
» వెబ్‌సైట్: www.braouonline.in

» ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్-2024 నోటిఫికేషన్ విడుదల
» మొత్తం 150 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» సివిల్స్ ప్రిలిమ్స్‌నే ఐఎఫ్‌ఎస్ ప్రిలిమ్స్‌గా పరిగణన

ఐఎఫ్ఎస్‌కు సన్నద్ధత ఇలా!

ఐఏఎస్, ఐపీఎస్‌ల మాదిరిగానే మరో ఆల్ ఇండియా సర్వీస్ ఉంది. అదే.. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్.. సంక్షిప్తంగా ఐఎఫ్ఎస్! కేంద్ర అటవీ శాఖ పరిధిలోని ఈ సర్వీస్‌కు కూడా యూపీఎస్సీనే ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఏటా ఐఎఫ్ఎస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. తాజాగా ఐఎఫ్ఎస్-2024 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.. ఈ పోస్టులకు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం పోస్టులు 150

యూపీఎస్సీ ఐఎఫ్ఎస్-2024 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 150 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

అర్హతలు

యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల్లో కనీసం ఒక సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ లేదా అగ్రికల్చర్/ఫారెస్ట్రీ లేదా ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

ఆగస్ట్1, 2024 నాటికి 21 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో అభ్యర్థుల ఎంపికకు మూడంచెల ఎంపిక విధానాన్ని అనుసరిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

సివిల్స్ ప్రిలిమ్సే.. ఐఎఫ్ఎస్ ప్రిలిమ్స్‌గా

ఐఎఫ్ఎస్ ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమినరీ పరీక్ష. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌నే ఐఎఫ్ఎస్ ప్రిలిమ్స్ పరీక్షగా పరిగణనలోకి తీసుకుంటారు. అంటే.. ఐఎఫ్ఎస్ అభ్యర్థులు ముందుగా సివిల్స్ ప్రిలిమ్స్‌కు హాజరై అర్హత సాధించాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఐఎఫ్ఎస్ మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

రెండు పేపర్లలో ప్రిలిమినరీ పరీక్ష

ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అవి.. జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2. ఒక్కో పేపర్‌కు 200 మార్కులు చొప్పున మొత్తం నాలుగు వందల మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది. ప్రిలిమ్స్‌లో పొందిన మార్కుల ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు 12 మందిని చొప్పున ఎంపిక చేసి ఐఎఫ్ఎస్ అభ్యర్థులకు ప్రత్యేకంగా మెయిన్ పరీక్షలు నిర్వహిస్తారు.

ఆరు పేపర్లుగా మెయిన్

ఐఎఫ్ఎస్ మెయిన్ ఎగ్జామినేషన్‌ను ఆరు పేపర్లలో పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఈ ఆరు పేపర్లలో రెండు పేపర్లు ఉమ్మడిగా, మిగిలిన నాలుగు పేపర్లను అభ్యర్థులు ఎంచుకున్న ఆప్షనల్ సబ్జెక్ట్‌ల సంబంధించినవిగా ఉంటాయి. పేపర్-1 జనరల్ ఇంగ్లిష్-300 మార్కులు; పేపర్-2 జనరల్ నాలెడ్జ్ 300 మార్కులు; పేపర్-3 ఆప్షనల్ సబ్జెక్ట్-1 పేపర్-1, 200 మార్కులు; పేపర్-4 ఆప్షనల్ సబ్జెక్ట్-1 పేపర్-2, 200 మార్కులు; పేపర్-5 ఆప్షనల్ సబ్జెక్ట్-2 పేపర్-1, 200 మార్కులు; పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్-2 పేపర్-2, 200 మార్కులు... ఇలా మొత్తం 1400 మార్కులకు మెయిన్ నిర్వహిస్తారు.

ఆప్షనల్స్.. సబ్జెక్ట్‌ల జాబితా

• ఐఎఫ్ఎస్ మెయిన్‌లో అభ్యర్థులు రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ సబ్జెక్ట్‌ల ఎంపికకు సంబంధించి కొన్ని నిబంధనలు ఉన్నాయి. యూపీఎస్సీ పేర్కొన్న ఆప్షనల్ సబ్జెక్ట్‌ల జాబితా నుంచి సబ్జెక్ట్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల నుంచి ఎంచుకోవాల్సి ఉంటుంది.
• ఆప్షనల్ సబ్జెక్ట్‌లను ఎంచుకునే క్రమంలో.. కొన్ని సబ్జెక్ట్ కాంబినేషన్లను అంగీకరించరు. అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్; అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్; అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ; కెమిస్ట్రీ అండ్ కెమికల్ ఇంజనీరింగ్; మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్; ఇంజనీరింగ్ సబ్జెక్టులకు సంబంధించి ఒక ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌నే ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ఎంపిక చేసుకోవాలి. మరో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా యూపీఎస్సీ నిర్దేశించిన నాన్-ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల నుంచి ఎంచుకోవాలి.

చివరగా పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ

ఐఎఫ్ఎస్ ఎంపిక ప్రక్రియలో చివరి దశ.. పర్సనాలిటీ టెస్ట్. మెయిన్‌లో పొందిన మార్కులు, అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు చొప్పున పర్సనాలిటీ టెస్ట్ పేరుతో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. 300 మార్కులకు నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కులను కలిపి తుది విజేతలను ప్రకటిస్తారు.


ఐఎఫ్ఎస్-2024

ప్రిపరేషన్ పక్కాగా

ప్రిలిమ్స్ నుంచే పట్టు

అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్ష సన్నద్ధత నుంచే పక్కా వ్యూహంతో వ్యవహరించాలి. ముందుగా సిలబస్‌ను పరిశీలించి సన్నద్ధత మొదలుపెట్టాలి. గత ప్రశ్నపత్రాల పరిశీలన ద్వారా ఏ అంశాలకు ఎంత వెయిటేజీ ఉంటోంది.. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రశ్నలు అడిగే తీరు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక ఫోకస్

గత కొన్నేళ్ల ప్రిలిమ్స్ పేపర్ల సరళిని పరిగణనలోకి తీసుకుంటే.. కరెంట్ అఫైర్స్ సంబంధిత అంశాలు, అదే విధంగా కోర్ అంశాలను సైతం సమకాలీన పరిణామాలతో కలిపి అడిగే ప్రశ్నలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ అధ్యయనం సాగించాలి.

జీకే.. ఒకే సమయంలో

మెయిన్ ఎగ్జామినేషన్‌లో పేపర్-2గా జనరల్ నాలెడ్జ్ ఉంటుంది. అభ్యర్థులు ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్ పేపర్-1 ప్రిపరేషన్‌ను మెయిన్స్ జనరల్ నాలెడ్జ్ పేపర్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. అధ్యయనం సాగిస్తే రెండు పేపర్లకు ఒకే సమయంలో సంసిద్ధత పూర్తవుతుంది.

ప్రిలిమ్స్ పేపర్-2

ఇది అర్హత పరీక్షే కాని.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1 మూల్యాంకనం చేస్తారు. ఇందులో రాణించేందుకు బేసిక్ మ్యాథమెటిక్స్, న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ తదితర అంశాలపై పట్టు సాధించాలి.

ప్రిలిమ్స్‌తోపాటే మెయిన్స్

ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఒకే సమయంలో ప్రిపరేషన్ సాగించే విధంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. జనరల్ నాలెడ్జ్‌లో హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్ట్‌లను సమకాలీన సమస్యలతో ముడిపెడుతూ ప్రశ్నలు అడుగుతున్నారు. ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన బేసిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత వార్తల పరిస్థితుల్లో సంబంధిత విభాగాల్లో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

ఆప్షనల్స్‌కు ఇలా

మెయిన్ ఎగ్జామినేషన్‌లో రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లు, ఒక్కో సబ్జెక్ట్‌లో రెండు పేపర్లు చొప్పున మొత్తం నాలుగు పేపర్లకు సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. తమకు బాగా పట్టున్న సబ్జెక్ట్‌లనే ఆప్షనల్స్‌గా ఎంచుకోవాలి. ఆప్షనల్స్‌ను ఎంచుకున్నాక ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన బేసిక్స్, కాన్సెప్ట్స్, ఫార్ములాస్, థీరమ్స్ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. పరీక్షల్లో వస్తున్న ప్రశ్నలను పరిశీలించి.. ఆ దిశగా సాధన ప్రారంభించాలి. అభ్యర్థులు ఆ ఆప్షనల్స్‌ను తమ డొమైన్ సబ్జెక్ట్ నుంచి ఎంచుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

రైటింగ్‌కూ ప్రాధాన్యం

మెయిన్స్ ఎగ్జామినేషన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు రీడింగ్‌తో పాటు మితం కాకుండా.. రైటింగ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక్కో ప్రశ్నకు లభించే సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ప్రాక్టీస్ చేయాలి.

నిర్దిష్ట ప్రణాళిక

అన్ని సబ్జెక్ట్‌లకు సమయం కేటాయించేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. కనీసం రోజుకు రెండు గంటలు చదివేలా సమయ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అదే విధంగా ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దిష్టంగా సమయం కేటాయించుకోవాలి. ఆ సమయంలో ఆ సబ్జెక్ట్‌నే చదవాలి. ఆ తర్వాత మరో సబ్జెక్ట్‌పై దృష్టి పెట్టాలి. ఇలా ప్రిలిమ్స్ నుంచే నిర్దిష్ట వ్యూహాలు అనుసరిస్తూ అధ్యయనం సాగించడం వల్ల ఆశాజనక ఫలితం వచ్చే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

• దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
• ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 5
• దరఖాస్తు సవరణ అవకాశం: 2024 మార్చి 6- 12 వరకు.
• ప్రిలిమ్స్ పరీక్ష తేదీ: 2024, మే 26
• మెయిన్ ఎగ్జామినేషన్: నవంబర్ 24 నుంచి ఏడు రోజులు
• వెబ్‌సైట్: www.upsc.gov.in

బాసరలో రిటైర్డ్ సీజేఐ జస్టిస్ రమణ పూజలు



భైంసా: నిర్మల్ జిల్లా బాసర ఆలయంలో సరస్వతి అమ్మవారిని సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అక్షరాభ్యాస మండపంలో జస్టిస్ రమణ తన మనవడు విరాట్‌కు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆలయ పండితులు ఆశీర్వదించారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

యాదాద్రికి రూ. 3 కోట్ల విలువైన భవనం విరాళం

హైదరాబాద్‌కు చెందిన దంపతుల వితరణ



యాదగిరిగుట్ట: హైదరాబాద్‌లోని చైతన్యపురికి చెందిన హనుమంతరావు– శారద దంపతులు రూ.3 కోట్ల విలువ చేసే 260 గజాల్లోని మూడంతస్తుల భవనాన్ని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళంగా ఇచ్చారు. దీనికి సంబంధించి సోమవారం యాదాద్రి ఆలయం పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తికి అందించారు. నివాస భవనాన్ని ఆలయానికి విరాళంగా ఇచ్చి మియాపూర్‌లోని తమ కుమారుడి వద్ద ఉంటామని హనుమంతరావు–శారద దంపతులు చెప్పారు. దాతలను ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి సన్మానించి శ్రీస్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు.


ముగ్గురు ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్ : ముగ్గురు ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అదనపు సీపీగా పని చేస్తున్న 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్‌ను ఆర్గనైజేషన్ ఐజీగా బదిలీ చేశారు. ఇటీవలే ఐజీగా పదోన్నతి పొందిన 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ హైదరాబాద్ నగర అదనపు సీపీ క్రైమ్స్ నుంచి మల్టీజోన్ 1 ఐజీగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. హైదరాబాద్ సిటీ సెంట్రల్ జోన్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న 2016 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శరత్ చంద్ర పవార్‌ను యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జర్నలిజం ప్రమాణాలు కాపాడతా

మండలస్థాయి వరకు జర్నలిస్టులకు శిక్షణ ఇస్తాం

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, నగదు రహిత వైద్యం అందించడమే నా ప్రాధాన్యం
- 'సాక్షి'తో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



సాక్షి, హైదరాబాద్:

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, వారికి ఉచిత వైద్యం అందించడమే తన ప్రాధాన్యత అని తెలంగాణ మీడియా అకాడమీ నూతన చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిజంలో ప్రమాణాలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. అందుకోసం కింది స్థాయి వరకు జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ, మెటీరియల్ అందజేస్తామన్నారు. అకాడమీ చైర్మన్‌గా ఎంపికైన తర్వాత ఆయన 'సాక్షి' తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం... కొత్త వారికి ఇవ్వడం..

జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నాం. ఎన్నికల సమయంలోనూ ఆయనకు విన్నవించాం. జర్నలిస్టుల సమస్యలేంటో తనకు తెలుసని సీఎం ఇప్పటికే చెప్పారు. అందులో ప్రధానమైనవి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, నగదురహిత వైద్యం. ఇవి అత్యంత కీలకమైనవి. ఈ రెండూ పరిష్కారం కానివి కానేకాదు. మనసుంటే మార్గం ఉంటుంది. గత ప్రభుత్వం ఈ సమస్యపై ముందు మనసు పెట్టినా ఆ తర్వాత మార్గాన్ని నిలిపేసింది. ఈ సమస్యలకు పరిష్కారాలు ఉన్నాయని విశ్వసిస్తున్నాను. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రెవెన్యూ, హౌసింగ్‌శాఖలు కూడా ఉన్నందున జర్నలిస్టుల ఇంటి స్థలాల సాధన సులువవుతుంది. హైదరాబాద్‌లో జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఇప్పటికే వచ్చింది. ఆ తీర్పును అమలు చేయడమే ఇప్పుడున్న కర్తవ్యం. దాన్ని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అలాగే ఇంటి స్థలాల కోసం వేలాది మంది జర్నలిస్టులు వేచి చూస్తున్నారు. వారికి కూడా ఇంటి స్థలం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. దానికి ప్రత్యామ్నాయం వెతకాల్సి ఉంది. స్థలాలు వెతకాలి. కొత్త వారికి భవనాలా? ప్లాట్లా? ఏ రకంగా ఇవ్వాలనేది పరిశీలించాలి. ప్లాట్లు ఇచ్చేట్లయితే 300 గజాలా? 150 గజాలా? అనేది చూడాలి. రానివారికి ఎలా చేయాలన్న దానిపై ఒక ప్రక్రియను మొదలుపెట్టాల్సి ఉంది. సుప్రీంకోర్టు ప్రకారం జర్నలిస్టులకు స్థలాలు అప్పగించడం, కొత్తవారికి ఇవ్వడం రెండూ పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాను.

మండల స్థాయి వరకు శిక్షణ...

మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. జర్నలిజంపై ఉత్సాహంతో ముందుకు వచ్చిన తరానికి దాని ఉద్దేశాలు ఏంటో చెప్పాలన్న లక్ష్యంతో అకాడమీ ఏర్పడింది. మీడియా అకాడమీ లక్ష్యాలకు భిన్నంగా బాధ్యతలు అప్పగించారు. సమాచార శాఖ నిర్వర్తించాల్సిన అంశాలను కూడా దీనికి ఇచ్చారు. అవార్డులు, అక్రెడిటేషన్లు ఇవ్వడం వాస్తవంగా దీని బాధ్యత కాదు. సంక్షేమ కార్యక్రమాలు కూడా దీని పనికాదు. అనేక కారణాలతో వాటన్నింటినీ మీడియా అకాడమీకి అప్పగించారు. జర్నలిజంపై ప్రజల్లో సానుకూలత పెద్దగా లేదు. సోషల్ మీడియాలో ఉచ్చరించలేని భాష వాడుతున్నారు. జర్నలిజంలో ప్రజాప్రయోజనం కీలకం. కానీ ఇప్పుడు పూర్తిస్థాయిలో అలా లేకుండా పోయింది. మీడియాకు పాలసీలు ఉంటాయి. ఎడిటోరియల్ పాలసీ ఉండాలి కూడా. అయితే ప్రజల్లో జర్నలిజంపై భిన్నమైన అభిప్రాయం నెలకొని ఉంది. గతంలో నేను చైర్మన్‌గా ఉన్నప్పుడు రెవెన్యూ డివిజన్ వరకు వెళ్లి జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చాము. వాటిని పునరుద్ధరించడమే ఇప్పుడు కర్తవ్యంగా భావిస్తున్నాను. బడ్జెట్, సైన్స్, లీగల్, క్రైమ్ తదితర అంశాలపై మండల స్థాయి వరకు జర్నలిస్టులకు శిక్షణ ఇస్తాము. జర్నలిజంలో ప్రమాణాలు కాపాడాల్సిన అవసరముంది.

జూన్ 9న గ్రూప్‌-1 ప్రిలిమ్స్

- టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ప్రకటన
- రెండున్నర గంటల పాటు పరీక్ష
- జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీపై 150 ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రిలిమినరీ పరీక్ష ఈ ఏడాది జూన్ 9వ తేదీన నిర్వహించనున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్‌–1 కేటగిరీలో మరో 60 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో.. రెండేళ్ల క్రితం జారీ చేసిన ప్రకటనను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ, గత వారం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ క్రమంలోనే ప్రిలిమినరీ పరీక్ష తేదీని ప్రకటించింది. ప్రిలిమ్స్ రెండున్నర గంటల పాటు నిర్వహిస్తారు. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ అంశాలకు సంబంధించి 150 మార్కులతో కూడిన 150 ప్రశ్నలుంటాయి. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా మెయిన్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.

ముచ్చటగా మూడోసారి ప్రిలిమ్స్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సాగుతోంది. వాస్తవానికి 2022 ఏప్రిల్‌లో 503 గ్రూప్‌–1 ఉద్యోగాలతో కూడిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసింది. అదే ఏడాది అక్టోబర్‌లో ప్రిలిమ్స్ కూడా నిర్వహించింది. కానీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో ఆ పరీక్షను రద్దు చేసింది. తిరిగి 2023 జూన్ 11వ తేదీన ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. పరీక్ష లోపాలపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో పరీక్ష రద్దు చేయాలంటూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీంతో రెండేళ్ల క్రితం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన ప్రభుత్వం.. పోస్టుల సంఖ్యను 563కు పెంచి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ముచ్చటగా మూడోసారి ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది.

దరఖాస్తులో సబ్జెక్టు మార్కుల గందరగోళం

గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఈ నెల 23 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ వచ్చే నెల 14వ తేదీ సాయంత్రం 5గంటల వరకు కొనసాగనుంది. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా మళ్లీ తాజాగా దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. ఇందులో భాగంగా దరఖాస్తు పేజీలో గ్రూప్ సబ్జెక్టులో సాధించిన మార్కులను ఎంట్రీ చేయాలంటూ ఒక కాలమ్ ఉంది. అయితే ఏయే సబ్జెక్టులకు సంబంధించిన మార్కుల మొత్తాన్ని ఎంట్రీ చేయాలనే అంశంపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. గ్రూప్ సబ్జెక్టులకు సరైన నిర్వచనం లేకపోవడంతో వారు తికమకపడుతున్నారు. దీనిపై కమిషన్ హెల్ప్‌డెస్కుకు ఫోన్ చేసినా స్పందన లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది అభ్యర్థులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయకుండా స్పష్టత కోసం వేచిచూస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- పరీక్ష రాయనున్న 9.80 లక్షల మంది
- 1,521 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- ప్రతీ కేంద్రంలోనూ సీసీ కెమెరాలు
- ఈసారి ప్రశ్న పత్రాల్లో తప్పులు రావు: ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శ్రుతి ఓజా సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు మొదలుకానున్నాయి. మార్చి 19 వరకూ జరుగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ప్రాక్టికల్స్ పూర్తయ్యాయి. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 9,80,978 మంది హాజరవుతున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,78,718 మంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,02,260 మంది ఉన్నారు. రెండో ఏడాది ప్రైవేటుగా పరీక్షలు రాసేవారు 58,071 మంది ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ కూడా నిర్వహించారు. ఈసారి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా ఇంటర్ బోర్డ్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పేపర్ లీకేజీకి ఏమాత్రం అవకాశం లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయి అధికారులను మరింత అప్రమత్తం చేశారు. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న సిబ్బందిని విధులకు దూరంగా ఉంచారు.

1,521 పరీక్ష కేంద్రాలు...

ఇంటర్ పరీక్షలకు 1,521 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 407 ప్రభుత్వ జూనియర్ కాలేజీలను, ప్రభుత్వ ఆధీనంలో ఉండే 407 కాలేజీలను, 880 ప్రైవేటు కాలేజీలను పరీక్ష కేంద్రాలకు ఎంపిక చేశారు. 1521 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, ఇదే సంఖ్యలో ప్రభుత్వ అధికారులను పరీక్షలకు వినియోగిస్తున్నారు. 27,900 మంది ఇన్విజిలేటర్లు పరీక్ష విధుల్లో ఉండబోతున్నారు. 200 సిట్టింగ్ స్క్వాడ్లు, 75 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దించుతున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను జిల్లా కేంద్రాలకు తరలించారు.

రంగంలోకి అన్ని విభాగాలు..

→ పరీక్షలు రాసే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. పరీక్ష కేంద్రం వద్ద ప్రాథమిక వైద్య సదుపాయాలు, ఒక నర్సును అందుబాటులో ఉంచాలని కలెక్టర్లు ఆదేశించారు.

→ ప్రతీ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే తెరుస్తారు.

విద్యార్థులకు బోర్డ్ సూచనలు..

→ విద్యార్థులు tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిపై ప్రిన్సిపల్స్ సంతకాలు ఉండాల్సిన అవసరం లేదు. హాల్ టికెట్లు ఇవ్వడానికి కాలేజీలు నిరాకరిస్తే ఇంటర్ బోర్డ్ దృష్టికి తేవాలి.

→ పరీక్ష ప్రారంభమయ్యే 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

→ పరీక్ష కేంద్రంలో పావుగంట ముందే ఓఎంఆర్ షీట్ ఇస్తారు. అభ్యర్థి పూర్తి వివరాలను 9 గంటల లోపు చూసుకుని, తప్పులుంటే ఇన్విజిలేటర్ దృష్టికి తేవాలి.

→ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ప్రింటెడ్ మెటీరియల్స్ కేంద్రాల్లోకి అనుమతించరు.

కౌన్సెలింగ్ కోసం టోల్ ఫ్రీ...

పరీక్షల ఫోబియో వెంటాడుతూ ఆందోళనకు గురయ్యే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి ఇంటర్ బోర్డ్ 'టెలీ మానస్'పేరుతో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసింది. విద్యార్థులు 14416 లేదా 040–24655027 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఈసారి ప్రశ్న పత్రాల్లో తప్పులు రావు: ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శ్రుతి ఓజా

ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శ్రుతి ఓజా సూచించారు. పరీక్షల నేపథ్యంలో ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. అన్ని కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా ప్రతీ కేంద్రాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఈసారి ఎక్కడా ప్రశ్న పత్రాల్లో తప్పులు రాబోవని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి జయప్రదాభాయ్ పాల్గొన్నారు.

ఏటా రెండుసార్లు టెట్!

- జూన్, డిసెంబర్‌లలో నిర్వహించే అవకాశం
- విద్యాశాఖ ప్రతిపాదనకు సీఎం సూత్రప్రాయ అంగీకారం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఏటా రెండుసార్లు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. విద్యాశాఖ ఉన్నతాధికారుల ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై అధికారుల నుంచి ఆయన సమగ్ర నివేదిక కోరారు. అధికార వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం ఏటా జూన్, డిసెంబర్‌లలో టెట్‌ను చేపట్టే వీలుంది. ఉపాధ్యాయ పోస్టుల నియామకాలతో సంబంధం లేకుండా టెట్ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. టెట్ నిర్వహణకు 90 రోజుల సమయం పడుతుందని అధికారులు అంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నోటిఫికేషన్ ఇవ్వాలనేది విద్యాశాఖ ప్రతిపాదన. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని ఆదేశించింది. గతంలో టెట్ చెల్లుబాటు ఏడేళ్లు మాత్రమే. దీన్ని జీవితకాలానికి మార్చారు. కొన్నేళ్లుగా బీఈడీ, డీఐఈడీ వంటి కోర్సులను పూర్తిచేసిన వారు మాత్రమే టెట్ రాసేవారు. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు పేపర్‌–2లో క్వాలిఫై కావాలన్న నిబంధనను పాటించాల్సి ఉండటంతో ఇక నుంచి టీచర్లు సైతం టెట్‌కు పోటీపడనున్నారు. దీంతో టెట్‌కు హాజరయ్యే వారి సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.

'మన వైద్యం'కు ఆస్ట్రేలియాలో ఉపాధి

- మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- వెస్టర్న్ ఆస్ట్రేలియా వైద్య ఉన్నత స్థాయి అధికారుల బృందంతో భేటీ



సాక్షి, హైదరాబాద్: మెడికల్, పారా మెడికల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు వెస్టర్న్ ఆస్ట్రేలియాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం మంత్రితో వెస్టర్న్ ఆస్ట్రేలియా ఆరోగ్యమంత్రి అంబర్ జెడ్స్ అండర్సన్ సహా ఉన్నతస్థాయి వైద్య బృందం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాలో మెడికల్, పారామెడికల్ హెల్త్ కేర్ రంగాలలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై మంత్రి దామోదరతో చర్చించారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడుతూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా నర్సింగ్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రొఫెషనల్స్‌గా శిక్షణ ఇచ్చి ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి చర్యలు తీసుకున్నామన్నారు.


సందీప్ శాండిల్యకు డీజీగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్ : సందీప్ శాండిల్యకు సడైరెక్టర్ జనరల్ (డీజీ) హోదా ఇస్తూ ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1993 బ్యాచ్‌కు చెందిన శాండిల్య అదనపు డీజీ ర్యాంకులో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. డీజీగా పదోన్నతి తర్వాత కూడా అదే పోస్టులో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూగర్భ జలవనరుల శాఖలో ఉద్యోగాలకు జీఆర్‌ఎల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ పరిధిలోని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్షలకు అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్‌ఎల్)ను విడుదల చేసినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జీఆర్‌ఎల్ రూపొందించినట్లు చెప్పారు. అర్హత సాధించినవారి ధ్రువపత్రాల పరిశీలన త్వరలోనే నిర్వహిస్తామని, ఆయా అభ్యర్థులకు సమాచారాన్ని అందిస్తామన్నారు.

మావోయిస్టు కమాండర్ లొంగుబాటు



దుమ్ముగూడెం: మావోయిస్టు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) బెటాలియన్ కంపెనీ–2 కమాండర్ నగేశ్ అలియాస్ ఎర్ర సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయాడు. 2010లో తాడిమెట్లలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన దాడిలో 76 మంది మృతి చెందగా, ఈ కేసులో నగేశ్ ప్రధాన ముద్దాయిగా ఉన్నాడు. నగేశ్‌కు ఎస్పీ రివార్డు చెక్కు అందజేశారు.

కిరాయి ఇళ్లలో కిరికిరి!



గృహజ్యోతి వెలుగులు కొందరికే!

- తొమ్మిది సర్కిళ్లు... 48,03,963 గృహ కనెక్షన్లు
- 200 యూనిట్లలోపు వాడేవారు 30 లక్షలపైనే
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 19.85 లక్షలు
- రేషన్‌కార్డు ఉన్నవారు 17.21 లక్షల మంది
- ఇప్పటి వరకు రేషన్, ఆధార్ లింకైన కనెక్షన్లు 11 లక్షలు
- నేడు గృహజ్యోతి పథకం ప్రారంభోత్సవం

సాక్షి, హైదరాబాద్: గృహజ్యోతి పథకం కిరాయి ఇళ్లలో కొత్త కిరికిరికి కారణమవుతోంది. ఇంటి యజమానికి, అద్దెదారులకు మధ్య వివాదానికి కారణమవుతోంది. అద్దెకు ఉన్నవారు తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌ను కరెంట్ కనెక్షన్‌కు అనుసంధానం (మ్యాపింగ్) చేయాల్సిందిగా కోరుతుండగా, ఇందుకు యజమానులు ససేమిరా అంటున్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు వస్తాయనే భావనతో మెజార్టీ ఇళ్ల యజమానులు ఇందుకు అంగీకరించడంలేదు. ఫలితంగా ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా త్వరలో అమలు చేయబోతున్న గృహజ్యోతి పథకానికి వీరందరికీ అర్హత ఉన్నా..లబ్ధి పొందే అవకాశం లేకుండా పోతోంది. గ్రేటర్ జిల్లాల పరిధిలోని తొమ్మిది సర్కిళ్ల ఉండగా, వీటిలో 48,03,963 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులు 30 లక్షల మందికిపైగా ఉన్నట్లు అంచనా. అంతేకాదు కొన్ని ఇళ్లలో ఒకే మీటర్ ఉండటం, రెండు, 3 కుటుంబాలు అద్దెకు ఉండటం కూడా ఇబ్బందిగా మారింది. ఈ అంశంపై ఇటు డిస్కం అధికారులు కానీ, అటు ప్రభుత్వం కానీ స్పష్టత ఇవ్వకపోవడం లబ్ధిదారుల్లో ఆందోళనకు కారణమవుతోంది.

11 లక్షలకు మించలే.. : ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా ప్రభుత్వం మంగళవారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించబో తోంది. ఇకపై నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచిత విద్యుత్ సహా రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయబో తోంది. ఆయా పథకాలకు రేషన్‌కార్డు/ఆధార్‌కార్డు/ఫోన్ నంబర్లను తప్పనిసరి చేసింది. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మూడు జిల్లాల నుంచి 19.85 లక్షల దరఖాస్తులు గృహజ్యోతి పథకం కింద అందాయి. అయితే వీరిలో 17.21 లక్షల మందికి మాత్రమే రేషన్ కార్డులు ఉన్నాయి. చాలా మందికి రేషన్ కార్డులు లేక పోవడంతో వారంతా తమ కనెక్షన్లను ఈ ఉచిత పథకానికి అనుసంధానం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అంతేకాదు రేషన్‌కార్డు ఉన్న వాళ్లు కిరాయి ఇళ్లలో ఉంటుండటం, ఇంటి యజమానులు వారి వివరాలను డిస్కంకు ఇచ్చేందుకు నిరాకరిస్తుండటంతో వారంతా ఈ పథకానికి నోచుకోలేక పోతున్నారు. ఇదిలా ఉంటే విద్యుత్ కనెక్షన్లకు ఆధార్/రేషన్‌కార్డుల అనుసంధానం ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని డిస్కం ప్రకటించింది. సమీపంలోని ఈఆర్‌ఓ కేంద్రాల్లో కానీ, సెక్షన్ ఆఫీసుల్లో కానీ వీటిని నమోదు చేయించుకోవాలని సూచిస్తుంది.

తొమ్మిది సర్కిళ్ల పరిధిలో అనుసంధానం చేసిన కనెక్షన్లు...

సర్కిల్	గృహవిద్యుత్ కనెక్షన్లు	రేషన్‌కార్డు/ఆధార్ లింకు చేసినవి
బంజారాహిల్స్	3,12,684	59,014
సైబర్‌సిటీ	5,30,357	94,452
హబ్సిగూడ	7,30,963	1,62,517
సెంట్రల్ సర్కిల్	4,97,825	94,502
సౌత్ సర్కిల్	5,41,453	1,28,031
మేడ్చల్	7,07,909	1,49,322
రాజేంద్రనగర్	4,54,725	1,59,787
సరూర్‌నగర్	6,08,798	1,47,790
సికింద్రాబాద్	4,19,249	93,500

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్యలపై దృష్టిపెట్టి ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడుతున్నామని, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'తెలంగాణ పునర్ నిర్మాణం–అభివృద్ధి దృక్పథాలు' అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి హాజరై జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్య, నిరుద్యోగం, నీటి ప్రాజెక్టులు, ధరణి విషయంలో వైఫల్యం చెందిందని, అందుకే ఓటమి పాలైందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే 19 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మార్చి 2న మరో 6 వేల మందికి నియామక పత్రాలను అందచేయనున్నట్లు వివరించారు. మార్చి 1 నుంచి 7 వరకు మండల కార్యాలయాల్లో ధరణి సమస్యలను పరిష్కరించనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ధరణిపై 2.45 లక్షల దరఖాస్తుల అందినట్లు వివరించారు. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో ఊహించని విధ్వంసం జరిగిందని ప్రొ.కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్‌ఎండీఏ భూములపై సీఎం ఆరా

భూముల లెక్కలు చేపట్టిన హెచ్‌ఎండీఏ

- ముఖ్యమంత్రికి నివేదికను సమర్పించేందుకు చర్యలు
- రెండు రోజులుగా వివరాల సేకరణలో అధికారులు బిజీ..



సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ భూములపైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా దృష్టి సారించారు. హెచ్‌ఎండీఏకు ఏడు జిల్లాల పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయో తెలియజేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ ఎస్టేట్ విభాగం గత రెండు రోజులుగా భూములు లెక్కలు తేల్చేందుకు కసరత్తు చేపట్టింది. ఆదివారం సెలవు దినమైనప్పటికీ ఆ విభాగానికి చెందిన అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరై వివరాలను సేకరించినట్లు తెలిసింది. మరోవైపు హెచ్‌ఎండీఏ భూములపైన ముఖ్యమంత్రికి నివేదికను అందజేసేందుకు హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ సోమవారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల వివరాలపైన అధికారులు ఒక ప్రాథమిక నివేదికను సిద్ధం చేసినట్లు తెలిసింది. కమిషనర్ ఈ నివేదికను పరిశీలించారు. అన్ని వివరాలతో నివేదికను సమగ్రంగా రూపొందించాలని సూచించారు. దీంతో ఎస్టేట్ విభాగం సోమవారం కూడా భూముల లెక్కలను నిగ్గు తేల్చే పనిలో ఉండిపోయింది. ఒకటి,రెండు రోజుల్లో ముఖ్యమంత్రికి హెచ్‌ఎండీఏ భూములపైన సమగ్రమైన నివేదికను అందజేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నిఘా లేక అన్యాక్రాంతం...

వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు వేల ఎకరాల భూములను అప్పగించింది. హెచ్‌ఎండీఏ భూములతో పాటు, రైతుల నుంచి సేకరించిన భూముల్లోనూ గతంలో లే అవుట్‌లను వేసి ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించారు.బుద్వేల్, కోకాపేట్, మోకిలా,బాచుపల్లి, ఉప్పల్ భగాయత్, బోడుప్పల్, తొర్రూర్, హయత్‌నగర్, తదితర ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ భూములను విక్రయించారు. గతేడాది వరకు సుమారు రూ.5000 కోట్లకు పైగా ఈ భూములపైన ఆదాయం లభించినట్లు అంచనా.మరోవైపు చాలా చోట్ల హెచ్‌ఎండీఏకు పెద్ద మొత్తంలో భూములు ఉన్నప్పటికీ వాటిపైన సరైన వివరాలు లేకపోవడం వల్ల, రక్షణ చర్యలు కొరవడం వల్ల కబ్జాకు గురయ్యాయి. బంజారా హిల్స్, జూబ్లీహిల్స్,గచ్చిబౌలి వంటి ప్రధాన ప్రాంతాల్లో ఉన్న భూములకు కూడా రక్షణ లేకుండా పోయింది.ఇటీవల శంషాబాద్‌లో కబ్జాకు గురైన భూములపైన కోర్టులో హెచ్‌ఎండీఏ గెలిచిన సంగతి తెలిసిందే.కానీ చాలా చోట్ల హెచ్‌ఎండీఏకు ఉన్న భూములపైన సరైన అంచనాలు లేకపోవడం గమనార్హం.గతంలో వ్యాపారవర్గాలకు లీజుకు ఇచ్చిన భూములపైన కూడా సరైన అంచనాలు లేవు. లీజు చెల్లింపులు కూడా సరిగ్గా జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌ఎండీఏ భూములపైన దృష్టి సారించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం ప్రభుత్వం నిధుల లేమితో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న దృష్ట్యా హెచ్‌ఎండీఏ భూములను విక్రయించి ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943